www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రాయ్‌బరేలీకే రాహుల్ సై!

వయనాడ్‌ను వదులుకోవాలని నిర్ణయం.. అక్కడి నుంచి పోటీ చేయనున్న ప్రియాంక

క్లిష్ట పరిస్థితుల్లో నా వెంట నిలిచారు.. వయనాడ్ ప్రజలకు రాహుల్ కృతజ్ఞతలు

అక్కడ అన్న లేని లోటు లేకుండా చూస్తా: ప్రియాంక

కేరళను కాంగ్రెస్ రాజకీయ ఏటీఎంగా భావిస్తోంది: బీజేపీ

లోక్‌సభలో విపక్ష నేత పదవి తీసుకోవటానికి రాహుల్ విముఖం

కుమారి షెల్జా, గౌరవ్ గొగోయ్, మనీశ్ తివారీల్లో ఒకరికి ఆ చాన్స్

2



మంగళవారం | 18-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 63 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 6.25 తదుపరి ద్వాదశి; నక్షత్రం: స్వాతి మ.3.56 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.9.52-11.34; దుర్ముహూర్తం: ఉ.8.21-9.13, రా.10.22-11.04; అమృతఘడియలు: ఉ.6.21-8.06; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.47 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అప్పనంగా అప్పగించారు

450 కోట్ల రుషికొండ మహల్‌లో 120 కోట్లు సోకులకే

సమీప బంధువు సుప్రియారెడ్డికే ఆ ఖరీదైన వర్క్

ఐటీ సలహాదారు శ్రీనాథ్‌రెడ్డి భార్య సుప్రియ

జగన్ బెంగళూరు, హైదరాబాద్ ప్యాలెస్ పనులూ ఈమెవే

వైసీపీ అధికారంలోకి వచ్చాక సొంత కంపెనీ

తొలుత తాడేపల్లి పనులు.. తర్వాత రుషికొండ వర్క్

పాంథియన్ డిజైన్స్ పేరిట ఖరీదైన ఇంటీరియర్, డిజైన్లు

ప్రభుత్వ టూరిజం ప్రాజెక్టులన్నీ ఆమె కంపెనీకే

ఏ ప్రతిపాదికన ఇచ్చారు? బంధువనేదే అర్హతా?

రూ. వందకు అయ్యే పనికి వెయ్యి రూపాయలు 12

నీళ్లలా రూ. వందల కోట్ల ప్రజాధనం ఖర్చు

కుటుంబం కోసం జల్సా మహల్‌ను కట్టుకున్న జగన్, దానికి సంబంధించిన ఖరీదైన 'పనుల'ను తన సమీప బంధువుకే అప్పగించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. రుషికొండకు గుండు కొట్టించి కట్టిన ప్యాలెస్ ఖరీదు రూ.450 కోట్లు. ఇందులో కేవలం ప్యాలెస్‌కు సోకుల కోసమే రూ.120 కోట్లకుపైగా ఖర్చుచేశారు. ఈ వర్క్స్‌ను తన సమీప బంధువు సుప్రియారెడ్డికి జగన్ అప్పగించారు. ఆయన రెండో కంటికి తెలియకుండా మూడేళ్లలో ఏకంగా రాజభవనాన్నే నిర్మించుకున్నారు. అలాగే, మూడో మనిషి చొరబడకుండా ప్యాలెస్‌లోని పనులను కూడా సమీప బంధువుకే అప్పగించిన వైనం ఇప్పుడు పర్యాటక శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఛత్తీస్‌గఢ్ కరెంటుతో..

6 వేల కోట్ల భారం!

తెలంగాణ విద్యుత్తు సంస్థలపై మోయలేని బరువు పడిందంటున్న ప్రభుత్వ వర్గాలు



యూనిట్ ధర రూ. 3.90 మాత్రమేనని లెక్కలు

ట్రాన్స్‌మిషన్, లైన్‌చార్జీలు కలిపి తడిసి మోపెడు!

యూనిట్‌కు రూ. 5.64 ఖర్చు అయినట్లు అంచనా

విద్యుత్తు కారిడార్ బుకింగ్‌తో అదనపు నష్టం

బుకింగ్‌ను రద్దు చేసుకున్నందుకూ పరిహారం

విద్యుత్తు ఒప్పందానికి ఆమోదం తెలపని ఈఆర్సీ

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేయడం ద్వారా తెలంగాణ విద్యుత్తు సంస్థలపై పెనుభారం పడిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయంతో సుమారు రూ.6 వేల కోట్ల మేర ఆర్థికభారం పడినట్లు అంచనా వేశాయి. ఒప్పందం ప్రకారం యూనిట్ ధర రూ.3.90 మాత్రమేనని చెబుతున్నప్పటికీ.. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు తెలంగాణకు చేరేటప్పటికి అయిన ఖర్చుతో కలిపి ఆ ధర భారీగా పెరిగిపోయిందని అంటున్నాయి. ఆ రాష్ట్రం నుంచి తెలంగాణ ఇప్పటివరకు 17,996 మిలియన్ యూనిట్ల విద్యుత్తును కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.7,719 కోట్లు చెల్లించింది. అయితే ఇంకా చెల్లించాల్సిన బకాయిలు రూ.1,081 కోట్లు ఉన్నాయి. దీంతోపాటు ట్రాన్స్‌మిషన్, లైన్ చార్జీలు రూ.1,362 కోట్లు అయ్యాయి. ఇలా వీటన్నింటినీ లెక్కలోకి తీసుకుంటే ఒక్కో యూనిట్‌కు ఖర్చు రూ.5.64 వరకు అవుతోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అంటే.. విద్యుత్తు కొనుగోలు చేసిన ధర కంటే చార్జీల రూపంలోనే రూ.3,110 కోట్ల అదనపు భారం పడినట్లయిందని గుర్తు చేస్తున్నాయి. ఇదిలా ఉండగా.. బకాయిల విషయంలోనూ రెండు

మిగతా 13వ పేజీలో...

తొలి ఏకాదశి నుంచి

రుణమాఫీ!

జూలై 17న మొదలు పెట్టి

ఆగస్టు దాకా మూడు

విడతల్లో ప్రక్రియ పూర్తి

ఐటీ రిటర్నులు

దాఖలు చేస్తున్న రైతులు,

ఉద్యోగులకు ఇబ్బంది లేదు

ఆదాయపన్ను కడుతున్న

వారికి మాత్రం మాఫీ లేదు

4 రోజుల్లో మంత్రివర్గం భేటీ

అందులోనే

విధివిధానాల ఖరారు

రుణమాఫీకి 25వేల కోట్లు

అవసరమని అంచనా

13



కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే

కృష్ణమోహన్‌రెడ్డి?

చేరికపై కొనసాగుతున్న చర్చలు 13

స్థానిక సమీకరణాలపై కసరత్తు

నిర్ణయం తీసుకోలేదన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే



మళ్లీ ఎన్నికల మూడ్‌లోకి బీజేపీ

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి జమ్మూకశ్మీర్ బాధ్యతలు

ఎన్నికల ఇన్‌చార్జిగా అధిష్ఠానం ప్రకటన

మహారాష్ట్రకు.. కేంద్ర మంత్రులు

భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్

హరియాణాకు ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్

ఝార్ఖండ్‌కు శివరాజ్, హిమంత

అసెంబ్లీ ఎన్నికలకు కమలం కసరత్తు

న్యూఢిల్లీ, జూన్ 17: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు వారాలు కూడా గడవకముందే బీజేపీ పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కసరత్తు ప్రారంభించింది. మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాలకు పార్టీ ఇన్‌చార్జిల పేర్లను సోమవారం ప్రకటించింది. అత్యంత కీలకమైన మహారాష్ట్రకు ఇద్దరు కేంద్ర మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించింది. కేంద్ర పర్యావరణ

మిగతా 2వ పేజీలో...



పశ్చిమ బెంగాల్‌లోని నిర్మల్‌జోటె వద్ద కాంచన్‌జంగా రైలును గూడ్స్ రైలు ఢీకొన్న ప్రమాద తీవ్రతకు అద్దం పట్టే దృశ్యం. ఈ ఘటనలో కాంచన్‌జంగా బోగీల్లో ఒకటి గాల్లోకి లేచింది.

విషాద ప్రయాణం

బెంగాల్‌లో కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టిన గూడ్స్.. 9 మంది దుర్మరణం

సంఖ్య పెరిగే అవకాశం!.. 41 మందికి తీవ్రగాయాలు.. పలువురు విషమం

సిగ్నల్ పడినా ఆగని గూడ్స్!.. ఈ మార్గంలో అందుబాటులోకి రాని 'కవచ్'

మృతుల కుటుంబాలకు 10 లక్షల పరిహారం.. గాయపడినవారికి 2.50 లక్షలు

అధ్వాన నిర్వహణతోనే ప్రమాదాలు: ఖర్గే, రాహుల్.. అనాథలా రైల్వే: మమత

1,500 కి.మీ. మార్గంలోనే 'కవచ్' | దేశవ్యాప్త నెట్‌వర్క్‌లో ఇది 1 శాతమే 2 ఈ ఏడాదిలోగా మరో 3 వేల కి.మీ.లలో..

న్యూజల్పాయ్‌గురి/కోల్‌కతా, న్యూఢిల్లీ, జూన్ 17: మరో రైలు ప్రమాదం..! కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటన మరువకముందే.. విశాఖ-రాయగడ ప్యాసింజర్ రైళ్ల ప్రమాదం మర్చిపోకముందే.. ఇంకో ఉదంతం! పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం ఒకే ట్రాక్‌పైకి వచ్చిన రెండు రైళ్లు ఢీకొన్నాయి. దీంతో 9మంది ప్రాణాలు కోల్పోయారు. 41 మంది గాయపడ్డారు. వీరిలో తీవ్ర గాయాలతో

మిగతా 2వ పేజీలో...

28 మంది ఐపీఎస్‌ల బదిలీ



ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా రితిరాజ్

సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు హర్షవర్ధన్

సీఐడీకి విశ్వజిత్.. ఐదుగురికి పోస్టింగ్ నిల్

డీజీపీ ఆఫీసులో రిపోర్టుకు ఆదేశం

త్వరలో రెండో దశ.. కీలక బదిలీలు అప్పుడే!

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో పలువురు నాన్ కేడర్ ఎస్పీలు కూడా ఉన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీగా ఉన్న రితిరాజ్ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. మంచిర్యాల డీసీపీగా

మిగతా 13వ పేజీలో...

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ బాధ్యతలు ఎవరికో?

1 సునీల్ శర్మ పదవీ విరమణతో ఖాళీగా ముఖ్య కార్యదర్శి పోస్టు

1 సమర్థుడైన అధికారిని నియమించే ఆలోచనలో సర్కారు 13

1 రాష్ట్రంలో మరికొందరు ఐఏఎస్‌ల బదిలీలపైనా కసరత్తు

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా

సురేశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి నియమితులయ్యారు. కె.కేశవరావు స్థానంలో సురేశ్‌రెడ్డిని నియమిస్తున్నట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటరీ జనరల్, లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు కేసీఆర్ వేర్వేరుగా లేఖలు పంపారు.

ఉద్యోగ వర్గాలకు కేంద్రం ఊరట!

ఆదాయపు పన్ను తగ్గించే యోచన

మధ్యతరగతి ప్రజల వద్ద

డబ్బు మిగిలేలా ఆర్థిక విధానాలు 2

బడ్జెట్‌పై కొనసాగుతున్న కసరత్తు

పోలవరానికి జగనే శాపం

ఆయన మూర్ఖత్వంతో 12

ప్రాజెక్టు సర్వనాశనం

ప్రజాభిప్రాయం మేరకు చర్యలు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

పోలవరం పూర్తికి మరో 4 ఏళ్లు

సీఎంకు అధికారుల ప్రజెంటేషన్



ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి

రూ. 31 వేల కోట్లు!

ఉత్తర, దక్షిణ భాగాలకు కలిపి అధికారుల అంచనా వ్యయం

350 కిలోమీటర్ల రోడ్డుకు 4,500 హెక్టార్ల భూమి అవసరం

ఉత్తర భాగం నిర్మాణానికి ఆగస్టులో రాష్ట్ర సర్కార్ టెండర్లు

పరిహారంలో 50% చెల్లింపు కోసం హడ్కో నుంచి రుణం!

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులకు అడుగులు వేగంగా పడుతున్నాయి. ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మించే ఈ రహదారి నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంపై అధికారులు ఒక అంచనాకు వచ్చారు. రెండు భాగాలు కలిపి మొత్తం 350 కిలోమీటర్ల మేర నిర్మాణం కానున్న ఆర్ఆర్ఆర్‌కు రూ.31 వేల కోట్ల మేర నిధులు ఖర్చవుతాయని లెక్కగట్టారు. తొలుత నిర్మాణం చేపట్టే ఉత్తరభాగం

మిగతా 3వ పేజీలో...

డీజే.. డ్రగ్స్ జాకీ

మత్తు మందు తీసుకుని.. పబ్‌లకు డిస్క్ జాకీ

అతడితో టచ్‌లో ఉన్న 16 మందికి పరీక్షలు..!

డీజే మరో ఇద్దరు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ

విద్యాసంస్థల్లో బ్యాగులన్నీ తనిఖీ చేయాల్సిందే

టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య స్పష్టీకరణ

ఒక్క రోజే.. 349 మంది తాగి దొరికిపోయారు

వీరిలో 21 నుంచి 30 ఏళ్లలోపు వారే అధికం

మాదాపూర్‌లో అత్యధికంగా 74 మంది పట్టివేత

సైబరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

గంజాయి అలవాటు చేసి.. విక్రేతలుగా మార్చి..

ఏపీకి చెందిన తండ్రీ, కుమారుల ఘరానా దందా

వారితో సహా 12 మంది అరెస్ట్



మిర్యాలగూడలో స్వాధీనం చేసుకున్న గంజాయి, నగదు, ఫోన్లు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మిర్యాలగూడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పలు పబ్‌లలో డిస్క్ జాకీ (డీజే)గా పని చేస్తున్న వ్యక్తితో పాటు అతడితో టచ్‌లో ఉన్న ఇద్దరు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం ఈ వివరాలను వెల్లడించారు. తమకు ఉన్న సమాచారం మేరకు హైదరాబాద్ మాదాపూర్, గచ్చిబౌలిలోని పబ్‌లకు తరచూ వెళ్లే 16 మందిని పిలిపించామని చెప్పారు. పరీక్షలు చేయగా డీజే, మరో ఇద్దరు కొకైన్, గంజాయి తీసుకున్నట్లు తేలిందన్నారు. వీరిపై మాదాపూర్

మిగతా 14వ పేజీలో...



తోలిచౌకిలో...

హైదరాబాద్‌లో భారీ వర్షం!

ప్రధాన రహదారులను ముంచేసిన వరద

టోలిచౌకిలో కూలిన 200 ఏళ్ల నాటి వృక్షం

ఓ వ్యక్తికి గాయాలు.. 4 బైక్‌లు ధ్వంసం

రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు 14

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: పొన్నం

వెబ్ పేజీలను చదివి వినిపించేలా
గూగుల్ క్రోమ్‌లో ఫీచర్

వాషింగ్టన్, జూన్ 17: మీరు సెర్చింజన్ దిగ్గజం గూగుల్ బ్రౌజర్ క్రోమ్‌ను వాడుతున్నారా? అయితే.. ఇకపై ఎంచక్కా మీరు మీ మొబైల్‌లో వెబ్ పేజీలను ఆడియో రూపంలో వినొచ్చు. అంతేకాదు.. టేప్‌రికార్డర్, మ్యూజిక్ ప్లేయర్ మాదిరిగా.. రివైండ్, ఫార్వర్డ్, పాస్ వంటి ఆప్షన్లను కూడా వాడుకోవచ్చు. ఈ మేరకు గూగుల్ తన క్రోమ్ ఆండ్రాయిడ్ వెర్షన్-125లో 'లిజన్ ద పేజ్' అనే ఫీచర్‌ను పరిచయం చేసింది. బీటా వెర్షన్ యూజర్లకే ప్రస్తుతం ఈ సేవలు అందుబాటులో ఉండగా.. త్వరలో ఇతర వెర్షన్లకూ విస్తరించనున్నట్లు గూగుల్ ప్రకటించింది. ప్రస్తుతం 12 భాషల్లో– ఆంగ్లం, హిందీ, బెంగాలీతోపాటు.. అరబిక్, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, ఇండోనేసియన్, జపనీస్, పోర్చుగీస్, రష్యన్, స్పానిష్‌లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. మీరు మీ మొబైల్ ఫోన్ స్క్రీన్ లాక్ చేసినా.. బ్రౌజర్లో మరో ట్యాబ్‌లో వేరే సైట్‌ను బ్రౌజ్ చేస్తున్నా.. వాయిస్ కొనసాగుతుంది. క్రోమ్ పేజీపైన కుడివైపు ఉండే ఆప్షన్ మెనూ(మూడు నిలువు చుక్కలు)ని క్లిక్ చేస్తే.. 'లిజన్' అనే ఆప్షన్ వస్తుంది.

ఝార్ఖండ్‌లో ఐదుగురు మావోయిస్టుల హతం

చాయ్‌బాసా, జూన్ 17: ఝార్ఖండ్‌లో సోమవారం తుపాకుల మోత మోగింది. వెస్ట్ సింగ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. పారిపోతుండగా మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. గువా పోలీస్ స్టేషన్ పరిధిలోని లిపుంగా ప్రాంతానికి సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని అధికారులు తెలిపారు. ఘటన స్థలంలో ఒక ఇన్సాస్ రైఫిల్, రెండు ఎల్ఎల్ఆర్‌లు, మూడు రైఫిల్స్ (303), ఒక (9ఎంఎం) పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కొందరు మావోయిస్టులు లిపుంగా అడవికి సమీపంలో సమావేశమయ్యారని సమాచారం అందడంతో భద్రతా బలగాలు జాయింట్ ఆపరేషన్ నిర్వహించినట్టు అధికారులు చెప్పారు. ఉదయం 5 గంటల ప్రాంతంలో ఈ టీమ్‌పై మావోయిస్టులు దాడి చేశారని, వారిని ఎదుర్కోవడానికి భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్టు తెలిపారు.

ఎయిరిండియా భోజనంలో బ్లేడ్

ముంబై, బెంగళూరు, జూన్ 17: భారత్‌కు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియాలో అందించిన ఆహారంలో ఒకరికి బ్లేడ్ వచ్చింది. మరొకరికి ఉడకని ఆహారం వచ్చింది. గతవారం బెంగళూరు నుంచి అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు బయల్దేరిన ఎయిరిండియాకు చెందిన ఏఐ 175 విమానంలో ప్రయాణించిన మధురేస్ పాల్ అనే జర్నలిస్టుకు విమాన సిబ్బంది భోజనాన్ని అందించారు. తింటుండగా నోట్లో ఏదో గట్టిగా తగిలినట్టు అనిపించింది. బయటకు తీసి చూడగా అది బ్లేడ్ ముక్క. ఆ ఫొటోను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు. ఈ ఘటనపై ఎయిరిండియా స్పందించింది. అది కూరగాయలు కట్‌చేసే మిషన్‌లోని బ్లేడ్ ముక్క అని క్షమాపణలు చెప్పింది. ఆ తర్వాత పాల్‌ను సంప్రదించి.. ఏడాదికాలంపాటు ఏ ఎయిరిండియా విమానంలోనైనా చెల్లుబాటయ్యేలా బిజినెస్ క్లాస్ టికెట్‌ను ఆఫర్ చేసింది. అయితే 'లంచం'గా పేర్కొంటూ పాల్ ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్టు తెలిసింది. మరో ఘటనలో.. 5 లక్షలు వెచ్చించి ఎయిరిండియా విమానంలో బిజినెస్ క్లాస్ టికెట్ కొంటే తనకు ఉడకని ఆహారం వడ్డించారని, సీట్లు కూడా మురికిగా ఉన్నాయని వినీత్ అనే వ్యక్తి ఆరోపించారు. ఆయన శుక్రవారం న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు ఎయిరిండియా బిజినెస్ క్లాస్‌లో ప్రయాణించారు. కాగా, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయంతో 15 నిమిషాల పాటు సేవలు నిలిచిపోయాయి.

ఈవీఎంలలో పారదర్శకత పాటించండి..
లేదంటే రద్దు చేయండి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూన్ 17: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మరోమారు సందేహాలు వ్యక్తం చేశారు. వీటి నిర్వహణలో పూర్తిస్థాయి పారదర్శకతను పాటించాలని, లేదంటే రద్దు చేయాలని ఎన్నికల కమిషన్‌కు సూచించారు. సోమవారం ఈ మేరకు ఆయన ట్వీట్ చేస్తూ "ప్రజాస్వామిక సంస్థలు ఆక్రమణకు గురయినప్పుడు పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియలోనే ప్రజలకు రక్షణ కలుగుతుంది. ఈవీఎంలు ప్రస్తుతం 'బ్లాక్ బాక్స్'గా మారాయి. వీటి నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండేలా ఎన్నికల కమిషన్ చూడాలి. లేదంటే రద్దు చేయాలి" అని సూచించారు. ఆదివారం కూడా ఆయన ఇదే అంశంపై ట్వీట్ చేస్తూ.. ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు వస్తున్నప్పటికీ పరిశీలించే అవకాశాన్ని ఎవరికీ ఇవ్వడం లేదని విమర్శించారు.

రాజ్‌భవన్ నుంచి వెళ్లిపోండి

» పోలీసులకు బెంగాల్ గవర్నర్ ఆదేశం

కోల్‌కతా, జూన్ 17: రాజ్‌భవన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కోల్‌కతా పోలీసులు తక్షణమే వెళ్లిపోవాలని పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోస్ సోమవారం ఆదేశించారు. రాజ్‌భవన్ ఉత్తర గేట్ వద్ద ఉన్న పోలీసు అవుట్ పోస్టును జన్ మంచ్ (ప్రజా వేదిక)గా మార్చాలని కూడా ఆయన భావిస్తున్నారు. రాజ్‌భవన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆఫీసర్ ఇన్‌ఛార్జి సహా పోలీసులు అందరూ తక్షణమే ఖాళీ చేయాలని గవర్నర్ ఆదేశించినట్టు ఓ అధికారి తెలిపారు. బీజేపీ నాయకుడు సువేందు అధికారిని రాజ్‌భవన్‌లోకి వెళ్లేందుకు పోలీసులు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో గవర్నర్ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకొంది. ఎన్నికల తరువాత దాడులకు గురయిన బాధితులను తీసుకొని వచ్చిన సువేందు అధికారి గవర్నర్‌ను కలిసేందుకు రాజ్‌భవన్ వద్దకు వచ్చారు. అయితే 144వ సెక్షన్ అమల్లో ఉందన్న కారణం చూపి పోలీసులు ఆయనకు అనుమతి ఇవ్వలేదు. దీంతో రాష్ట్ర పోలీసులు వెళ్లిపోవాలంటూ గవర్నర్ ఆదేశించారు.

పోక్సో కేసులో విచారణకు యడియూరప్ప

బెంగళూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప పోక్సో కేసులో సోమవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని 4 రోజుల క్రితం ఆయనకు సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారు. కోర్టును ఆశ్రయించి నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేయించారు. యడియూరప్ప హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయడంతో ఉపశమనం లభించింది. యడియూరప్పను అరెస్టు చేయవద్దని హైకోర్టు సీఐడీకి సూచించింది. అంతకుముందు చెప్పినట్లుగానే యడియూరప్ప సోమవారం విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు నేరుగా సీఐడీ కార్యాలయానికి వెళ్లారు. సుమారు 3 గంటలపాటు సీఐడీ పోలీసులు ఆయనను విచారించారు.

అమెరికాలో భారత సంతతి మహిళ కాల్చివేత

న్యూఢిల్లీ, జూన్ 17: అమెరికాలో భారత సంతతి మహిళను మరో భారతీయ యువకుడు గౌరవ్‌గిల్ కాల్చి చంపేశాడు. కాల్పుల్లో ఇంకో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉంది. న్యూజెర్సీలో ఆదివారం ఈ ఘటన జరిగింది. చనిపోయిన మహిళ పేరు జస్వీర్ కౌర్. గాయపడిన యువతి గగన్‌దీప్ కౌర్(20). ఇద్దరూ బంధువులు. జస్వీర్ ఐదేళ్ల క్రితమే భర్తతో సహా అమెరికాకు వచ్చి స్థిరపడ్డారు. మరోవైపు, గగన్‌దీప్ కౌర్‌కు, నిందితుడైన గౌరవ్‌కు ఇంతకుముందే పరిచయం ఉంది. పంజాబ్‌లో ఇద్దరూ ఒకే కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. గగన్‌దీప్ కౌర్ ఇటీవలే స్టూడెంట్ వీసా మీద అమెరికా వచ్చి జస్వీర్ ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో, గౌరవ్‌గిల్ అమెరికా వెళ్లాడు. ఆదివారం జస్వీర్ ఇంటికి వెళ్లి అక్కడ గగన్‌దీప్‌తో గొడవపడ్డాడు. అడ్డువచ్చిన జస్వీర్‌పైన, ఆ తర్వాత గగన్‌దీప్‌పై కాల్పులు జరిపాడు.

అణ్వాయుధాల ఆధునికీకరణలో దేశాలు: సిప్రి

న్యూఢిల్లీ, జూన్ 17: ప్రపంచంలోని తొమ్మిది అణ్వాయుధ దేశాలు తమ అస్త్రాలను ఆధునికీకరిస్తున్నాయి. ఈ జాబితాలో భారత్, పాక్‌లతో పాటు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా, ఉత్తర కొరియా, ఇజ్రాయెల్, బ్రిటన్‌లు ఉన్నాయి. వీటిలో రష్యా, అమెరికాలయితే అణ్వాయుధాలను మోహరించాయి. 2023లో అణ్వాయుధాల సామర్థ్యంపై అధ్యయనం చేసిన స్వీడన్‌కు చెందిన స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) ఈ విషయాన్ని వెల్లడించింది. చైనాలో 2023 జనవరి నాటికి 410 వార్‌హెడ్స్ ఉండగా, 2024 నాటికి వాటి సంఖ్య 500కి పెరిగిందని తెలిపింది. అన్ని దేశాలు కలిపి 2,100 వార్‌హెడ్స్‌ను ఖండాంతర క్షిపణులకు అమర్చి ప్రయోగానికి సిద్ధంగా ఉంచాయని పేర్కొంది. వీటిలో రష్యా, అమెరికావే అధికమని వివరించింది. జనవరి నాటికి ప్రపంచంలో మొత్తం 12,121 న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉన్నట్టు తెలిపింది. భారత్ వద్ద 172, పాకిస్థాన్ వద్ద 170 వార్‌హెడ్స్ ఉన్నట్టు పేర్కొంది.


విషాద ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురి పరిస్థితి విషమంగా ఉంది. అసోంలోని సిల్చార్ నుంచి బెంగాల్ రాజధాని కోల్‌కతాకు వెళ్తున్న కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను న్యూ జల్పాయ్‌గురి దాటిన తర్వాత రంగపాని స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు వెనుకనుంచి గట్టిగా ఢీకొట్టింది. గూడ్స్ బోగీలు చెల్లాచెదురయ్యాయి. కాంచన్‌జంగా బోగీలు నాలుగు పట్టాలు తప్పగా, ఓ బోగి అమాంతం గాల్లోకి లేచింది. ఈ బోగీలు పార్సిల్, గార్డ్ కోచ్‌లు కావడంతో ప్రాణ నష్టం పెద్దగా లేదు. రైల్వే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాగా, ఏడాది వ్యవధిలో చిన్నవి, పెద్దవి కలిపి భారత రైల్వేలో 15కు పైగా దుర్ఘటనలు జరిగాయి. సిగ్నల్ పడినప్పటికీ, గూడ్స్ రైలు దానిని పట్టించుకోకుండా వెళ్లడంతోనే ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు. దీనిపై రైల్వే శాఖ నుంచి ప్రకటన రావల్సి ఉంది. కాగా, గూడ్స్ డ్రైవర్, కాంచన్‌జంగా గార్డ్ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులను ఉత్తర బెంగాల్ వైద్య కళాశాలకు తరలించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ.2.50 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.50 వేలు పరిహారం అందజేస్తామని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఢిల్లీ నుంచి విమానంలో బగ్డోగ్రా చేరుకున్న ఆయన.. ద్విచక్ర వాహనంపై ప్రమాద స్థలానికి వెళ్లారు. రైల్వే భద్రతా కమిషనర్‌ను విచారణాధికారిగా నియమించారు.



ప్రమాదం జరిగిన స్థలానికి బైక్‌పై వెళ్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



ప్రమాదంలో చెల్లాచెదురైన రైలు బోగీలు

ప్రమాదం కలచివేసింది: ముర్ము, మోదీ

రైలు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందని రాష్ట్రపతి ముర్ము తెలిపారు. సహాయ చర్యలు విజయవంతం కావాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని పేర్కొన్నారు. కాగా, బెంగాల్ రైలు ప్రమాదం పట్ల ప్రధాని మోదీ స్పందించారు. ఆప్తులను కోల్పోయినవారికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు ట్వీట్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడానని వెల్లడించారు.

ఆ మార్గంలో కవచ్ లేదు..: రైల్వే బోర్డు చైర్ పర్సన్

రైళ్లు ఒకదానికొకటి ఢీకొనకుండా తీసుకొచ్చిన కవచ్ వ్యవస్థ.. గువాహటి-ఢిల్లీ మార్గంలో ఇంకా ఏర్పాటు చేయలేదని రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయావర్మ సిన్హా తెలిపారు. ఇప్పుడిప్పుడే ఆ ప్రయత్నాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. గూడ్స్ రైలు డ్రైవర్ తప్పిదమే ప్రమాదానికి కారణం అయి ఉంటుందని తెలిపారు. కాగా, గత ఏడాది అక్టోబరులో విశాఖ-రాయగడ రైలు ప్రమాదం జరిగింది. ఆ మార్గంలోనూ కవచ్ లేదు.


1,500 కి.మీ. మార్గంలోనే 'కవచ్'

రెండు రైళ్లు ఒకే ట్రాక్ (పట్టాలు)పైకి వచ్చినపుడు ఢీకొనకుండా తీసుకొచ్చిన వ్యవస్థ 'కవచ్'. ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థ ఉన్న భారత్‌లో ఇంకా చాలా మార్గాల్లో అందుబాటులోకి రాలేదు. ఇప్పటివరకు 1,500 కి.మీ. పరిధి రైల్వే మార్గంలోనే కవచ్ వినియోగం ఉంది. ఇది 1.30 లక్షల రూట్ కిలోమీటర్లు ఉన్న భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో ఒక శాతమే. అందులోనూ మొత్తం కూడా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోనే ఉండడం గమనార్హం. తెలంగాణ (684 కి.మీ.)దే అత్యధిక వాటా కావడం విశేషం. ఏపీలో 66, కర్ణాటకలో 117, మహారాష్ట్రలో 598 కి.మీ. నెట్‌వర్క్ కవచ్ పరిధిలోకి వచ్చింది. తాజాగా ప్రమాదం జరిగిన ఢిల్లీ-హౌరా రూట్ సహా మరో 3 వేల కి.మీ. మార్గంలో ఈ ఏడాది ఆఖరుకల్లా కవచ్‌ను ప్రవేశపెట్టనున్నారు. కాగా, ఒక రైలు వెళ్తున్న ట్రాక్‌పైనే మరో రైలు కూడా వస్తున్నట్లయితే 'కవచ్' వెంటనే సెన్సార్లతో గుర్తిస్తుంది. రైలు దానంతటదే ఆగిపోతుంది. పైలట్ రెడ్ సిగ్నల్‌ను పట్టించుకోకుండా వెళ్తున్నా, బ్రేకులు పడిపోతాయి. మరోవైపు బెంగాల్ దుర్ఘటనలో సిగ్నలింగ్ లోపాలు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. రాణిపత్ర-ఛత్తర్‌హాట్ కూడలి మధ్య సోమవారం తెల్లవారుజాము నుంచి సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయలేదని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ 8.27 సమయంలో బయల్దేరినా, రాణిపత్ర-ఛత్తర్‌హాట్ మధ్య ఆగిపోయింది. సాంకేతిక లోపంతో సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయనప్పుడు రైళ్లు నడవడానికి వీలుగా స్టేషన్ మాస్టర్ టీఏ912 సూచన జారీ చేస్తారు. కాంచన్‌జంగాకూ ఇలానే టీఏ912ను జారీ చేశారు. కానీ, ఇదే సమయంలో గూడ్స్ కూడా వచ్చింది. దీంతో గూడ్స్‌కూ టీఏ912 ఇచ్చారా? లేకపోతే గూడ్స్ డ్రైవర్ నిబంధనలను ఉల్లంఘించారా? అనేది నిర్ధారణ కావాల్సి ఉంది.

రీల్స్‌పైనే మంత్రి దృష్టి.. రైళ్లపై లేదు: కాంగ్రెస్

మోదీ ప్రభుత్వ అధ్వాన నిర్వహణ, నిర్లక్ష్యంతో పదేళ్లలో రైలు ప్రమాదాలు పెరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్రం తీరుతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైలు ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మోదీ ప్రభుత్వం రైల్వే శాఖను పూర్తిగా దుర్వినియోగం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. రైల్వేలను స్వీయ ప్రచారానికి వేదికలా మార్చారని మండిపడ్డారు. అశ్విని వైష్ణవ్‌కు ఇన్‌స్టా రీల్స్ చేయడంలోనే సమయం సరిపోతోందని, ప్రజల భద్రత ఆయన ప్రాధాన్య అంశాల్లో లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దేశంలో రైల్వే వ్యవస్థ ఎవరూ పట్టించుకోని అనాథలా మారిందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. చార్జీలు పెంచడంపై తప్ప ప్రయాణికుల రక్షణ, వసతుల కల్పనపై ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ లేదని మండిపడ్డారు.

లోకం తీరు



భార్యాభర్తల నడుమ బుక్కైన
యాపిల్!

సెక్స్ వర్కర్లతో ఐఫోన్‌లో ఓ వ్యక్తి చాటింగ్

మెసేజీలు కంటపడటంతో భార్య విడాకులు

'డిలీట్‌'పై అవగాహన కల్పించలేదంటూ

యాపిల్ సంస్థపై రూ.53 కోట్లకు భర్త దావా

లండన్, జూన్ 17: తన నుంచి భార్య విడిపోవడానికి కారణం యాపిల్ సంస్థనే అంటూ ఓ వ్యక్తి ఏకంగా కోర్టులో కేసు వేశాడు. ఆ కంపెనీ నుంచి పరిహారంగా రూ.53 కోట్లు డిమాండ్ చేస్తున్నాడు. లండన్‌లో చోటుచేసుకున్న ఈ వ్యవహారం త్వరలోనే అక్కడి కోర్టులో విచారణకు రానుంది. ఇంతకీ ఏం జరిగిందంటే.. లండన్‌కు చెందిన ఓ వ్యాపారి తన యాపిల్ ఐఫోన్‌లోని ఐ మెసేజ్ ద్వారా సెక్స్‌వర్కర్లతో చాటింగ్ చేసేవాడు. అవి తన భార్య కంటపడకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు డిలీట్ చేసేవాడు. అయితే, తాను వాడుతున్న యాపిల్ ఐడీని కుటుంబానికి చెందిన ఐమ్యాక్ లోనూ ఉపయోగించాడు. ఐ మెసేజ్‌లో డిలీట్ చేసిన మెసేజీలు ఐమ్యాక్‌లో మాత్రం ఉండిపోయాయి. అవి భార్య కంటపడటంతో ఇంట్లో పెద్ద గొడవ అయిపోయింది. చివరకు విడాకులకు అది దారితీసింది. దీంతో సదరు భర్త.. యాపిల్ తన వినియోగదారులకు సరైన అవగాహన కల్పించడం లేదని ఆక్షేపిస్తూ కోర్టులో కేసు వేశాడు. ఒక పరికరంలోంచి తీసేసిన సమాచారం, దానితో అనుసంధానించిన ఇతర పరికరాల్లో మాత్రం అలాగే ఉండిపోతుందనే విషయం ముందుగా చెప్పలేదని వాదిస్తున్నాడు. మెసేజ్‌ల్లో పంపినవీ, స్వీకరించినవీ, మరీ ముఖ్యంగా తొలగించినవీ ఏమి అవుతాయనేది తన వినియోగదారులకు స్పష్టపరచకపోవడం యాపిల్ పొరపాటేనని అతని తరపు న్యాయవాది సీమన్ వాల్షన్ చెబుతున్నారు.

ఆదాయపు పన్ను తగ్గించే యోచన!

బడ్జెట్‌పై కొనసాగుతున్న కసరత్తు

న్యూఢిల్లీ, జూన్ 17: మోదీ 3.0 ప్రభుత్వం వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న కొత్త బడ్జెట్‌లో ఉద్యోగ వర్గాలు, వేతన జీవులకు ఊరట కలిగించే విధంగా పలు నిర్ణయాలు ప్రకటించనుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఆదాయపు పన్ను భారాన్ని తగ్గించే అవకాశాలు ఉన్నాయి. కిందిస్థాయి శ్లాబుల్లో ఉన్నవారికి ప్రయోజనం కలిగించేలా పన్నులు తగ్గించే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నాయి. సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపుపై దృష్టి పెట్టడం కన్నా, మధ్య తరగతి వర్గం ప్రజల చేతుల్లో నాలుగు డబ్బులు ఉండేటట్టు చూసి తద్వారా ఆర్థిక ప్రగతికి దోహదపడాలన్న ఉద్దేశంలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఆదాయపు పన్ను భారం తగ్గితే ఆ రూపంలో ఆదా అయిన సొమ్ముతో వస్తువులు కొనుగోలు చేస్తారని, దాని ద్వారా ఒకదానితో మరికొటి ముడి పడి ఉండే ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని అంచనా వేస్తోంది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.3 లక్షల వరకు ఉంటే 5% ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంది. అది శ్లాబుల వారీగా పెరుగుతుంది. ఆదాయం రూ.15 లక్షలకు చేరుకుంటే పన్ను 30% పెరుగుతుంది. ఆదాయం అయిదు రెట్లు పెరిగితే పన్ను శ్లాబు మాత్రం ఆరు రెట్లు పెరుగుతోంది. ఈ పెరుగుదలలో హేతుబద్ధత లేదని, శ్లాబులు కూడా మరీ ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. జులైలో ప్రవేశపెట్టనున్న 2024-25 బడ్జెట్‌పై ఆర్థిక మంత్రిగా మరోసారి బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ కసరత్తు ప్రారంభించారు. మంగళవారం రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాతో చర్చలు జరపనున్నారు. ఈ నెల20న పారిశ్రామిక వర్గాలతో భేటీ అయి సలహాలు స్వీకరించనున్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను జులై ఒకటో తేదీ నుంచే అమల్లోకి తీసుకురానున్నట్టు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ వెల్లడించారు. ఈ విషయంలో పునరాలోచన ఏమీ లేదని స్పష్టం చేశారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-1872 చట్టాల స్థానంలో కేంద్ర కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే.

రాయ్‌బరేలీకే రాహుల్ సై

వయనాడ్‌ను వదులుకోవాలని నిర్ణయం.. అక్కడి నుంచి పోటీ చేయనున్న ప్రియాంక

» కాంగ్రెస్ రాజకీయ ఏటీఎంగా కేరళ:బీజేపీ

న్యూఢిల్లీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్‌ల నుంచి విజయం సాధించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. రాయ్‌బరేలీకి ప్రాతినిధ్యం వహించాలని, వయనాడ్ స్థానాన్ని వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. వయనాడ్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ పోటీ పడనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వివరాలను విలేకర్లకు వెల్లడించారు. సోమవారం ఖర్గే నివాసంలో ఆయనతో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, ప్రియాంకా గాంధీ సమావేశమయ్యారు. రెండు స్థానాల్లో గెలిచిన ఎంపీలు లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన 14 రోజుల్లో ఏదో ఒక స్థానాన్ని ఖాళీ చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో.. రాయ్‌బరేలీ, వయనాడ్‌లో రాహుల్ ఏ స్థానాన్ని నిలుపుకోవాలనే అంశంపై చర్చించారు. అనంతరం ఖర్గే విలేకర్లతో మాట్లాడుతూ తరతరాలుగా నెహ్రూ కుటుంబంతో ప్రత్యేక అనుబంధం ఉన్నందువల్ల రాయబరేలీ నుంచే రాహుల్ ఎంపీగా కొనసాగాలని పార్టీ నిర్ణయించిందని తెలిపారు. వయనాడ్ ప్రజలూ రాహుల్‌నే కోరుకుంటున్నప్పటికీ నిబంధనలు అనుమతించడం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పోరాడటానికి అవసరమైన శక్తిని వయనాడ్ ప్రజలు తనకు అందించారని, ఆ విషయాన్ని ఎన్నడూ మర్చిపోనని చెప్పారు. రాయ్‌బరేలీ, వయనాడ్‌లతో తనకు భావోద్వేగపూరిత సంబంధం ఉందని, వాటిల్లో దేనిని ఎంచుకోవాలన్న నిర్ణయం సులభం కాలేదని వెల్లడించారు. రాహుల్ లేని లోటు లేకుండా తాను చూస్తానని వయనాడ్ ప్రజలకు ప్రియాంకగాంధీ హామీ ఇచ్చారు. కష్టపడి పని చేసి మంచి ప్రజాప్రతినిధి అనిపించుకుంటానన్నారు. కాగా, వయనాడ్‌లో రాహుల్‌పై పోటీ చేసి ఓడిపోయిన కేరళ బీజేపీ అధ్యక్షుడు సురేంద్రన్.. రాహుల్ వయనాడ్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని విమర్శించారు. కేరళను కాంగ్రెస్ పార్టీ రాజకీయ ఏటీఎంగా భావిస్తోందన్నారు.



ప్రతిపక్ష నేత పదవికి విముఖం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత పదవిని తీసుకోవటానికి కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ అంగీకరించటం లేదని ఆ పార్టీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాహుల్ బదులుగా కాంగ్రెస్ పార్టీకే చెందిన కుమారి షెల్జా, గౌరవ్ గొగోయ్, మనీష్ తివారీల్లో ఒకరు ఆ బాధ్యతలు చేపట్టవచ్చని పేర్కొన్నాయి. ఈ పదవిలో ఉండే వ్యక్తికి కేంద్ర క్యాబినెట్ మంత్రి హోదాతోపాటు ప్రతిపక్షాలను సమన్వయపరచటంలో, అధికారపక్షాన్ని దీటుగా ఎదుర్కోవటంలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. దీంతో ఈసారి విపక్ష నేత పదవిని రాహుల్‌గాంధీ తీసుకోవచ్చని ప్రచారం జరిగింది. రాహుల్ విపక్షనేత బాధ్యతలు చేపట్టాలని సీడబ్ల్యూసీ కూడా ఇటీవల ఏకగ్రీవ తీర్మానం చేసింది. అయితే, రాహుల్ అందుకు అంగీకరించటం లేదని తాజా సమాచారం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన రాహుల్ ఆ తర్వాత.. ఏ పదవీ తీసుకోవటానికి ఇష్టపడటం లేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

క్రైస్తవులారా.. క్షమించండి!

'ఎక్స్' ఖాతాలో వివాదాస్పద పోస్టుపై కాంగ్రెస్ అభ్యర్థన

తిరువనంతపురం, జూన్ 17: "క్రైస్తవులారా.. క్షమించండి!" అని కేరళ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్లను బేషరతుగా క్షమాపణలు కోరింది. అంతేకాదు.. "మేం ఏ మతాన్నీ, ఏ ఆచారాన్నీ కించపరచం. మా పార్టీ సోషల్ మీడియా 'ఎక్స్'లో పెట్టిన పోస్టు మీ మనసులను గాయపరిచి, విశ్వాసుల్ని భావోద్వేగానికి, మానసిక అశాంతికి గురి చేసినందుకు తీవ్రంగా చింతిస్తున్నాం. సదరు పోస్టును ఇప్పటికే తొలగించాం" అని తెలిపింది. ఇటీవల ఇటలీలో జీ-7 సదస్సులో ప్రధాని మోదీ పోప్ ఫ్రాన్సిస్‌తో భేటీ అయ్యారు. ఈ ఫొటోను కేరళ కాంగ్రెస్ విభాగం 'ఎక్స్'లో పోస్టు చేస్తూ.. "చివరకు.. పోప్‌కు దేవుడి(మోదీ)ని కలిసే అవకాశం దక్కింది" అంటూ వ్యంగ్యాస్త్రాన్ని జోడించింది. ఇది వివాదాస్పదమైంది. క్రైస్తవ సంఘాలు వ్యతిరేకించాయి. దీంతో కాంగ్రెస్ క్షమాపణలు తెలిపింది.

కిషన్‌రెడ్డికి జమ్మూకశ్మీర్ బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఇన్‌చార్జిగా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహ ఇన్‌చార్జిగా ఉంటారని పార్టీ ప్రకటించింది. 2014 తర్వాత తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న జమ్మూకశ్మీరుకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించింది. జమ్మూకశ్మీర్‌లో ఈ సెప్టెంబరులోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇక మరో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు హరియాణా బాధ్యతలు అప్పగించింది. త్రిపుర మాజీ సీఎం బిప్లవ్‌కుమార్ ఆయనకు సహాయంగా ఉంటారని ప్రకటించింది. ఝార్ఖండ్ ఇన్‌చార్జిగా మధ్యప్రదేశ్ మాజీ సీఎం, ప్రస్తుత కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌ను నియమించింది. ఆయనకు అసోం సీఎం హిమంతబిశ్వ శర్మ మద్దతుగా ఉంటారని తెలిపింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్, హరియాణాల్లో ఈ ఏడాది చివరలో ఎన్నికలు జరగనున్నాయి.

మహారాష్ట్రపై ప్రత్యేక దృష్టి

దేశ ఆర్థిక రాజధానిగా పేరొందడమేగాక.. అత్యధిక లోక్‌సభ సీట్లున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర రెండోస్థానంలో ఉంది. అంతేకాదు ఈ రాష్ట్రం నుంచి బీజేపీ తొలిసారి పూర్తిగా కొత్త కూటమితో కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనుంది. షిండే వర్గం శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలతో కలిసి.. కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన పార్టీల కూటమిపై పోటీ చేస్తోంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీ బాగా దెబ్బతిన్నది. మొత్తం 48 సీట్లకు గాను 2019లో 23 గెలిచిన ఆ పార్టీ బలం ఈసారి 9 సీట్లకు పడిపోయింది. అదేసమయంలో కాంగ్రెస్ ఒక్క సీటు నుంచి 13 సీట్లకు చేరుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ క్రమంలో మహారాష్ట్రకు బీజేపీ ఇన్‌చార్జిలుగా భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్ నియమితులయ్యారు. వీరి నేతృత్వంలో గత ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ పార్టీ 230 సీట్లకు గాను 163 స్థానాల్లో విజయ బావుటా ఎగరవేసింది.







హరియాణాలో మూడోసారి గెలుపే లక్ష్యం

హరియాణాలోనూ బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో 10 సీట్లకు గాను ఐదింట్లోనే గెలిచింది. అయితే, రాష్ట్రంలో వరసగా మూడోసారి అధికారం చేపట్టడమే లక్ష్యంగా పెట్టుకొన్న బీజేపీ.. ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్‌కుమార్‌లను ఇన్‌చార్జిలుగా నియమించింది.


'భారత్', 'ఇండియా'...
రెండూ వాడతాం

దీనిపై చర్చ అనవసరం: ఎన్‌సీఈఆర్‌టీ చీఫ్

న్యూఢిల్లీ, జూన్ 17: దేశ రాజ్యాంగంలో మాదిరిగానే ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో కూడా 'భారత్', 'ఇండియా' అనే పదాలను పరస్పరం ఉపయోగించనున్నట్లు ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ డీపీ సక్లానీ తెలిపారు. వీటిలో దేనిపైనా మండలికి విముఖత లేదని చెప్పారు. ఇప్పటికే తమ పాఠ్యపుస్తకాల్లో ఈ రెండు పదాలనూ ఉపయోగిస్తున్నామని, కొత్త పుస్తకాల్లో కూడా ఇదే విధానం కొనసాగుతుందని చెప్పారు. ఇదో పనికిమాలిన చర్చ అని అభిప్రాయపడ్డారు.అన్ని తరగతుల పాఠ్యపుస్తకాల్లో ఇండియా స్థానంలో భారత్ అని చేర్చాలని సోషల్ సైన్స్ పాఠ్యప్రణాళికపై పనిచేస్తున్న ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, ఎన్‌సీఈఆర్‌టీ ఆరెస్సెస్ అనుబంధ సంస్థగా పనిచేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు.

ఉద్యోగుల విభజనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

- ప్రచారాన్ని నమ్మొద్దు: రాష్ట్ర ప్రభుత్వ వర్గాల వివరణ
- తెలంగాణ నుంచి ఏపీకి 1,369 మంది ఆప్షన్లు
- ఏపీ నుంచి తెలంగాణకు 1,808 మంది



హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఉద్యోగుల పంపిణీకి సంబంధించి ఇంకా కొత్త నిర్ణయాలేమీ తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏపీ నుంచి తెలంగాణకు ఉద్యోగులు వస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని కోరాయి. రాష్ట్రం ఏర్పడిన ఏడాది రెండేళ్లలోనే ఉద్యోగుల పంపిణీ ప్రక్రియ దాదాపుగా ఓ కొలిక్కి వచ్చిందని వివరించాయి. ఉద్యోగుల విభజన సమయంలో ఆప్షన్లు, పోస్టుల లభ్యత ఆధారంగా తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులు కొందరు ఏపీకి, ఏపీ స్థానికత ఉన్నవారిలో కొందరిని తెలంగాణకు పంపిణీ చేశారని పేర్కొన్నాయి. వైద్య అవసరాలు, భార్యాభర్తలు ఉద్యోగాల్లో ఉండడం, పిల్లల చదువులు, సొంత ఇళ్లు ఉన్నాయనే కారణాలతో కొందరు ఉద్యోగులు ఈ పంపిణీతో ఇబ్బంది పడ్డారని తెలిపాయి. మానవీయ కోణంలో తమ బాధను అర్థం చేసుకోవాలంటూ పలు మార్లు ప్రభుత్వాన్ని అభ్యర్థించారని వివరించాయి. ఏపీకి వెళ్లేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరుతూ తెలంగాణకు కేటాయించిన 1,369 మంది ఉద్యోగులు కోరారని పేర్కొన్నాయి. 2021 సెప్టెంబరులోవారందరినీ ఏపీకి పంపించేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదని తెలియజేస్తూ సర్క్యులర్ జారీ చేశామని స్పష్టం చేశాయి. ఏపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు వచ్చేందుకు సిద్ధపడిన ఉద్యోగుల వివరాలను సేకరించిందని, అక్కడి నుంచి 1,808 మంది ఉద్యోగులు తెలంగాణకు రావడానికి ఆప్షన్లు ఇచ్చారని.. 2022 సెప్టెంబరు 23న అప్పటి ఏపీ సీఎస్ సమీర్‌శర్మ.. అప్పటి తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌కు లేఖ రాశారని పేర్కొన్నాయి. రెండు రాష్ట్రాల్లో ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగుల పరస్పర బదిలీకి రెండు ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలంటూ ఉద్యోగులు కోరారని గుర్తుచేశాయి. ఈ అంశం ఎనిమిదేళ్లుగా నానుతున్న వ్యవహారమని.. విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య సమావేశాలు జరిగినప్పుడల్లా చర్చకు వచ్చిందని వివరించాయి. తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లు పూర్తి కావటంతో విభజన చట్టంలోని అంశాలు.. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలన్నిటినీ ఆరా తీశామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇంతకాలం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఈ నెల 2 నుంచి తెలంగాణకు ప్రత్యేక రాజధానిగా మారిందని, ఇదే సందర్భంగా ఏపీకి కేటాయించిన ఆఫీసులు, భవనాలతో పాటు విభాగాల వారీగా విభజన చట్టంలోని అన్ని అంశాలపై ప్రత్యేక నివేదిక ఇవ్వాలని ఆర్థికశాఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని వెల్లడించాయి. పెండింగ్‌లో ఉన్న అంశాలపై తదుపరి చర్చలు, సమావేశాలేవీ జరగలేదని స్పష్టం చేశాయి.

ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి
రూ.31 వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

రహదారికి ఆగస్టు రెండో వారంలో టెండర్లకు వెళ్లాలని ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించిన నేపథ్యంలో రహదారి స్వరూపాన్ని కూడా ఖరారు చేశారు. మరోవైపు దక్షిణ భాగంపైనా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలైన్‌మెంట్‌పై చర్చలు జరుపుతున్నారు. ఈ వివరాలతో కేంద్రానికి లేఖ రాయనున్నారు. కాగా, ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి 4,500 హెక్టార్ల భూమి అవసరమవుతుందని గతంలోనే తేల్చారు. ఇందులో.. ఉత్తర భాగం నిర్మాణానికి 90శాతం భూసేకరణ పూర్తిచేశారు. పరిహారం, నిర్మాణ ఖర్చు విషయంలో అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు దక్షిణ భాగం రహదారి నిర్మాణ ప్రతిపాదనలు పంపాలని గతంలోనే కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ.. తెలంగాణ జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. దీంతో డీపీఆర్ పనులపై అధికారులు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంపై కృతనిశ్చయంతో ఉంది. గతేడాది డిసెంబరులో సర్కారు చొరవతో ఉత్తర భాగం యుటిలిటీ చార్జీల చెల్లింపు అంశానికి తెరపడింది. దక్షిణ భాగం రోడ్డుకు జాతీయ రహదారి నంబర్‌ను కేటాయించేందుకూ కేంద్రం పచ్చజెండా ఊపింది. కాగా, సంగారెడ్డి- చౌటుప్పల్ వరకు 161 కి.మీ మేర నిర్మాణం జరుపుకొనే ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం కోసం రూ.1,940 హెక్టార్ల మేర భూమి అవసరం పడుతోంది. రోడ్డు నిర్మాణానికి మొత్తం రూ.15 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతున్నాయి. ఇందులో పరిహారానికే రూ.5,200 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇక చౌటుప్పల్‌లో మొదలై సంగారెడ్డికి అనుసంధానమయ్యే దక్షిణ భాగం రహదారి 189 కి.మీ.పరిధిలో ఉంటుంది. ఇందుకు 2వేల హెక్టార్ల భూమి అవసరమవుతోంది. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.16 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతుండగా.. ఇందులో రూ.6,500 కోట్ల నుంచి రూ.7వేల కోట్ల వరకు భూ పరిహారం కింద చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తేల్చారు. దీని ప్రకారం మొత్తం 350 కి.మీ. మేర నిర్మితమయ్యే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

పరిహారంలో రాష్ట్ర వాటా రూ.6,300 కోట్లు..

ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికిగాను ఎన్‌హెచ్‌ఏఐ సేకరించిన భూమికి చెల్లించే మొత్తం భూ పరిహారంలో సగం వాటాను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఈ రోడ్డును మంజూరు చేస్తే భూ పరిహారం చెల్లింపుల్లో 50 శాతాన్ని రాష్ట్ర వాటాగా చెల్లిస్తామని 2018 ఆగస్టు 29న కేంద్రమంత్రికి అప్పటి సీఎం కేసీఆర్ రాసిన లేఖలో పేర్కొన్నారు. దాంతో ఉత్తరభాగం భూ సేకరణలో సగం వాటా కింద రూ.2,700 కోట్లు, దక్షిణభాగం భూ సేకరణలో సగం వాటా కింద రూ.3,600 కోట్లు కలిపి మొత్తం దాదాపు రూ.6,300 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఏఐకి చెల్లించాలి. దీంతో ఈ మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణంగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నీట్‌లో ఉత్తరాది ఆధిక్యం

2018తో పోలిస్తే 2024కు ఉత్తరాది అభ్యర్థుల సంఖ్య రెట్టింపు.. దక్షిణాదిన పెరుగుదల అంతంతే

- మూడేళ్లుగా ఆలిండియా టాప్100లో తగ్గుతున్న మనోళ్ల సంఖ్య
- ఆఫ్‌లైన్ పరీక్ష కావడంతో అక్రమాల ముప్పు ఎక్కువంటున్న నిపుణులు



హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న అర్హత పరీక్ష నీట్ రాస్తున్న విద్యార్థుల సంఖ్య ఏటికేడాదీ పెరుగుతోంది. గడిచిన ఏడేళ్లలో ఆ సంఖ్య రెట్టింపు అయింది. 2018లో దేశవ్యాప్తంగా 13.26 లక్షల మంది నీట్ పరీక్ష రాయడానికి నమోదుచేసుకోగా.. 2024 నాటికి ఆ సంఖ్య 24.06 లక్షలకు చేరుకుంది. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి నీట్ రాసే వారి సంఖ్య రెట్టింపయింది. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల్లో ఆ స్థాయిలో పెరగలేదు. రెండు, మూడేళ్లుగా టాప్-100 విద్యార్థుల్లో.. ఉత్తరాదివారితో పోల్చితే దక్షిణాదివారు తక్కువగా కనిపిస్తున్నారు. ఈ ఏడాదినే ఉదాహరణగా తీసుకుంటే.. టాప్ 100 జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే ఉన్నారు. అందులో ముగ్గురు ఏపీ వారు కాగా తెలంగాణ విద్యార్థి ఒక్కరే. గతంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఇంత తక్కువగా కనిపించే వారు కాదని, టాప్-100లో మనోళ్ల సంఖ్య ఎక్కువగా ఉండేదని వైద్యవిద్య నిపుణులు గుర్తుచేస్తున్నారు. నీట్ పరీక్ష ఆఫ్‌లైన్‌లో జరుగుతుండడంతో.. ఉత్తరాది రాష్ట్రాల్లోని కొన్నిచోట్ల పేపర్ లీక్ అవుతోందని, పరీక్షా కేంద్రాల్లోనూ అక్రమాలు జరుగుతున్నాయని వైద్యవిద్య నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బిహార్, ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, ఇన్విజిలేటర్స్ సాయం చేయడం వంటి అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ర్యాంకులు వస్తున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. దీని వల్ల ఆలిండియా కోటాలో దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని వైద్యవిద్య నిపుణులు, తల్లిదండ్రు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలిండియా కోటా లో 15శాతం సీట్లుంటాయి. ఎక్కువ స్కోర్ చేసిన వారికే ఎయిమ్స్‌లోనూ, ఆలిండియా కోటాలోనూ సీటు దక్కే చాన్స్ ఉంటుంది. ఈసారి ఉత్తరాది వారే ఎక్కువగా నీట్‌లో స్కోరింగ్ చేశారు. దాంతో ఆలిండియా కోటాలో సీట్లలో మెజారిటీ వారికే దక్కే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాగా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో నీట్ రాసే విద్యార్థుల సంఖ్య గడిచిన ఏడేళ్లలో దాదాపు రెట్టింపు అయింది. ఆయా రాష్ట్రాల నుంచి 2018లో 4,78,255 మంది నీట్‌కు హాజరు కాగా.. 2024లో అవే రాష్ట్రాల నుంచి 11,57,180 మంది నీట్ రాశారు. ఇక దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళలో ఈ ఏడేళ్లలో వైద్య కళాశాలలు పెరిగాయిగానీ.. నీట్ రాసే విద్యార్థుల సంఖ్య గడచిన ఉత్తరాది రాష్ట్రాల స్థాయిలో పెరగలేదు. 2018లో ఈ ఐదు రాష్ట్రాల నుంచి 4,24,523 మంది నీట్‌కు హాజరు కాగా.. 2024 నాటికి ఆ సంఖ్య 5,82,845కు పెరిగింది.

ఎయిమ్స్‌లో తగ్గుతున్న మనోళ్ల సంఖ్య

మెడిసిన్ ర్యాంకులంటే రెండు మూడేళ్ల క్రితం వరకూ తెలుగు రాష్ట్రాల విద్యార్థులదే హవా. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఆలిండియా టాప్ 100 జాబితాలో మన విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఢిల్లీ ఎయిమ్స్‌లో 132 సీట్లుంటే గతేడాది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు 35 సీట్లు పొందారు. ఏటా 25 మంది దాకా అక్కడే సీటు సాధించేవారు. కానీ దేశంలోని ఏ ఎయిమ్స్‌లోనూ తెలుగు విద్యార్థులు సీట్లు పొందడం కష్టంగా మారింది. ఈ ఏడాది 705పైగా మార్కులు సాధించిన వారు 2 వేల మంది ఉన్నారు. నీట్ పరీక్ష ఆఫ్‌లైన్‌లో జరగడం అనేక అక్రమాలకు, అనుమానాలకు తావిస్తోంది. అదే ఆన్‌లైన్‌లో జరిగితే దక్షిణాది రాష్ట్రాలు.. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈస్థాయిలో నష్టపోయే అవకాశం ఉండదు.

– డి. శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ, హైదరాబాద్

కాలేజీలు ఇక్కడే ఎక్కువ..

2018 నాటికి దేశంలో 499 మెడికల్ కాలేజీలు.. వాటిలో 70012 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 706 మెడికల్ కాలేజీలుండగా.. వాటిలో 1,08,940 సీట్లున్నాయి. ఉత్తరాదితో పోల్చుకుంటే దక్షిణాది రాష్ట్రాలోనే కాలేజీలు, సీట్లు ఎక్కువగా ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళలో మొత్తం 270 మెడికల్ కాలేజీలుండగా.. మిగిలిన అన్ని రాష్ట్రాలో కలిపి 436 వైద్య కళాశాలలున్నాయి. అంటే దేశంలోని మొత్తం మెడికల్ కాలేజీల్లో 38 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. సీట్ల విషయానికొస్తే.. ఈ ఐదు రాష్ట్రాల్లో 43,525, మిగతా అన్ని రాష్ట్రాల్లో కలిపి 65,415 సీట్లున్నాయి.

ర్యాంకులన్నీ ఉత్తరాదికేనా?

గడచిన మూడేళ్లుగా దక్షణాదికి.. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు నీట్ టాప్ 100 జాబితాలో తగ్గుతూ వస్తున్నారు. గతంలో టాప్-100లో మనోళ్లు కనీసం 25-30 మంది ఉండేవారు. నిరుడు 687పైగా మార్కులను సుమారు వెయ్యి మంది సాధించగా.. అందులో 40 మంది వరకూ తెలుగువారే. ఈసారి 687పైగా మార్కులు సాధించిన సంఖ్య దాదాపు ఏడు వేలు. అంటే ఏడు రెట్లు పెరిగారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రభుత్వ వైద్యకళాశాలల సంఖ్య తక్కువ. డబ్బులు కట్టి ప్రైవేటులో చేరేవారు తక్కువే. అందుకే అక్కడ కన్వీనర్ కోటాలో సీటు కొట్టేందుకు ఒక్కొక్కరు ఐదారుసార్లు నీట్ రాస్తుంటారు.

ఉపాధి కూలీల్లో కూలీగా ఐఆర్‌ఎస్ అధికారి!


పొలంలో కూలీలతో కలిసి భోజనం చేస్తున్న ఐఆర్‌ఎస్ అధికారి సందీప్ బాగా

ఈ ఫొటోలోని మహిళలు ఉపాధి కూలీలు! వారి మధ్య కూర్చుని ప్లేట్లో అన్నం తింటూ కూలీల్లో కూలీగా కలిసిపోయిన యువకుడు ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్‌ఎస్) అధికారి సందీప్ బాగా! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సందీప్, బెంగళూరు సౌత్ సెంట్రల్ ట్యాక్స్ కమిషనరేట్‌లో జీఎస్టీ ఇన్వెస్టిగేషన్ వింగ్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం నూతన్‌కల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగతుంటే అక్కడకు వెళ్లారు. తానూ ఉపాధి కూలీగా మారిపోయారు. కూలీలతో కలిసి ఇంకుడు గుంతలు తీశారు. మట్టి తట్టలు ఎత్తారు.. మోశారు! పొద్దున 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 దాకా కూలీలతో కలిసి పనిచేశారు. మధ్యాహ్నం కూలీలు చెట్ల కింద కూర్చుని సద్దులు తింటుంటే తానూ ఓ టిఫిన్ ప్లేట్ తీసుకొని అన్నం, చట్నీ అడిగి పెట్టించుకొని తిన్నారు. కొద్దిసేపు ఉపాధి కూలీలతో కలిసి బతుకమ్మ ఆడారు. పనులకు వచ్చిన 152 మందికి తన జీతం డబ్బుల నుంచి తలా రూ.200 పంచారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలపై కూలీలకు అవగాహన కల్పించారు. ఓ ఉన్నతాధికారి కూలీలైన తమతో కలిసిపోయి పనులు చేసి.. తమతో కలిసి భోజనం చేసి, డబ్బులూ ఇవ్వడంతో కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. – నూతన్‌కల్

కార్పొరేషన్లకు రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవు

- పాత జిల్లాల ఆధారంగా డిస్కంల్లో ఉద్యోగాల భర్తీ
- హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థ టీఎస్ ఎస్పీడీసీఎల్‌లోని ఉద్యోగాలు సివిల్ పోస్టులు కాదు కాబట్టి అందులో చేపట్టే నియామకాలకు రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సంస్థలోని ఉద్యోగాలను లోకల్ రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా పాత జిల్లాల ప్రాతిపదికనే ఇవ్వాలని పేర్కొంది. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సోమారత్ తండాకు చెందిన టి.గోపాల్.. టీఎస్ఎస్పీడీసీఎల్ సంస్థ 2019లో జారీచేసిన నోటిఫికేషన్ - 3 లో పేర్కొన్న జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆయన చదవిన పాఠశాల పరిధి ప్రకారం సంగారెడ్డి సర్కిల్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యారు. కానీ కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత అతడిని నాన్‌లోకల్‌గా పరిగణించారు. దీంతో పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్‌కు రాష్ట్రపతి ఉత్తర్వులతో సంబంధం లేకుండా మెరిట్ ఆధారంగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని ఆదేశించింది. ఎంపికైన తేదీ నుంచి అన్ని ప్రయోజనాలు అందజేయాలంటూ తుది తీర్పు ప్రకటించింది.

హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్‌కు ఊరట

- హెచ్‌సీఏలో మెంబర్‌గా గుర్తించాలని అంబుడ్స్‌మన్ తీర్పు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అంబుడ్స్‌మన్ కం ఎథిక్స్ ఆఫీసర్ వద్ద ఊరట లభించింది. హెచ్‌సీఏలో అనుబంధ సంస్థ కం మెంబర్‌గా గుర్తించాలని అంబుడ్స్‌మన్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రత్యేక సంస్థగా విడిపోయినందున దానికి సభ్యత్వం ఇవ్వాలని తెలిపారు. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్‌కు కాకుండా ప్రైవేటు చిరునామా కలిగిన ఏపీ హైకోర్టు అడ్వకేట్స్ క్రికెట్ అసోసియేషన్ క్లబ్‌కు సభ్యత్వం ఇవ్వడం చెల్లదని స్పష్టం చేసింది.

ఏపీలో ఇచ్చారు.. మీరెందుకివ్వరు?

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే పింఛను పెంచారు
- ఆరు నెలలైనా ఇక్కడ మీ హామీ అమలు చేయరా?
- పార్టీ మారతానని నాపై తప్పుడు ప్రచారం
- వారిపై చట్టపరంగా ముందుకెళ్తా: హరీశ్‌రావు


మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మొదటి సంతకంతోనే పింఛను మొత్తాన్ని రూ.4వేలకు పెంచారని.. తెలంగాణలో ఆరు నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు పింఛను ఎప్పుడు పెంచుతారా అని ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రజాపాలన పేరిట ప్రజల నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకుని.. వాటిని ఇంతవరకు పరిష్కరించలేదని, పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. కాంగ్రెస్ హామీ ప్రకారం దివ్యాంగులకు రూ.6వేలు, ఇతరులకు రూ.4వేల పింఛను తక్షణం అందజేయాలని డిమాండ్ చేశారు. పింఛను మొత్తం పెరగకపోగా, రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన పింఛను రాలేదని వృద్ధులు ఆవేదన చెందుతున్నారన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. అధికారం చేపట్టగానే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆరు నెలలయినా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకుండా నిరుద్యోగ, యువతీ యువకులను మోసం చేసిందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి.. 11 వేల పోస్టులే ప్రకటించారని, హామీ ప్రకారం 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, ఇతర ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో పాసయిన అభ్యర్థులను ఒక పోస్టుకు 50మంది చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేస్తున్నారని.. దీనిని ఒక పోస్టుకు వందమంది చొప్పున పెంచాలని, తద్వారా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 1:100 విధానం అమలు చేస్తామని ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పారని హరీశ్ గుర్తు చేశారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య కనీసం రెండు నెలల వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని, నిరుద్యోగ యువతీ యువకులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు.

ఒకటో తేదీన జీతాలిస్తే.. నిరసనలెందుకు?

ప్రతీ నెల ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలిస్తున్నామని మంత్రులు చెబుతున్నారని, అలా జీతాలిస్తే.. ఆశా వర్కర్లు వైద్యవిధాన పరిషత్ వద్ద ధర్నా ఎందుకు చేస్తారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు సహా.. ఎన్‌హెచ్‌ఎం కింద పని చేసే 17వేల మందికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల పరిధిలో పని చేసే కార్మికులకు 5 నెలలుగా వేతనాలు రావడంలేదన్నారు. రాష్ట్రంలోని 60 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది జీతాల కోసం రోడ్డెక్కుతున్నారని గుర్తు చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని, గత ప్రభుత్వ హయాంలో మంజూరైన చెక్కులను సైతం ఇవ్వకుండా పేదప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. లక్షన్నర మంది చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు.

వారికి లీగల్ నోటీసులు పంపిస్తా

తాను పార్టీ మారబోతున్నట్లుగా జరుగుతున్న ప్రచారంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వ్యూస్ పెంచుకోవడం కోసం కొందరు వ్యక్తులు, రేటింగ్‌ల కోసం కొన్ని టీవీ ఛానళ్ల తనపై బురద చల్లేయత్నం చేస్తున్నాయన్నారు. వాళ్ల స్వలాభం కోసం తనను, బీఆర్ఎస్ పార్టీని ప్రజల్లో దిగజార్చే యత్నం చేస్తే ఊరుకోనని.. లీగల్ నోటీసులు ఇచ్చి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉరేసుకుని ప్రేమజంట ఆత్మహత్యా యత్నం

- ప్రియురాలు మృతి.. ఉరి బిగుసుకోకపోవడంతో గొంతుకోసుకున్న ప్రియుడు
- మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డలో ఘటన


రవళి (ఫైల్), రవీందర్

బయ్యారం, జూన్ 17: విడిపోవాల్సి వస్తుందేమోనన్న భయమో.. పెద్దలు ఒప్పుకోరన్న ఆందోళనో తెలియదు కాని.. ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కోటగడ్డ గ్రామానికి చెందిన కొటెం లక్ష్మీనారాయణ, నీలమ్మ దంపతుల కుమార్తె రవళి(21)కి మూడేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వ్యక్తితో వివాహం కాగా.. భర్తతో మనస్పర్థల కారణంగా కొంతకాలంగా రవళి పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో కోటగడ్డకు చెందిన 23ఏళ్ల మెండు రవీందర్‌తో రవళికి పరిచయం ఏర్పడి అదికాస్తా ప్రేమకు దారితీసింది. కొన్నాళ్ల క్రితం రవీందర్ తల్లిదండ్రులు యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలోని ఓ గ్రామానికి వలస వెళ్లడంతో అతను అక్కడే ఉంటున్నాడు. అప్పుడప్పుడు స్వగ్రామమైన కోటగడ్డకు రాకపోకలు సాగిస్తున్నాడు. కాగా, సుమారు మూడు నెలల క్రితం రవీందర్, రవళి కనిపించకుండా పోయారు. ఆ సమయంలోనే వారు వివాహం చేసుకున్నారనే వార్తలు వచ్చాయి. అయితే తమ కూతురు కనిపించడంలేదని రవళి తల్లిదండ్రులు, తమ కుమారుడు కనిపించడంలేదని రవీందర్ కుటుంబ సభ్యులు రాయగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో అదృశ్యం కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి రవీందర్‌ను, రవళిని తీసుకొచ్చి వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మూడు రోజుల క్రితం రవీందర్ స్వగ్రామానికి రాగా, ఆదివారం రాత్రి రవళి రహస్యంగా అతనింటికి వెళ్లింది. మేడపై నిద్రించిన వాళ్లిద్దరూ తెల్లవారుజామున ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరేసుకున్నారు. ఉరి బిగుసుకొని రవళి అక్కడికక్కడే మృతి చెందగా.. ఉరి బిగుసుకోకపోవడంతో బతికిన రవీందర్ గొంతుకోసుకున్నాడు. గడియపెట్టి ఉండటంతో అనుమానం వచ్చిన రవీందర్ కుటుంబసభ్యులు తలుపులు పగలగొట్టి చూడగా.. ఉరివేసుకొన్న రవళి అప్పటికే మృతి చెందగా.. గొంతుకోసుకున్న రవీందర్ రక్తపుమడుగులతో ప్రాణాపాయ స్థితిలో ఉండటాన్ని చూసి తొలుత జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. శవపరీక్ష అనంతరం పోలీసులు రవళి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా.. అంత్యక్రియలు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కలంపై కక్ష

ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్ మీద పద్నాలుగేళ్ళనాటి ఓ కేసును తిరగదోడి, ఆమెమీద ఏకంగా 'ఊపా' ప్రయోగానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ న్యాయశాస్త్ర మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను కూడా ఈ క్రూరమైన చట్టం కింద విచారించడానికి గవర్నర్ అనుమతించారు. గత ఏడాది అక్టోబర్‌లో వీరిద్దరినీ ఐపీసీ సెక్షన్‌లతో పాటు ఊపా చట్టంలోని 13వ సెక్షన్‌కింద విచారించేందుకు ఢిల్లీ పోలీసులు అనుమతికోరితే, రెండు ఐపీసీ సెక్షన్లకు మాత్రమే సరేనన్న గవర్నర్ ఇప్పుడు ఊపాకు అనుమతించారు. ఎటువంటి విచారణలు లేకుండా సాధ్యమైనంత వేగంగా అరుంధతిని నిర్బంధంలోకి నెట్టేయాలని పాలకులకు ఉత్సాహంగా ఉన్నట్టుంది. కానీ, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులున్న ఒక రచయిత్రితో ఈ రీతిన వ్యవహరిస్తూ వారు దేశానికి ఎనలేని అపకీర్తి తెస్తున్నారు.

రాజకీయ ఖైదీల పక్షాన పనిచేసే కమిటీ ఒకటి ఢిల్లీలో 2010లో ఏర్పాటుచేసిన ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాలు వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేట్టుగా ఉన్నందున దేశద్రోహం కేసు పెట్టాలంటూ 'రూట్స్ ఇన్ కశ్మీర్' సంస్థ నాయకుడు సుశీల్ పండిట్ అప్పట్లో ఫిర్యాదు చేశారు. 'దేశద్రోహం' కేసు స్థాయిలో ప్రసంగాలు లేవని పోలీసులు మొదట ఊరుకున్నా, మెట్రోపాలిటన్ మేజి[illegible] ఆదేశాలతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సివచ్చింది. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం కాదు అంటూ 'ఆజాదీ: ద ఓన్లీవే' సదస్సులో అరుంధతీరాయ్ వ్యాఖ్యానించిన ఆ విడియో ఇప్పటికీ అందుబాటులో ఉంది. ఆ వ్యాఖ్యతో పాటుగా, దానికి సమర్థనగా ఆమె భారతదేశం ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రస్తావనలు, తీర్మానాలను సైతం ఉటంకించారు. అవన్నీ వెనక్కుపోయి వివాదాస్పదంగా కనిపించే ఆ వ్యాఖ్యలు మాత్రమే అవసరార్థం అనంతరకాలంలో ప్రచారంలోకి వచ్చాయి. కశ్మీర్ విషయంలో అప్పటికే కొన్ని సానుకూల చర్యలు ఆరంభించిన తరుణంలో ఆనాటి ప్రభుత్వం ఈ కేసును ముందుకు తీసుకుపోలేదు.

ఇప్పుడు ఆ కశ్మీర్ లేదు. రెండుగా విడిపోయి కేంద్రపాలిత ప్రాంతంగా మిగిలింది. ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయిన తరువాత అది ఎంతో బాగుపడిందని చెబుతున్న బీజేపీ పెద్దలు, ఇప్పటి పరిస్థితులతో సంబంధం లేని దశాబ్దంన్నర నాటి ఓ కేసును ఎందుకు తవ్వితీస్తున్నారో తెలియదు. చిన్నాచితకా సెక్షన్లతో కాక, ఏకంగా ఊపాతో ఉరిబిగించాలన్న ఆలోచన అంతలోనే వారికి కలిగింది. మూడేళ్ళు ఖైదుచేయగల సెక్షన్లకంటే, వెంటనే అరెస్టుచేసి జైల్లోకి నెట్టివేసి, ఏడేళ్లకుపైగా శిక్షపడే ఊపాను వారు ఎంచుకున్నారు. వారు సమూలంగా ప్రక్షాళించామంటున్న కశ్మీర్‌లో ఉగ్రవాదం తిరిగి బుసకొడుతున్న పరిస్థితులను చూస్తున్నాం. మూడోసారి అధికారంలోకి రాగలిగినా, భారతీయులు బీజేపీ రెక్కలను కత్తిరించారని, సంకీర్ణ పాలనలో మోదీ కచ్చితంగా తగ్గవలసి వస్తుందని దేశవిదేశీ మీడియా విశ్లేషిస్తున్న నేపథ్యంలో, అరుంధతిని చూపి వారు ఏదో సందేశాన్ని ఇవ్వదల్చుకున్నట్టు ఉంది. ఊపా ప్రయోగాన్ని సుప్రీంకోర్టు అంగీకరించదని, దాని గతకాలపు ఆదేశాలు, సూత్రాలకు అనుగుణంగా ఈ నిర్ణయం లేదని న్యాయనిపుణులు అంటున్నారు. సుదీర్ఘకాలం తరువాత సర్వోన్నత న్యాయస్థానంలో ఏమి తేలినప్పటికీ, అంతలోగా గిట్టనివారిని కాల్చుకుతినేందుకు ఊపా ఉపకరిస్తుంది. ఆయా వ్యక్తులు, లేదా సంస్థల చర్యలు, చేష్టల కారణంగా భవిష్యత్తులో హింస రేగకుండా, నేరాలు జరగకుండా నిరోధించడం ఊపా ఆశయం. సభ జరిగిన పద్నాలుగేళ్ళ తరువాత కేసు తవ్వితీయడం అర్థంలేనిది. వక్తల ప్రసంగాలతో కశ్మీరీ ప్రజలు మరింత రెచ్చిపోయి, వేర్పాటువాదం ఇంకొంత బలపడిన దాఖలాలు ఏమైనా ఉంటే అవి అప్పట్లోనే కనిపించివుండేవి, అప్పుడు ఆ ఉపన్యాసాలకు అనంతర పరిణామాలకు మధ్య ఒక లంకె ఏర్పడి, కేసు సముచితమేనని కొందరికైనా నమ్మకం కలిగేది. అరుంధతి తన ప్రసంగంలో కశ్మీర్ అంతర్జాతీయ స్థితి, హోదా, ప్రజల రాజ్యాంగహక్కుల విశ్లేషణకు ప్రయత్నించి ఉంటారే తప్ప, అధికారపార్టీ నాయకుల్లాగా విద్వేషాలను, భావోద్వేగాలను రెచ్చగొట్టే పని చేయరు. అరుంధతీరాయ్ ఒక బలమైన అసమ్మతి గొంతు, ప్రజాపక్షపాతి. పీడితవర్గాల పక్షాన ధైర్యంగా మాట్లాడే ఆమె, బీజేపీ దాని అనుబంధ సంస్థలను ఏకిపారేయడంలో ముందుంటారు. ఇటలీ జీ7 పర్యటనలో, భారత ప్రజాస్వామ్యం గురించి నరేంద్రమోదీ ఎంతో గర్వంగా నాలుగుమాటలు చెబుతున్న తరుణంలోనే, అరుంధతిమీద ఊపా ప్రయోగం జరగడం విశేషం. అసమ్మతి గొంతులను ఏమాత్రం వదిలిపెట్టబోమన్న బలమైన హెచ్చరిక ఇది.

అద్భుత ప్రజాతీర్పు ఇది, గొప్ప మార్పుకు నాంది

17వ లోక్‌సభ ఎప్పుడు పూర్తయిందో, 18వ లోక్‌సభ ఎప్పుడు ఏర్పడిందో తెలియనంతగా దేశ రాజకీయాల్లో మరో ఘట్టం ప్రారంభమైంది. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి బాధ్యతలు స్వీకరించడం, మంత్రివర్గాన్ని ఏర్పర్చడం, ఆ వెంటనే ఆయన ఇటలీలో జీ–7 శిఖరాగ్ర సమావేశానికి హాజరై అగ్రదేశాధినేతలతో చర్చలు జరపడం, రైతుల సంక్షేమానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించడంతో అంతా ఎప్పటి మాదిరే ఒక క్రమ పద్ధతిలో కొనసాగుతోందన్న అభిప్రాయం కలిగిస్తోంది. కేంద్రంలోని అన్ని ముఖ్యమైన శాఖలను గతంలో బాధ్యతలు నిర్వర్తించిన వారికే అప్పగించారు. రక్షణమంత్రిగా రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రిగా అమిత్ షా, ఆర్థికమంత్రిగా నిర్మలా సీతారామన్, విదేశాంగ శాఖ మంత్రిగా జయశంకర్, రవాణా, హైవేల మంత్రిగా నితిన్ గడ్కరి, విద్యామంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ యథా ప్రకారం తమ బాధ్యతలను నిర్వహించడం ప్రారంభించారు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

గత పది సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధిని అదే విధంగా కొనసాగించడం కోసం ప్రధానమంత్రి ముఖ్యమైన మంత్రులను కొనసాగించారు. అంతేకాదు, భారతదేశం అవలంబిస్తున్న రక్షణ, ఆర్థిక, విదేశాంగ, అంతర్గత భద్రతా విధనాలలో మార్పు ఉండదనే సంకేతాన్ని పంపించారు. మిత్రపక్షాల్లో చురుకుగా పనిచేసే అయిదుగురు నేతలకు కీలక కేబినెట్ బాధ్యతలు అప్పగించారు. బీజేపీకి చెందిన మాజీ ముఖ్యమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్‌లకు అత్యంత ముఖ్యమైన మంత్రిత్వ శాఖలను కేటాయించారు. ప్రజలకు తాము చేసిన వాగ్దానాలను నెరవేర్చడం విషయంలో కూడా వెనక్కి తగ్గబోమన్న సందేశాన్ని కూడా ప్రధానమంత్రి ఈ మంత్రివర్గం ఏర్పాటు ద్వారా పంపించారు. అంతేకాదు, ఈ మంత్రివర్గం ద్వారా మొదటి పదేళ్లలో తాను చేసిన పనులన్నీ ట్రైలర్‌గా చెప్పిన ప్రధానమంత్రి రానున్న పది సంవత్సరాల్లో అసలు సిసలైన అభివృద్ధి ఏమిటో నిరూపించుకోవాలనుకున్నారు.

ఈశాన్యంలో అరుణాచల్ ప్రదేశ్, తూర్పున ఒడిషాలో ఎన్డీఏ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడడం కూడా ఆరోగ్యకరమైన పరిణామం. ఒడిషాలో 24 సంవత్సరాలు అధికారంలో ఉన్న ఒక పార్టీని గద్దెదించి బీజేపీ అధికారంలోకి రావడం ఒక చరిత్రాత్మక పరిణామమైతే, ఈ ప్రభుత్వానికి ఒక ఆదివాసీ సంతాల్ తెగకు చెందిన మోహన్ మాఝీ ముఖ్యమంత్రి కావడం దేశంలో ఒక సామాజిక విప్లవానికి మోదీ దోహదం చేస్తున్న తీరుకు నిదర్శనం.

దేశంలో చెప్పుకోదగ్గ మార్పు ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది. ఒక నియంత నేతృత్వంలో గత అయిదేళ్లుగా జరిగిన అరాచక, కక్షపూరిత పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రతిఘటించారు. రైతులు, ఉద్యోగులతో పాటు వివిధ తరగతులకు చెందినవారు తమపై జరిగిన అణిచివేతను, నిర్బంధ విధానాలను ధిక్కరించారు. దాదాపు ప్రతి జిల్లాలోనూ, ప్రతి నియోజకవర్గంలోనూ జగన్ పార్టీ ఘోరంగా ఓటమి పాలైంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది జగన్ పాలన పట్ల అసహ్యంతో ప్రజలు సాధించిన నిశ్శబ్ద విప్లవ ఫలితం.



ఒక సామాన్య కార్యకర్తనైన నన్ను పార్టీ జాతీయ కార్యదర్శిగా నియమించారు; ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించి ప్రజల ఆశీర్వాదం లభించేందుకు అవకాశం కల్పించారు; అక్కడితో ఆగకుండా మంత్రిపదవిలో నియమించారంటే అది మోదీ–చంద్రబాబు నా మీద పెట్టుకున్న నమ్మకమే కారణం.

కేంద్రంలో నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల అద్భుత కలయికతో ప్రజలు ఉప్పొంగిపోయి ఈ కలయికను కళ్లకద్దుకున్నారు. దేశంలో గత పదేళ్లుగా మోదీ ఒక్క రోజు కూడా విశ్రమించకుండా అభివృద్ధి కోసం, దేశం ప్రపంచ దేశాల్లో తలెత్తుకుని తిరగడం కోసం, భారతీయుడి మనోభావాలకు గౌరవం లభించడం కోసం చేస్తున్న కృషి ప్రజలు గమనిస్తున్నారు. అదే విధంగా అభివృద్ధికే మారుపేరైన చంద్రబాబు నాయుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం నిస్వార్థంగా, నిజాయితీగా, చిత్తశుద్ధితో పనిచేయగలరని ప్రజలు గమనించారు. 'చంద్ర బాబు ఎప్పుడు ఫోన్ చేసినా తన రాష్ట్రానికి చెందిన సమస్యలకోసమే చేస్తారు. ఆయన ఏదడిగినా నెరవేర్చేందుకు ప్రయత్నించండి..' అని గతంలో వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పీఎంఓలో అధికారులను ఆదేశించేవారు. అప్పటికీ ఇప్పటికీ చంద్రబాబు వైఖరిలో మార్పే లేదు. ఇక గత పదేళ్లుగా జనం మధ్యలోనే తిరుగుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను నిరసిస్తూ, అనేక అవమానాలను తట్టుకుంటూ ఉగ్రరూతలూగే ప్రసంగాలు చేసిన పవన్ కల్యాణ్ అగ్నిలో ఆజ్యం పోసినట్లు ఈ విజయానికి కారకులయ్యారు. అందుకే మోదీ ఆయనను 'పవన్ కాదు, తుఫాన్' అని ప్రశంసించారు. మోదీ–చంద్రబాబు–పవన్‌ల గొప్ప కలయిక తమకు అదృష్టంగా లభించిందని ప్రజలు భావించినందువల్లే వారి నాయకత్వాన్ని గుండెలకు హత్తుకున్నారు.

జూన్ మొదటి వారంలో లభించిన అద్భుత విజయాల తర్వాత అగ్రనేతలందరూ తమ కర్తవ్య పాలనపై దృష్టి సారించారు. తన శైలికి తగ్గట్లుగా చంద్రబాబు నాయుడు తొలి రోజు నుంచే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రారంభించారు. పెద్ద ఎత్తున ఉద్యోగాల నియామకానికి శ్రీకారం చుడుతూ మెగా డీఎస్సీపై సంతకం చేశారు. జగన్ పాలనలో దురాక్రమణలకు తావిచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు. పింఛన్లను రూ. 4వేలకు పెంచారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించారు. జగన్ దుర్మార్గాలకు వంత పలికిన అధికార వ్యవస్థ ప్రక్షాళనకు నడుం కట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అయిదో రోజే పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అభివృద్ధి, పునర్నిర్మాణం. ప్రజా సంక్షేమం తప్ప మరో ధ్యాస లేని ముఖ్యమంత్రి సారథ్యంలో ఏపీ అనతికాలంలో మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందన్న విషయంలో ఎటువంటి సందేహం లేదు.

ఇలాంటి నాయకత్వంలో అత్యంత కీలకమైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రిపదవి లభించడం నాకెంతో గర్వకారణం. గత కొన్ని దశాబ్దాలుగా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఏ పదవి లభించినా, ఏ పనిచేయాల్సి వచ్చినా కష్టపడి పనిచేయడం, ఇచ్చిన బాధ్యతను నూటికి నూరుపాళ్లు విజయవంతంగా నెరవేర్చడం వల్లనే నాకీ గుర్తింపు లభించిందనుకుంటున్నాను. భారతీయ జనతా పార్టీలో వాజపేయి, అద్వానీ, నరేంద్రమోదీ, వెంకయ్యనాయుడు లాంటి నేతలందరూ అతి సామాన్య స్థాయి నుంచి ఉన్నత పదవులకు ఎదిగినవారే. సామాన్య కార్యకర్తలకు, పార్టీకోసం కష్టపడి పనిచేసేవారికి బీజేపీలో ఎప్పుడూ అవకాశం లభిస్తూనే ఉంటుంది. ఒక సామాన్య కార్యకర్తనైన నన్ను పార్టీలో జాతీయ కార్యదర్శిగా నియమించి, ఉత్తర ప్రదేశ్, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో పరిశీలకుడుగా, సహ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. అండమాన్ నికోబార్‌కు ఇన్‌ఛార్జిగా నియమించారు. ధర్మవరం లాంటి రాజకీయంగా అత్యంత క్లిష్టమైన నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించి అక్కడ ప్రజల ఆశీర్వాదం లభించేందుకు అవకాశం కల్పించారు. అక్కడితో ఆగకుండా మంత్రిపదవిలో కూడా నియమించారంటే అది మోదీ–చంద్రబాబు నాయుడు నా మీద పెట్టుకున్న విశ్వాసానికి కారణం. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత నాపై ఉన్నది. గత అయిదు సంవత్సరాలుగా 'సత్యకాలమ్' ద్వారా పార్టీ జాతీయ కార్యదర్శిగా దేశంలోనూ, రాష్ట్రంలోనూ జరుగుతున్న పరిణామాలపై విశ్లేషణలు అందించేందుకు అవకాశం కల్పించిన ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సంపాదకవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతూ **ఈ కాలమ్‌కు విరామం ప్రకటిస్తున్నాను.**

(బీజేపీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి)

మనకు మిగిలింది పావు శతాబ్దమే!

మానవ ఆలోచనల్లో కొన్ని మైలురాళ్లు ఉంటాయి. వాటిని విస్మరించటం కష్టం. వాటి పరిధిని మనం పూర్తిగా దాటలేం. ప్రతి మైలురాయి మన జ్ఞాన విస్తరణలో ఒక కీలక దశే! డార్విన్ పరిణామ వాదం, కార్ల్ మార్క్స్ శ్రమ సిద్ధాంతం, సిగ్మండ్ ఫ్రాయిడ్ మానసిక విశ్లేషణ, జపాల్ సార్త్ర అస్తిత్వవాదం, నోమ్ ఛామ్‌స్కీ భాషా సిద్ధాంతాలు వీటిల్లో ప్రముఖమైనవి. వాటిని ప్రతిపాదించినప్పుడే కాకుండా ఇప్పటికీ వాటి ఆధారంగా సమాజం, మనుషులపై విశ్లేషణలు వెలువడుతూనే ఉన్నాయి. మేధావుల వ్యక్తిగత పేర్లతో కాకుండా విశేష ప్రాచుర్యాన్ని పొందిన కొన్ని పరిశోధనలు, నివేదికలు కూడా మనుషుల్ని విపరీతంగా ప్రభావితం చేస్తాయి. అట్లాంటి వాటిల్లో వృద్ధికి పరిమితులు (ద లిమిట్స్ టు గ్రోత్) పేరుతో 1972లో వెలువడిన ఒక నివేదికను ప్రముఖంగా చెప్పుకోవాలి. ఇటలీలోని 'ద క్లబ్ ఆఫ్ రోమ్' అనే స్వచ్ఛంద సంస్థ కోసం ఆ నివేదికను వెలువరించారు. ప్రపంచ సమస్యలను లోతుగా చర్చించి, పరిష్కారాలను సూచించే లక్ష్యంతో క్లబ్ ఆఫ్ రోమ్ ఏర్పడింది. అభివృద్ధి అపరిమితం, మానవ జైత్రయాత్రకు తిరుగులేదన్న భావనలను ఆ నివేదిక కదిలించి వేసింది. వివిధ రకాల అవసరాలు, సుఖాల కోసం మనం వాడే వనరులు పరిమితమనీ, అవధుల్లేని అభివృద్ధి పేరుతో పారిశ్రామిక విప్లవం నుంచి మనిషి మొదలు పెట్టిన ప్రయాణం, దిశ మారకపోతే మొత్తం నాగరికతే సంక్షోభంలో కూరుకుపోతుందనీ హెచ్చరించింది. ప్రకృతిని జయించటాన్ని మానవ కృషికి, ఆధిక్యానికి నిదర్శనంగా భావించటం అన్ని నాగరికతల్లోనూ ఒకనాడు బలంగా ఉండేది. ఇప్పటికీ అది పోయిందని చెప్పలేం. కానీ 'లిమిట్స్ టు గ్రోత్' నివేదిక వెలువడిన నాటి నుంచి ఆ ఆలోచనలో మార్పు మొదలైంది. ప్రగతికి పరిమితులు తప్పవన్నది స్పష్టమైంది. లాభాపేక్షే ధ్యేయమైన ఆర్థిక వ్యవస్థను నియంత్రించాలన్న భావన బలపడింది. ఈ నివేదిక కలిగించిన ప్రభావంతో భూగోళ పరిరక్షణ కోసం ధరిత్రి సదస్సును నిర్వహించారు. అంతకు పదేళ్ల ముందు (1962) జీవశాస్త్రవేత్త రేచల్ కార్సన్ తన ప్రఖ్యాత పుస్తకం నిశ్శబ్ద వసంతం (సైలెంట్ స్ప్రింగ్)ను ప్రచురించారు. క్రిమిసంహారక మందులు వ్యవసాయాన్ని ఎంత విషతుల్యం చేస్తాయో అందులో విశ్లేషించారు. ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. క్రిమిసంహారకాలపై భయాలు మొదలయ్యాయి. రసాయనిక ఎరువులు తెచ్చే వినాశనాలపై ఆందోళనలు కమ్ముకున్నాయి.

మనుషులు స్వయంగా పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న తీరునూ అందుకు ఊతం ఇస్తున్న ఆర్థిక విధానాలనూ నియంత్రించాల్సిన అవసరాన్ని అర్థమయ్యేలా చేయటంలో ద లిమిట్స్ టు గ్రోత్ అందించిన తోడ్పాటు చాలా ఘనమైంది. అందుకే ఆ పుస్తకానికి విశేష ఆదరణ లభించింది. దాని అమ్మకాలు కోట్లను దాటాయి. ఇక ద లిమిట్స్ టు గ్రోత్ వెలువడిన ఏడాదికి ప్రముఖ ఆర్థికవేత్త ఇ.ఎఫ్.షుమాకర్ వెలువరించిన 'స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్' పుస్తకం కూడా చాలా ప్రభావాన్ని కలిగించింది. బుద్ధుడు, గాంధీ ప్రబోధించిన కోరికల కట్టుబాటు భావాలనూ వనరుల పరిమితుల దృష్ట్యా అపరిమిత అభివృద్ధిని కట్టడి చేయాల్సిన అవసరాలనూ సమన్వయపరుస్తూ షుమాకర్ తన వాదాన్ని రూపొందించారు. 1945 తర్వాత వెలువడిన 100 అత్యంత ప్రభావిత పుస్తకాల్లో ఒకటిగా స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్ గుర్తింపు లభించింది. ఈ రచనలన్నిటి ప్రభావంతో పర్యావరణానికి హాని లేకుండా అభివృద్ధి జరగాలన్న భావన బలపడటం మొదలైంది. దాన్నే నిలకడతో కూడిన అభివృద్ధిగా (సస్టేనబల్ డివలప్‌మెంట్) పిలుస్తున్నాం.



ఈ భూగ్రహం మీద మనం భద్రంగా బతకాలంటే తొమ్మిది పరిధుల్లోనే మన కార్యక్రమాలు సాగాలని 2015లో శాస్త్రవేత్తలు స్పష్టంచేశారు. వాతావరణం, జీవవైవిధ్యం, అడవులు, ఎరువులకు సంబంధించి పరిమితులను ఇప్పటికే దాటేశాం. విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగంతో అయిదో హద్దునీ అధిగమించేశాం. మొక్కల వేళ్ల చుట్టూ మట్టిని అంటుకుని ఉండే నీటిని హరించివేయటంలో ఆరో పరిమితినీ దాటేశాం. ఇక మిగిలిన మూడు పరిమితులను కూడా దాటేస్తే (సముద్రాల ఆమ్లీకరణ, వాతావరణంలోకి వదిలిపెట్టే ఘన–ద్రవ కణాలు, ఓజోన్‌పొర క్షీణత) మానవాళి మనుగడ ప్రమాదంలో పడినట్లే. భూగోళానికి నష్టంచేయని నవపరిమితుల్లోకి మానవులు వస్తే 2050 నాటికి నవయుగం మొదలవుతుంది. అది జరగకపోతే యుగాంతమే గతి అవుతుంది!



■ రాహుల్ కుమార్

పర్యావరణ విధ్వంసానికి, విపరీత అసమానతలకు, సామాజిక ఉద్రిక్తతలకు కారణమయ్యే ప్రగతికి కళ్లెం వేయాలన్న ఆలోచనలు బలపడుతున్న తరుణంలోనే ఆర్థికరంగంపై నియంత్రణలను ఎత్తివేయాలనే భావనలు పుంజుకోవటం మొదలైంది. అమెరికాలో రొనాల్డ్ రీగన్, బ్రిటన్‌లో మార్గరెట్ థాచర్‌లు సరళీకృత ఆర్థిక విధానాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించటం ప్రారంభించారు. అనేక విధాలుగా ఒత్తిళ్లు తెచ్చి ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణలు తొలిగేటట్లు చేశారు. 1990ల నుంచి ధనిక దేశాల పెట్టుబడులు పేదదేశాలకు పరుగులెత్తాయి. కాలుష్యకారక పరిశ్రమలను తరలించటమూ మొదలైంది. పారిశ్రామిక ఉత్పత్తి ఆనవాళ్లు ధనిక దేశాల్లో మాయమయ్యాయి. ఇదంతా అందరికీ ఎంతోకొంత తెలిసిన చరిత్ర.

ద లిమిట్ టు గ్రోత్ వెలువడిన 50 ఏళ్లకు 'అందరి కోసం ధరిత్రి' (అర్థ్ ఫర్ ఆల్) అనే మరో నివేదిక రూపొందింది. దీన్ని కూడా ద క్లబ్ ఆఫ్ రోమ్ కోసమే రూపొందించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ 50 ఏళ్లల్లో తీవ్ర విపత్కర పరిస్థితిలోకి మానవాళి ప్రవేశించిందని చెప్పటానికి ఎన్నోరంగాల సమాచారాన్ని క్రోడీకరించారు. 1950ల నుంచి జరిగిన విపరిణామాలను అంతకుముందు నాటి పరిస్థితితో పోల్చి విశ్లేషించారు. విధ్వంస చిత్రంతో పాటు పరిస్థితిని సరిదిద్దగలిగిన చర్యలనూ సూచించారు. 20–30 ఏళ్లల్లో తీసుకోవల్సిన నిర్ణయాలను మనముందు ఉంచారు. స్థూలంగా అయిదు పెను సమస్యలను పరిష్కరించాల్సి ఉందని వివరించారు. 1) వందల కోట్ల మందిని దారిద్ర్యం నుంచి గట్టెక్కించటం 2) విపరీత ఆర్థిక అసమానతలు సృష్టిస్తున్న సామాజిక సంక్షోభాన్ని నిలువరించటం 3) ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావటం 4) మన ఆరోగ్యాన్ని అన్ని విధాలుగా దెబ్బతీస్తున్న పారిశ్రామిక ఆహారోత్పత్తులకు ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొనటం 5) మహిళలకు అన్నిరంగాల్లో సాధికారత కల్పించటం. ఈ పెను సమస్యలను ఒక తరంలోనే (2050 నాటికి) పరిష్కరించగల అవకాశాలు ఉన్నాయనీ వాటిని విస్మరించి యథాతథ అభివృద్ధిని కొనసాగిస్తే 2100 నాటికి ప్రపంచం కోలుకోలేని సంక్షోభంలోకి పడిపోతుందని ప్రతిపాదించారు. అప్పుడెన్ని నివారణ చర్యలు చేపట్టినా ఫలితం ఉండదు.

మనం ఇప్పుడు నడుస్తున్న రాజకీయ, ఆర్థిక దారులు ప్రమాదకరమైనవి. పనిగట్టుకుని అసమానతలను పెంచేవిగానే ఆర్థిక విధానాలు ఉన్నాయి. సదుద్దేశంతో చేపట్టిన విధానాల అవాంఛిత ఫలితాలు కావవి! వీటితో మున్ముందు అల్పాదాయ దేశాల్లో ఆర్థికాభివృద్ధి ఇంకా మందగించే అవకాశం ఉంది. దారిద్ర్యమూ బాగా పెరిగే ప్రమాదం కనపడుతోంది. అసమానతల వల్ల 2050 నాటికి సామాజిక ఉద్రిక్తతలు అన్ని దేశాల్లోనూ పెరుగుతాయి. ఉద్రిక్తతలతో కొట్టుమిట్టాడే దేశాలు పర్యావరణ ప్రమాదాన్ని అరికట్టే చర్యలను తీసుకోలేవు. రెండు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలను తగ్గించలేవు. వేడిగాలులకు ప్రపంచ ప్రజలు తల్లడిల్లిపోతారు. పంటల వైఫల్యాలు, మహా కరువులు, ఒక్కసారిగా భారీగా విరుచుకుపడే వర్షాలు, పెరిగే సముద్రమట్టాలు సమాజాలను అల్లకల్లోలం చేస్తాయి. ప్రమాదంలో పడిన పర్యావరణం దారిలో పడటానికి వేల ఏళ్లు పట్టొచ్చు.

ఎప్పుడో 11,700 ఏళ్ల క్రితం చివరి మంచుయుగం ముగిసిన తర్వాత వాతావరణంలో వచ్చిన మార్పులే ఇప్పటివరకూ మానవ నాగరికతకు వెన్నుదన్నుగా ఉన్నాయి. వ్యవసాయమూ అప్పుడే మొదలైంది. అవసరానికి మించి మిగులు ఉత్పత్తిని సాధించటమూ అప్పుడే సాధ్యమైంది. వృత్తి, వర్గ విభజనలూ అప్పుడే మొదలయ్యాయి. ఇప్పుడా వాతావరణం తల్లకిందులవుతోంది. 1950ల నుంచి దాన్ని దెబ్బతీయటం ప్రమాదకర స్థాయిలో మొదలైంది. అందుకే మానవాళి ముందున్న అయిదు సమస్యలను పరిష్కరించటం అత్యవసరం. ఇవేమీ అసాధ్యమైన ఆదర్శాలు కావు. కాలుష్యరహితమైన శుద్ధ ఇంధనం తయారీకి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. సూర్యశక్తి ఆధార ఇంధన ఉత్పత్తే దీనికి నిదర్శనం. ఎలక్ట్రిక్ వాహనాలు, విండ్ టర[illegible], పర్యావరణమిత్ర బ్యాటరీలను వాడటం మొదలైంది. అందరికీ ఇంధన, ఆహార భద్రతలకు కల్పించటానికి నిధులు ఎక్కడివన్న ప్రశ్న వస్తుంది. నిజానికది సమస్య కాదు. ప్రపంచ ఆదాయంలో 2 నుంచి 4 శాతం ఈ రెండిటికీ ఏటా ఖర్చుపెట్టగలిగితే సమస్య పరిష్కారం అవుతుంది. కానీ మార్కెట్ శక్తులకే దీన్ని వదిలేస్తే లక్ష్యం నెరవేరదు. సుదీర్ఘ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలే అందుకు పూనుకోవాలి. ఆదాయాన్ని పునఃపంపిణీ చేయకుండా ధరిత్రీ భద్రతను కాపాడుకోలేం. అసమానతల వల్ల నెలకొనే ఆర్థికపరమైన ఆందోళనలు మనుషుల మధ్య అపనమ్మకాలను పెంచుతాయి. వివిధ వర్గాల మధ్య తీవ్రమైన విభజనలు తలెత్తుతాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయ వ్యవస్థను నడిపించలేని పరిస్థితి వస్తుంది. ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. అందుకే జాతీయ ఆదాయంలో ధనికుల వాటా 40 శాతానికి లోపునే ఉంచే విధంగా తొలి చర్యలు తీసుకోవాలి. అందుకు అనువైన పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టాలి.

ఈ భూగ్రహం మీద మనం భద్రంగా బతకాలంటే తొమ్మిది పరిధుల్లోనే మన కార్యక్రమాలు సాగాలని 2015లో శాస్త్రవేత్తలు స్పష్టంచేశారు. వాతావరణం, జీవవైవిధ్యం, అడవులు, ఎరువులకు సంబంధించి పరిమితులను ఇప్పటికే దాటేశాం. విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగంతో అయిదో హద్దునీ అధిగమించేశాం. మొక్కల వేళ్ల చుట్టూ మట్టిని అంటుకుని ఉండే నీటిని హరించివేయటంలో ఆరో పరిమితినీ దాటేశాం. ఇక మిగిలిన మూడు పరిమితులను కూడా దాటేస్తే (సముద్రాల ఆమ్లీకరణ, వాతావరణంలోకి వదిలిపెట్టే ఘన–ద్రవ కణాలు, ఓజోన్‌పొర క్షీణత) మానవాళి మనుగడ ప్రమాదంలో పడినట్లే. పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టినప్పుడు చాలా ఒడిదుడుకులు వస్తాయి. పాత ఉద్యోగాలు పోతాయి. ప్రజలను ఆదుకోటానికి పౌరనిధిని ఏర్పాటుచేయాలి. కనీస ఆదాయాన్ని అందరికీ అందించగలగాలి. నీటి అవసరం ఎక్కువగా ఉన్న పంటలకు పరిమితులు విధించాల్సి వస్తుంది. భారీ ప్రాజెక్టులను వదులుకోవాల్సి వస్తుంది. మన ఆహారానికి అవసరమయ్యే జంతుజాలంతో భూగ్రహాన్ని నింపటాన్ని మానుకోవాల్సి వస్తుంది. భూగోళానికి నష్టంచేయని నవపరిమితుల్లోకి మానవులు వస్తే 2050 నాటికి నవయుగం మొదలవుతుంది. అది జరగకపోతే యుగాంతమే గతి అవుతుంది! మన మరణశయ్యను మనమే పరుచుకున్న వాళ్లం అవుతాం!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

తీర్పు 2024 5

మోదీ హ్యాట్రిక్ ఎలా సాధించారు?

నరేంద్ర మోదీ మళ్లీ ఎందుకు అధికారానికి వచ్చారు? ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీని ఎన్డీఏ ఎందుకు సాధించుకున్నది? బీజేపీ మరింత పరాజయాన్ని ఎందుకు పొందలేదు? ఎన్నికలకు సంబంధించి మీడియా తప్పుడు కథనాలు ఎంత ప్రభావశీలమైనవి అంటే మనం పై ప్రశ్నలను అడిగే ఆలోచనే చేయలేకపోతున్నాం! బీజేపీకి సంభవించిన అనూహ్య ఎదురుదెబ్బకు కారణాలు ఏమిటి? ఈ ప్రశ్నపైనే మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. ఫలితాలను అర్థం చేసుకోవడంలో పొరబడి వేసిన తప్పుడు ప్రశ్న అది. అహంకార పూరితంగా వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించడంపై శ్రద్ధ చూపని ప్రభుత్వం కనీస మెజారిటీని సాధించుకోలేకపోవడం దిగ్భ్రాంతికరమేమీ కాదు. దిగ్భ్రాంతి ఏమైనా ఉంటే అది మీడియా సృష్టించిందని చెప్పక తప్పదు. ఇప్పుడు మనం అడగవలసిన ప్రశ్న: ఘోరంగా ఓడిపోనున్న ఎన్నికల పోరులో భారతీయ జనతా పార్టీ ఎలా విజయం సాధించింది?

2004 లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో 2024 సార్వత్రిక పోరు ఫలితాలను పోల్చి చూడడం ఉపయోగకరంగా ఉంటుంది. అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఐదేళ్ల పదవీకాలాన్ని 'విజయవంతంగా' పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఎన్నికలవి. 'వెలిగిపోతున్న భారత్' అనే నినాదంతో భారతీయ జనతా పార్టీ ఆ ఎన్నికలకు వెళ్లింది. 2004లో తిరిగి అధికారంలోకి వస్తామనే ధీమా నాడు బీజేపీ శ్రేణుల్లో నిండుగా వ్యక్తమయింది. ఎన్నికలకు ముందు నిర్వహించిన ఓపీనియన్ పోల్స్ పోలింగ్ తరువాత నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ రెండూ పాలక కూటమి విజయాన్ని ఘంటాపథంగా నిర్ధారించాయి. అయితే ఫలితాలు అనూహ్యంగా ఆ అంచనాలకు విరుద్ధంగా వచ్చాయి. అందరూ తికమకపడ్డారు– ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ఫలితాల విషయంలో వలే.

2024లో నరేంద్రమోదీకి ఉన్న ప్రజాదరణ 2004లో వాజపేయికి ఉన్న జనసమ్మతి కంటే భిన్నమైనది కాదు, తక్కువా కాదు. ప్రధానమంత్రిగా ఎవరిని ఎంపిక చేసుకుంటారన్న ప్రశ్నకు నాడు 38 శాతం మంది వాజపేయి పేరు ప్రస్తావించగా 2024లో 41 శాతం మంది నరేంద్ర మోదీ వైపు మొగ్గారు. 2004లో వాజపేయి సమీప ప్రత్యర్థి సోనియా గాంధీని 26 శాతం మంది ఓటర్లు ఇష్టపడగా ఈ ఏడాది 27 శాతం మంది మోదీ స్థానంలో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడడానికి ఇష్టపడ్డారు. వాజపేయి ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల సంతృప్తి మోదీ సర్కార్ విషయంలో కంటే అధికంగా ఉన్నది. నికర సంతృప్తిపరులు (అసంతృప్తి పడిన వారిని తీసివేయగా సంతృప్తిపడినవారు) 2004లో 29 శాతం మంది కాగా 2024లో 23 శాతం మంది ఉన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వానికి మరొక అవకాశాన్ని ఇస్తారా అన్న కీలక ప్రశ్నకు వాజపేయి విషయంలో గరిష్ఠంగా 48 శాతం మంది మోదీ విషయంలో గరిష్ఠంగా 46 శాతం మంది సానుకూలంగా ప్రతిస్పందించారు. అయినా వాజపేయి ప్రభుత్వం ఓడిపోయింది. నాడు ఎన్డీఏకు 230 నుంచి 275 సీట్లు రాగలవని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా ఎన్డీఏకు వాస్తవంగా 181 మాత్రమే వచ్చాయి. ఫలితంగా యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2024లో ప్రత్యర్థి కూటమి ప్రభుత్వం ఎందుకు అధికారంలోకి రాలేకపోయింది? 2024లో ఎన్డీఏ ప్రారంభ బలం 2004లో కంటే ఎక్కువ. అంతేగాకుండా నాడు సంకీర్ణ రాజకీయాలు ప్రాథమిక దశలో ఉన్నాయి. 23 పార్టీల ఎన్డీఏ సంకీర్ణాన్ని వాజపేయి తన రాజకీయ చాతుర్యంతో నిలుపుకుంటూ వచ్చారు. 1999లో బీజేపీకి 182 సీట్లు లభించాయి. 2004లో బీజేపీ 44 సీట్లను నష్టపోయింది. 2024లో పరిణామానికి అది భిన్నమైనది కాదు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ బలం 303 నుంచి 240కి తగ్గిపోయింది.



■ యోగేంద్ర యాదవ్

మరో ప్రశ్నను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరమున్నది. 2024లో బీజేపీని అధికారం నుంచి తొలగించడం సాధ్యమయ్యేదేనా? మేము తొలుత ఆక్షేపించిన తప్పుడు ప్రశ్నను పక్కన పెట్టి ఇటీవలి ఎన్నికల ఫలితాలను కొత్త దృష్టితో చూడండి. విశదమయ్యేది ఏమిటి? నరేంద్ర మోదీ తన ప్రభుత్వాన్ని చావు తప్పి కన్ను లొట్టపోయిన రీతిలో కాపాడుకున్నారనే కాదూ? ఎన్నికల తుది ఫలితాలను ప్రారంభ స్థానంగా తీసుకోండి. అదనంగా 1 శాతం ఓట్లు ఎన్డీఏకు వ్యతిరేకంగా పడినట్టయితే (ఎన్డీఏకి సంభవించిన నష్టాలకు సమ నిష్పత్తిలో దాని ప్రధాన ప్రత్యర్థి లబ్ధి పొంది ఉండేది) ఆ కూటమి 18 సీట్లను కోల్పోయి వుండేది. దేశవ్యాప్తంగా ఓటర్ల మొగ్గు 1.5 శాతం మేరకు ఎన్డీఏకు వ్యతిరేకంగా ఉన్నట్టయితే ఎన్డీఏ సంఖ్యా బలం 261గా మాత్రమే ఉండేది. అంటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన కనీస మెజారిటీ కంటే కూడా తక్కువగా ఉండేది. అంతే కాదు తన ప్రధాన ప్రత్యర్థి సంఖ్యా బలం కంటే కూడా ఎన్డీఏ తక్కువస్థాయిలో ఉండేది. ఎన్డీఏకు 261 లభిస్తే ఇండియా కూటమికి 263 వచ్చేవి. మరో అర శాతం ఓటర్ల మొగ్గు ఎన్డీఏకు వ్యతిరేకంగా ఉన్నట్టయితే పాలక కూటమి సంఖ్యా బలం 246కు పడిపోయి ఇండియా కూటమి సంఖ్యా బలం 275కు పెరిగి ఉండేది.



...మనకు తెలియని, బీజేపీ నాయకులకు మాత్రమే తెలిసినదేమిటి? వివిధ పార్టీలతో బీజేపీ కుదుర్చుకున్న పొత్తులే ఈ ప్రశ్నకు సమాధానం. బిహార్‌లో నితీశ్ కుమార్, యూపీలో జయంత్ చౌదరి, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడుతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఈ మిత్రపక్షాలు ఎన్డీఏ సంఖ్యా బలాన్ని పెంచడమే కాకుండా బీజేపీ సొంతంగా కొన్ని సీట్లను అదనంగా గెలుచుకోవడానికి తోడ్పడ్డాయి.

హిందీ రాష్ట్రాలలో ఓటర్ల మొగ్గు 2శాతం మేరకు ఎన్డీఏకు వ్యతిరేకంగా ఉన్నట్టయితే ఆ కూటమి సంఖ్యా బలం 260కి తగ్గిపోయేది. ఇదే జరిగినట్టయితే బీజేపీకి లభించిన సీట్లు 214కి తగ్గిపోయేవి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశమివ్వాలని కోరేందుకు సైతం భారతీయ జనతా పార్టీకి అర్హత ఉండేది కాదు. ఎన్డీఏకు వ్యతిరేకంగా ఓటు వేసిన ఓటర్లు 1 శాతం మేరకు ఉన్నా బీజేపీ ప్రతిపక్షంలో కూర్చోవలసివచ్చేది అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.

సరే, ఇప్పుడు మనమే కాకుండా భావి చరిత్రకారులు సైతం పరిగణనలో తీసుకోవల్సిన ప్రశ్న: జాతీయ స్థాయిలో ఎన్డీఏకు 1 శాతం ఓటు తగ్గుదల దేశ రాజకీయ పరిస్థితుల్లో ఎటువంటి తేడాకు దారితీసి ఉండేది? ఇటువంటి విపత్కర పరిస్థితి తమకు ఏర్పడకుండా బీజేపీ నాయకులను అప్రమత్తం చేసినదేమిటి? మనకు తెలియని, బీజేపీ నాయకులకు మాత్రమే తెలిసినదేమిటి? వివిధ పార్టీలతో బీజేపీ కుదుర్చుకున్న పొత్తులే ఈ ప్రశ్నకు సమాధానం. బిహార్‌లో నితీశ్ కుమార్ (జేడీయూ) యూపీలో జయంత్ చౌదరి (ఆర్‌ఎల్‌డీ)తో పొత్తు పెట్టుకుంది. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు (తెలుగుదేశం)తో పొత్తు పెట్టుకుంది. అలాగే మహారాష్ట్రలో అధికార శివసేనతో పొత్తు పెట్టుకున్నది. మహారాష్ట్రలో మినహా ఈ పొత్తులతో బీజేపీ లబ్ధి పొందింది. ఈ మిత్రపక్షాలు ఎన్డీఏ సంఖ్యా బలాన్ని పెంచడమే కాకుండా ఆంధ్రప్రదేశ్, బిహార్, యూపీలలో బీజేపీ సొంతంగా మరో పది సీట్లను అదనంగా గెలుచుకోవడానికి విశేషంగా తోడ్పడ్డాయి.

పై ప్రశ్నకు మరో సమాధానాన్ని కూడా పరిశీలనలోకి తీసుకుందాం. ప్రధాన స్రవంతి మీడియా ఈ ఎన్నికల సంఘటనలు, పరిణామాలపై వార్తలను నివేదించడంలో పక్షపాతాన్ని కొంచెం తగ్గించుకుందని అనుకోండి. లోక్‌నీతి– సీఎస్‌డీఎస్ నిర్వహించిన ఒక పోస్ట్ పోల్ సర్వేలో 83 శాతం మంది ఓటర్లకు ఇంటి వద్ద టీవీ ఉందని, 66 శాతం మంది ఓటర్లు ప్రతి రోజూ లేదా అప్పుడప్పుడూ న్యూస్ ఛానెల్స్‌ను చూస్తుంటారని వెల్లడయింది (47 శాతం మంది ఓటర్లు సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల సమాచారాన్ని పొందుతుంటారని కూడా వెల్లడయింది. చాలా తక్కువ మంది మాత్రమే ఎన్నికల సమాచారానికి ఏదో ఒక ప్రభుత్వ విధేయ మీడియా ఛానెల్‌పై ఆధారపడుతున్నట్టు కూడా ఆ సర్వేలో వెల్లడయింది. మోదీ ప్రభుత్వ పనితీరుపై టీవీ ఛానెల్స్ నిష్పాక్షికంగా వార్తలు, వార్తానివేదికలు ప్రసారం చేశాయని అనుకోండి. నిస్సిగ్గుగా అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించలేదని అనుకోండి. అలాగే పాలకపక్షం సర్వోన్నత నాయకుడుతో అతివినయంతో నిర్వహించిన ఇంటర్వ్యూలను ప్రసారం చేయకుండా 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయం అనివార్యం కాదని, ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్య తీవ్ర పోటీ ఉందని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాయనుకోండి. దాని ప్రభావం ఎలా ఉండేది? ప్రభుత్వ అనుకూల ప్రసారాలను వీక్షించే ప్రతి 66 మందిలో ఒక్కరు ఎవరికి ఓటు వేయాలనే విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకున్నట్టయితే పాలకపక్ష సర్వోన్నత నాయకుడు ఇప్పుడు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడుగా ఉండేవారు.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఆరు వ్యాసాల పరంపరలో ఇది ఐదవది)




భక్తిశ్రద్ధలతో బక్రీద్


చార్మినార్ వద్ద బాలుడు
మాసబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

● ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

హైదరాబాద్ సిటీ/మదీనా, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగరవ్యాప్తంగా బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మీరాలం ఈద్గా, చార్మినార్, టోలిచౌకి, సెవెన్ టూంబ్స్ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. మీరాలం ఈద్గాలో మక్కామసీదు ఇమామ్ మౌలానా రిజ్వాన్ ఖురేషీ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారులు స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు.

టోలిచౌకి సెవెన్ టూంబ్స్ వద్ద..



శుభాకాంక్షలు చెప్పుకుంటున్న బాలులు



కిలోమీటరు ఊడ్చితే రూ.3.21 లక్షలట!

- పర్యాటక ప్రాంతాల్లో నెలవారీగా స్వీపింగ్ చార్జీలు చాలా ప్రియం
- సాధారణ రహదారులపై నెలకు రూ.40 వేలు
- ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం వల్లే చార్జీల్లో భారీ వ్యత్యాసం
- గత సర్కారు హయాంలో నిర్ణయం
- ముగిసిన గడువు.. పలు ప్రాంతాల్లో మళ్లీ పొడిగింపు

పర్యాటక ప్రాంతాల్లో స్వీపింగ్ చాలా ఖరీదైన వ్యవహారంగా మారింది. కిలోమీటరు రోడ్డును శుభ్రం చేసేందుకు నెలకు ఏకంగా రూ.3.21 లక్షలు వెచ్చిస్తున్నారు. అదే సాధారణ రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు కిలోమీటరుకు ప్రతినెలా రూ.40 వేలే ఖర్చు అవుతున్నది.

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సాధారణ రోడ్లతో పోల్చుకుంటే పర్యాటకుల సందర్శించే ప్రాంతాల్లోని రోడ్ల పారిశుధ్యానికి నెలకు ఎనిమిది రెట్లు అధికంగా వ్యయం అవుతోంది. రెండు విడతలుగా 16 గంటలు కార్మికులు విధులు నిర్వర్తించినా, ఎక్కువ మంది సేవలు వినియోగించుకున్నా.. రెండు, మూడు రెట్లు.. అంటే రూ.1.20 లక్షల వరకు వెచ్చించాలి. కానీ ఏకంగా రూ.2లక్షలు అదనంగా ఎందుకు ఖర్చవుతోంది..? అంటే పారిశుధ్య నిర్వహణ విభాగం అధికారులు సమాధానం దాట వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్నత స్థాయి ఒత్తిళ్లతో ప్రైవేట్ ఏజెన్సీలకు పర్యాటక

మిగతా 8వ పేజీలో..

ఈదురుగాలులతో భారీ వర్షం


ఎర్రగడ్డ రోడ్డుపై నిలిచిన వరద నీరు

- అత్యధికంగా లంగర్‌హస్‌లో 5.8 సెం.మీ.
- గాలులకు నేలకూలిన భారీ వృక్షాలు
- రంగంలోకి జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ బృందాలు
- మరో రెండు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈదురుగాలులతో కురిసిన భారీవర్షానికి లోతట్టు ప్రాంతాలు వణికిపోయాయి. భారీవృక్షాలు నేలకూలడంతో వాహనాలు ధ్వంసమయ్యాయి. టోలిచౌకి గోల్కొండ ఎండీ లైన్స్‌లో 200 ఏళ్లనాటి భారీ వృక్షం నేలకూలింది. ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈదురుగాలులకు మధురానగర్ డి-70 బ్లాక్‌లో భారీ వృక్షం నేలకూలడంతో ఓ కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నది. భారీవర్షానికి ముషీరాబాద్, బాలానగర్, సనత్‌నగర్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, లంగర్‌హౌస్, ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, షేక్‌పేట, ఫిల్మ్‌నగర్, పటాన్‌చెరువు ప్రాంతాల్లో రోడ్లపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచింది. శ్రీకృష్ణానగర్ బీ బ్లాక్ ప్రాంతాల్లో వాహనాలు సగానికిపైగా వరదనీటిలో మునిగిపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగి నీటిని తొలగించే పనులు చేపట్టాయి.

లంగర్‌హౌస్‌లో అత్యధికంగా 5.8 సెం.మీ

గ్రేటర్‌లో సోమవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం గంటపాటు ఉరుములు, మెరుపులతో కురిసిన కుండపోత వర్షం.. లోతట్టు ప్రాంతాలను జలమయం చేసింది. మెహిదీపట్నం లంగర్‌హౌస్‌లో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గ్రేటర్‌లో మరో రెండురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం, రాత్రి సమయంలో ఈదురుగాలులు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశాలుంటాయని పేర్కొన్నారు.

గ్రేటర్‌లో పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం (రాత్రి 7 గంటల వరకు)

ప్రాంతం	(సెం.మీ)
లంగర్‌హౌస్	5.8
మెహిదీపట్నం	5.7
యూసుఫ్‌గూడ	5.2
ఆసిఫ్‌నగర్	5.2
ఎంసీహెచ్‌ఆర్‌డీ	4.6
బంజారాహిల్స్	4.6
ఫిల్మ్‌నగర్	4.2


గోల్కొండ ఎండీ లైన్స్‌లో కూలిన పురాతన భారీ వృక్షం



వర్షానికి ముందు కూకట్‌పల్లిలో గాలిదుమారం


ఎర్రగడ్డలో నిలిచిన మోకాలిలోతు నీటిలో నుంచి నడుస్తూ..


వనస్థలిపురంలోని గురుద్వార్ ప్రధాన రోడ్డుపై పడ్డ గుంతలు


బాచుపల్లిలో ధ్వంసమైన ప్రధాన రహదారి

రోడ్ల మరమ్మతులకు ఖర్చు	
ఆర్థిక సంవత్సరం	రూ.కోట్లలో
2022-23	692.95
2023-24	719.08


నిజాంపేట్ భవ్యాస్ ఆనంద్ ఎదురుగా గల రోడ్డు దుస్థితి

వరద నీరు.. గుంతలతో బేజారు!

గ్రేటర్‌లో అధ్వానంగా రహదారులు

- మాన్‌సూన్ ఆరంభంలోనే గుంతలమయం
- మున్ముందు పరిస్థితేంటో..?
- మరమ్మతులు పట్టని జీహెచ్‌ఎంసీ
- క్షేత్రస్థాయిలో కనిపించని ఐఆర్‌టీలు
- రోజుల తరబడి గుంతలు పూడ్చని వైనం
- ఏటా సగటున రూ.600 కోట్లకుపైగా వ్యయం

మాన్‌సూన్ మొదలైంది. వర్షాలూ కురుస్తున్నాయి. అప్పుడే రహదారులు అధ్వానంగా మారాయి. ఓ వైపు వరద నీరు.. మరోవైపు గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై, అంతర్గత రహదారులపై భారీ గుంతలు ఏర్పడ్డాయి.

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అధ్వాన రోడ్లతో నగరవాసులు అవస్థలు పడుతున్నారు. మొన్నటి వరకు కాంట్రాక్టర్ల సమ్మె నేపథ్యంలో నిర్వహణ, మరమ్మతు పనులపై జీహెచ్‌ఎంసీ అంతగా దృష్టి సారించలేదు. అత్యవసర బృందాలు ఏర్పాటు చేసినా.. వరద నీటి నిర్వహణకే పరిమితమవుతున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో వరదనీటికి బీటీ రోడ్లపై ఏర్పడే గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలి. ప్యాచ్ వర్క్‌లూ వెంటనే చేపట్టాలి. కానీ ప్రస్తుతం గ్రేటర్‌లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. వేసవిలో కురిసిన అకాల వర్షాలు.. ఈ నెలలో మోస్తరుగా కురిసిన వానలకు పలు ప్రాంతాల్లో

మిగతా 8వ పేజీలో..

గ్రేటర్ పరిధిలో రోడ్ల లెక్క ఇదీ..

రోడ్లు	కి.మీలు
మొత్తం రోడ్లు	9013
సీసీ రోడ్లు	6167
బీటీ రోడ్లు	2846
సింగిల్ లేన్ రోడ్లు	6655
రెండు లేన్ల రోడ్లు	1709
మూడు లేన్ల రోడ్లు	123
నాలుగు, అంతకంటే ఎక్కువ లేన్ల రోడ్లు	526

పవర్ కట్ ● పలు ప్రాంతాల్లో ఐదు గంటలు అంతరాయాలు
ప్రమాదాలు జరగొద్దు..! అధికారులతో పొన్నం టెలి కాన్ఫరెన్స్ 8

టీ న్యాబ్ దూకుడు



- డ్రగ్స్ కట్టడికి చర్యలు
- పబ్‌లపై పోలీసుల ప్రత్యేక నజర్
- మాదక ద్రవ్యాల రహిత నగరంగా మార్చడమే లక్ష్యంగా ముందుకు..

కళాశాలలు, యూనివర్సిటీలు మొదలుకొని పాఠశాలల వరకు.. టీ స్టాల్ నుంచి స్టార్ హోటళ్ల వరకు.. పబ్బులు, క్లబ్బుల నుంచి బార్ అండ్ రెస్టారెంట్ల వరకు.. చివరకు టిఫిన్ సెంటర్లు సైతం మాదకద్రవ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. ప్రత్యేకంగా తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (టీ న్యాబ్)ను ఏర్పాటు చేసి, పకడ్బందీ చర్యలు చేపడుతున్నా డ్రగ్స్‌కు అడ్డుకట్ట పడడం లేదు. దీంతో టీన్యాబ్ దూకుడు పెంచింది. విస్తృతంగా తనిఖీలు చేపడుతోంది.

హైదరాబాద్ సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలో డ్రగ్స్ కట్టడికి పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. రాష్ట్రాన్ని, మహానగరాన్ని మాదక ద్రవ్యాల రహిత నగరంగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్‌టీమ్‌లను రంగంలోకి దింపి గంజాయి, డ్రగ్స్ సరఫరా, దిగుమతిపై ఉక్కుపాదం మోపుతున్నారు. మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలను, వారితో చేతులు కలిపి డ్రగ్స్‌ను నగరానికి దిగుమతి చేసుకుంటున్న లోకల్ స్మగ్లర్లను పట్టుకొని కటకటాల్లోకి నెడుతున్నారు. వారికి గోవా, బెంగళూరు, ముంబైలోని ఘరానా స్మగ్లర్స్‌తో లింక్ ఉన్నట్లు గుర్తించి ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారంతో స్మగ్లర్లను అరెస్టు చేసి కటకటాల్లోకి నెడుతున్నారు. పోలీసులు ఇంత చేస్తున్నా.. నగరంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల సరఫరాకు మాత్రం అడ్డుకట్ట పడటంలేదు. తాజాగా మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 16 మంది డ్రగ్స్ వినియోగిస్తున్నారనే అనుమానం ఉన్నవారిని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని పరీక్షించగా.. ఇద్దరు డ్రగ్స్ తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది. దాంతో డ్రగ్స్ స్మగ్లర్లతో వారికున్న లింకులపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

దూకుడు పెంచిన నార్కోటిక్ పోలీసులు..

ఎన్ని కేసులు నమోదు చేస్తున్నా.. స్మగ్లర్లు కొత్తకొత్త దారులను వెతుక్కుంటున్నారు. పోలీసుల కంటపడకుండా నగరంలో డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారులు దూకుడు పెంచారు. డ్రగ్స్ వినియోగదారులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తరచూ పబ్‌లకు,

మిగతా 6వ పేజీలో..

సిటీ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్ హెగ్డే



హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్‌హెగ్డే నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన బదిలీల్లో సిటీ ట్రాఫిక్ డీసీపీగా ఉన్న రాహుల్ హెగ్డే సూర్యాపేట ఎస్పీగా వెళ్లారు. ఇప్పుడు జరిగిన బదిలీల్లో యథాస్థానానికి వచ్చారు. అలాగే, ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న సాదన రష్మి పెరుమాళ్‌ను నార్త్‌జోన్ డీసీపీగా, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావును బదిలీ చేసి ఆయన స్థానంలో సురేష్‌కుమార్‌ను, శంషాబాద్ డీసీపీగా ఉన్న నారాయణరెడ్డిని బదిలీ చేసి ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న రాజేష్‌ను, మేడ్చల్ డీసీపీగా ఉన్న నికితాపంత్‌ను బదిలీ చేసి ఆమె స్థానంలో కోటిరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టీ న్యాబ్ దూకుడు

(5వ పేజీ తరువాయి)

పార్టీలకు వెళ్లే వారిపై నిఘాపెట్టారు. కొంతకాలం రహస్యంగా వారిని ఫాలో అయిన తర్వాత అదును చూసి అదుపులోకి తీసుకుంటున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో వినియోగదారులను అదుపులోకి తీసుకుని వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాజిటివ్ వచ్చిన వారిని విచారించి వారికి డ్రగ్స్ సప్లై చేసే ముఠాల మూలాలను గుర్తిస్తున్నారు. ఎక్కడున్నా వారిని వెదికి పట్టుకుని కటకటాల్లోకి నెట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. నగరంలో పోలీసుల నిఘాపెరగడంతో కొంతమంది కేటుగాళ్లు.. గోవా, బెంగళూరు, ముంబై వంటి ప్రాంతాల్లో ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల బెంగళూరు శివారు ప్రాంతమైన ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలో జరిగిన రేవ్‌పార్టీపై బెంగళూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ పార్టీలో భారీగా డ్రగ్స్ వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. పార్టీకి హాజరైన వారిలో బడాబాబులు, వ్యాపారులు, టాలీవుడ్, కోలీవుడ్‌కు చెందిన సెలబ్రెటీలతో పాటు.. ముంబైకి చెందిన మోడల్స్ ఏపీ, హైదరాబాద్‌కు చెందిన పలువురు ప్రముఖులు ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ఈ నేపథ్యంలో డ్రగ్స్ నివారణకు మరింత పక్కా చర్యలు చేపట్టాలని పోలీసులు నిర్ణయించారు. ఇకపై కళాశాలలు, పాఠశాలలు, యూనివర్సిటీల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ కమిటీలు డ్రగ్స్ అనుమానిత విద్యార్థుల బ్యాగులు, దుస్తుల్లోనూ డ్రగ్స్ తనిఖీలు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏ మూలనైనా మాదకద్రవ్యాల ఆనవాళ్లు కనిపించినా, సరఫరా జరిగినా బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.


వాళ్ల పరిధి కాదట!

- మంగళసూత్రం పోయిందని ఫిర్యాదు చేసేందుకు నాలుగు పోలీసు స్టేషన్లకు తిరిగిన మహిళ
- చివరికి మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదు

యూసుఫ్‌గూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 'నా మంగళసూత్రం పోయింది సారూ..' అంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళను 'మా పరిధి కాదు. వేరే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లు' అంటూ పోలీసులు తిప్పి పంపించారు. దీంతో ఆ మహిళ అలా నాలుగు పోలీస్‌స్టేషన్‌లను తిరగాల్సి వచ్చింది. చివరకు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. బర్కత్‌పురా ప్రాంతానికి చెందిన రేఖ మలాని ఈ నెల 15న మధురానగర్‌లోని తన బంధువుల ఇంటికి వచ్చింది. మరుసటి రోజు 16వ తేదీన తన సోదరుడు నవనీత్‌తో కలిసి ఎర్రగడ్డ రైతుబజార్‌కు కూరగాయల కోసం వెళ్లివస్తుండగా తన మెడలో మంగళసూత్రం లేదని గ్రహించింది. వెంటనే తన సోదరుడితో కలిసి రైతుబజార్‌కు వెళ్లి వెతికినా, విచారించినా ఫలితం లేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సోమవారం మొదట సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వారు తమ పరిధి కాదు సంజీవరెడ్డినగర్‌కు వెళ్లమని సూచించారు. వెంటనే ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ వారు దొంగతనం జరిగిన ప్రదేశం తమ పరిధిలోకి రాదు బోరబండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లమని చెప్పారు. బోరబండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారు కూడా తమ పరిధి కాదు మధురానగర్ వెళ్లాలని చెప్పారు. చివరకు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా వారు బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక నమాజ్


మీరాలం ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న శివకుమార్, శ్రవణ్‌కుమార్ తదితరులు


హసన్‌నగర్‌లోని మసీద్ ఎ అక్బారీలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజామ్మిల్ అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్నేహితులు

(చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ బృందం): త్యాగానికి, సత్యానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సోమవారం సమీపంలోని మసీద్‌లు, ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్ చేశారు. బహదూర్‌పురా మీరాలం ఈద్గాలో వందలాది మంది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మక్కామసీదు ఇమామ్ మౌలానా రిజ్వాన్ ఖురేషీ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. మౌలానా జాఫర్‌పాషా హుసామి బక్రీదు పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ స్థోమతను బట్టి ఖుర్బానీ ఇవ్వాలని అన్నారు. హజ్రత్ ఇబ్రాహీం కాలం నుంచి వస్తున్న సంప్రదాయాన్ని ముస్లిం సోదరులందరూ పాటించాలన్నారు. హజ్రత్ ఇబ్రహీం(అలై), హజ్రత్ ఇస్మాయిల్‌ల త్యాగాన్ని గుర్తుచేసుకుని నూతనోత్తేజం పొందాలన్నారు.ముస్లింలు అల్లా, మహ్మద్ ప్రవక్తల బోధనలను పాటించి వారు చూపిన మార్గంలో నడవాలని సూచించారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● పాతబస్తీలోని పలు మసీదులలో ఉదయం 7 గంటలకు ప్రత్యేక నమాజ్ చేయగా, మీరాలం ఈదగా, మాదన్నపేట్, మక్కా మసీదులలో 9 గంటలకు ప్రార్థనలు నిర్వహించారు. మక్కా మసీదులో దాదాపు 20 వేల మంది ముస్లింలు ప్రార్థనలు చేశారు. హుసేనీఆలం, బిల్వత్, దారూల్ శిఫా, ఆలిజాకోట్ల, డబీల్‌పురా, నూర్‌ఖాన్ బజార్, బండ్లగూడ, రెయిన్‌బజార్, ఈదీ బజార్, తలాబ్ కట్ట, మొగల్‌పురా, హఫీజ్ బాబానగర్, బండ్లగూడ,పహాడిషరిఫ్, జలపల్లి, వాది ఏ ముస్తఫా, షాహీన్ నగర్ మర్కాజ్, కొత్తపేట ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


పహాడీషరీఫ్ ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

● రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి, హసన్‌నగర్‌లోని మజీద్ ఏ అక్బారీ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వందలాది మంది ముస్లిం సోదరులు ఈ ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ ప్రార్థనలలో శాసనమండలి సభ్యుడు మీర్జారహ్మత్ బేగ్ తదితరులు పాల్గొని ప్రార్థనలు చేశారు. వివిధ బస్తీలు, కాలనీలలో జరిగిన ఈదుల్ ఉల్ అదా ప్రార్థనలలో ముస్లిం నాయకులు మహ్మద్ ముర్తుజా అలీ, సయ్యద్ ముజామ్మిల్ అహ్మద్, సయ్యద్ హిదాయతుల్లా షఫీ, షేక్ నయిమొద్దీన్, అతావుల్లా, ఫహీమ్, సనావుల్లా ప్రార్థనలు చేశారు. అనంతరంపండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

పోలీస్ బందోబస్తు

మసీదులు, ఈద్గాల వద్ద సోమవారం ఉదయం 6 గంటల నుంచే పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. మీరాలం ఈద్గాలో బాంబుస్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసిన అనంతరం ఈద్గా మైదానంలోకి అనుమతించారు. పోలీస్ ఉన్నతాధికారులు విక్రంసింగ్ మాన్, విశ్వజిత్, వి.సత్యనారాయణ, దక్షిణ మండలం డీసీపీ స్నేహమెహ్రా తదితరులు ఈద్గా వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.


హసన్‌నగర్‌లో నమాజ్ చేస్తున్న శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/hZ8QSQQలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

అంబేడ్కర్ విద్యా వికాస్ మెరిట్ అవార్డులు

● జూలైలో రవీంద్రభారతిలో ప్రదానం

అఫ్జల్‌గంజ్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ, సివిల్స్ (ఐఏఎస్, ఐపీఎస్) పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్-2024 అవార్డులను అందజేస్తామని అంబేడ్కర్ విద్యా వికాస్ కమిటీ చైర్మన్ మిత్రాకృష్ణ తెలిపారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్రాకృష్ణ మాట్లాడుతూ చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి మెరిట్ అవార్డులను అందజేయనున్నామని, అందుకోసం ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. జూలై నెలలో రవీంద్రభారతిలో అవార్డులను ప్రదానం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు పరమేశ్వరి సింగ్, జనరల్ సెక్రటరీలు పి.నర్సింగ్‌రావు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ఉచిత శిక్షణ

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భాషా సాంస్కృతికశాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సినిమాటోగ్రఫీ డిప్లొమ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. 6 నెలల పాటు అనుభవం కలిగిన అధ్యాపకులతో ఇస్తామని సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ చైర్మన్ ఏం.సి. శేఖర్ తెలిపారు. జూలై 15 నుంచి శిక్షణ తరగులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు 80080 21075, 70956 92175 ఫోన్ నెంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన డబిల్‌పురా రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరీ తెలిపిన వివరాల ప్రకారం.. డబిల్‌పురా ప్రాంతానికి చెందిన పవన్‌కుమార్(21) పొలం పనులు ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో డబిల్‌పుర-మేడ్చల్ రైల్వే స్టేషన్ మధ్య పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

ఫిట్స్‌తో రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్: ఫిట్స్ రావడంతో రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని ప్రయాణికుడు మృతిచెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 10 వద్ద 50 ఏళ్ల వ్యక్తికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వేస్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

వృద్ధురాలి అదృశ్యం


జమాల్ బీ

నేరేడ్‌మెట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు కనిపించకుండాపోయింది. లక్ష్మీనగర్‌లో నివసిస్తున్న జమాల్ బీ(92) ఈనెల 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఏడాది నుంచి మానసిక రుగ్మతతో బాధపడుతోంది. జమాల్ బీ ఆచూకీ లభించకపోవడంతో మనవడు మహ్మద్ ఇమ్రాన్ నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నార్సింగ్‌లో ఏడేళ్ల బాలుడు...


రవి

నార్సింగ్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలుడు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న వరలక్ష్మి టిఫిన్ సెంటర్ సమీపంలోని గుడెసెల్లో గోపాల్.. భార్య, కుమారుడు రవి(7)తో కలిసి ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు కుమారుడిని ఇంటి వద్ద ఉంచి, బిక్షాటనకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద కుమారుడు కనిపించలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సాయంత్రం నార్సింగ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీపీపై చర్యలు తీసుకోవాలి

● గుడిమల్కాపూర్ స్టేషన్ ఎదుట బీజేపీ నాయకుల ఆందోళన

కార్వాన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఏసీపీపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్‌పై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వివరాల్లోకి వెళితే ఆదివారం రాత్రి ఆసిఫ్ నగర్ ఏసీపీ కిషన్‌కుమార్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ క్రాస్ రోడ్డు వద్ద షాపులను మూసివేయిస్తున్నారు. అదే సమయంలో అటువైపు వస్తున్న అమర్ సింగ్ షాపులు ఎందుకు మూసి వేయిస్తున్నారని ఏసీపీ కిషన్‌కుమార్‌ను ప్రశ్నించారు. దాంతో ఏసీపీ దుర్భాషలాడుతూ అమర్‌సింగ్‌పై దాడిచేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఏసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వారిని సముదాయించారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



మాట్లాడుతున్న మురళీధర్ రెడ్డి

కళాకారులను ప్రోత్సహించాలి

అఫ్జల్‌గంజ్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రోత్సహించాలని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు కె. మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో శ్రీలహరి క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్లాసికల్, ఫోక్, వెస్ట్రన్ డ్యాన్స్, గాయకులను మల్టీటాలెంట్ స్టార్ అవార్డులు, కళాసరస్వతీ, నాట్యమయూరి అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. మురళీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలువురికి అవార్డులను అందజేసి సత్కరించారు. కళాకారులను గుర్తించి అవార్డులు అందజేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కొండవీటి జయప్రసాద్, వెంకట్ రాపోలు, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆలయ విస్తరణ, అభివృద్ధికి సహకరించండి

● అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హరిబౌలి శ్రీఅక్కన్న మాదన్న మహంకాళి ఆలయం విస్తరణ, అభివృద్ధికి సహకరించండని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం ప్రస్తుతం చిన్నదిగా ఉన్నందున పక్కనే ఉన్న ప్రైవేట్ స్థలం కొనుగోలు చేసి ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరారు. స్పందించిన మంత్రి.. సీఎంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినవారిలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.జగన్మోహన్ పర్షాద్, కార్యదర్శి కె.దత్తాత్రేయ, కోశాధికారి ఎ.సతీష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జి.దినేష్ తదితరులున్నారు.


మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నామస్మరణం - మోక్షదాయకం గ్రంథావిష్కరణ

రవీంద్రభారతి: మనుషులను యంత్రాలుగా మార్చే కృత్రిమమేధతో సమాజంలో కుటుంబ సంబంధాలు, మానవీయతకు ముప్పు వాటిల్లుతుందని రిటైర్డ్ ఐఏఎస్ డా.కే వీ.రమణాచారి అన్నారు. సోమవారం కేవీ.రమణాచారి ఆఫీస్‌లో సాధన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డా.బి.రామాచార్యులు రచించిన నామస్మరణం- మోక్షదాయకం గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. డా.కే.వీ.రమణాచారి గ్రంథాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు వారి దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి సమస్యలను అధిగమించేందుకు పురాణ కథలు, పద్యాలతోపాటు దైవ నామస్మరణ ఉపయోగకరమన్నారు. చిన్న సంపుటి అయినా రామాచార్యులు పలు విషయాలను ఆసక్తిగా పాఠకులకు అందించారని అన్నారు.

మన సంస్కృతికి కళలు నిదర్శనం: రమణాచారి


కళాకారులను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

రవీంద్రభారతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతికి కళలు నిదర్శనమని, అటువంటి కళలను భావితరాలకు అందజేస్తున్న కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి అన్నారు. సోమవారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో సర్వకళాకారుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో సాంస్కృతికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత విభావరి, కూచిపూడి, భరతనాట్యం, మోహినీ భస్మాసుర శివగంగ నృత్య నాటికలు, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి కళాకారులను సన్మానించి అభినందించారు.

కార్యక్రమంలో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు, భారతి, లంక లక్ష్మీనారాయణ, అశోక్ పవార్, జి.కె.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సాయ్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జగదీశ్వర్ యాదవ్

కబడ్డీ 'విజేత సాయ్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) జట్టు విజేతగా నిలిచింది. సోమవారం గౌలిపురలోని ఆలె నరేందర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఫైనల్లో సాయ్ జట్టు 41-35తో నవశక్తి క్రీడా మండల్ జట్టుపై గెలిచి, ట్రోఫీ కైవసం చేసుకుంది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో సాయ్ జట్టు 57-31తో రంగారెడ్డిపై నెగ్గింది. రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ విజేత జట్టుకు ట్రోఫీ ప్రదానం చేశారు.

జాతీయ పారా క్రీడల్లో జోహన్నాకు రజతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ జాతీయ పారా క్రీడల చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ప్లేయర్ జోహన్నా రజతంతో మెరిసింది. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో బాలికల సబ్ జూనియర్ స్విమ్మింగ్‌లో జోహన్నా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, రాష్ట్ర ట్రైథ్లాన్ అధ్యక్షుడు పి.మదన్ మోహన్ విజేతలకు పతకాలు ప్రదానం చేశారు.

వర్షం వస్తే కన్నీళ్లే

● చినుకు పడితే చాలు ఉస్మాన్‌నగర్, సైఫ్ కాలనీల వాసులకు వణుకు
● 2010, 2021లో వరదనీటిలో మునిగిన ఇళ్లు
● పట్టాలు ఇచ్చి స్థలం చూపించని అధికారులు


బుర్హాన్‌ఖాన్ చెరువులో నేటికీ నీటిలో మునిగి ఉన్న ఇళ్లు

పహాడిషరీఫ్ జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైందంటే ఆ కాలనీ వాసులకు కన్నీళ్లే. చినుకు పడితే చాలు ఇళ్లలోకి భారీగా వరదనీరు చేరుతుండడంతో వణికిపోతున్నారు. ఇది జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఉస్మాన్‌నగర్, సైఫ్ కాలనీ వాసుల దుస్థితి. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియకి వారికి కంటిమీద కునుకు ఉండదు. అర్ధరాత్రి వర్షం పడితే ఇళ్లలోకి వరద నీరు చేరుతుంది. దాంతా ఈ నాలుగు నెలలు ఇళ్లు ఖాళీ చేసి బయట అద్దెకు ఉండాల్సిన పరిస్థితి. బుర్హాన్‌ఖాన్ చేరువులో నేటికి కొన్ని ఇళ్లు నీటిలోనే మునిగి ఉన్నాయి.

తూము మూసేయడంతోనే


వర్షాకాలంలో పహాడిషరీఫ్, షాహీన్‌నగర్, ఆర్‌సీఐ, న్యూ బాబానగర్ తదితర ప్రాంతాలనుంచి వచ్చే వరద నేరుగా వచ్చి బుర్హాన్‌ఖాన్ చెరువులోకి చేరుతుంది. గతంలో చెరువులోని తూమును కొంతమంది మూసివేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములను రైతులు ఇతరులకు విక్రయించారు. భూములు కొనుగోలు చేసిన వారు ప్లాట్లు చేసి విక్రయించారు. దాంతో వర్షాలు కురిసిన ప్రతీ సారి వరద నీరు వెళ్లే దారిలేక బస్తీలు, కాలనీలలోకి చేరుతుంది.

ప్రజాధనం వృథా

బుర్హాన్‌ఖాన్ చెరువలోకి వచ్చే వరద ఉస్మాన్‌నగర్, సైఫ్‌కాలనీ తదితర బస్తీలకు వెళ్లకుండా 2021లో దాదాపు రూ. 22 లక్షలతో రింగ్‌బండ్ నిర్మించారు. భారీ వర్షాలకు రింగ్‌బండ్ నీట మునిగిపోయింది. నాణ్యత లేకుండా పనులు చేయడంతోనే రింగ్‌బండ్ మట్టి కొట్టుకుపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీట మునుగుతున్న కాలనీలకు అప్పట్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు వచ్చి పరామర్శించి హామీలు ఇచ్చి ఫొటోలకు ఫోజులిచ్చారు తప్ప, సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీల సమస్యలపై గతేడాది కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నీటిలో నిలబడి కొవ్వొత్తుల ప్రదర్శన, ఇంద్రపార్కు వద్ద ధర్నాలు చేయగా, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు బుర్హాన్‌ఖాన్ చెరువును సందర్శించి పరిశీలించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది, ఇప్పుడైనా ఆ పార్టీ నాయకులు వరద సమస్యను పరిష్కరించాలని ఆయా బస్తీలు, కాల నీల ప్రజలు సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నారు.

హామీలే తప్ప భూములు ఇవ్వడం లేదు

2021లో భారీస్థాయిలో వర్షాలు కురిసినప్పుడు ఉస్మాన్ నగర్ బస్తీ నీట మునిగిపోయింది. అప్పటి మంత్రి షబ్బీర్ అలీ నీట మునిగిన ఇంటి యజమానులకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి కొందరికి పట్టాలు అందజేశారు. వాటిల్లో నిజమైన బాధితులకు అందకపోవడం గమనార్హం. 2010 మరోసారి కురిసిన భారీ వర్షాలకు ఉస్మాన్‌నగర్‌తోపాటు పలు బస్తీలు నీటిలో చిక్కుకున్నాయి. అప్పటి హోంమంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో బాలాపూర్ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 144, 150లో కొంతమందికి మాత్రమే పట్టాలు అందజేశారు. అయితే పట్టాలు ఇచ్చిన అధికారులు స్థలాలు మాత్రం చూపించలేదు. దాంతో సర్వే నెంబర్ 144లోని భూమి నేడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
ఇంటి స్థలం పట్టా ధృవపత్రం
INDIRAMMA

అందజేసిన పట్టాలు (ఫైల్)

భవానీ కాలనీలో రోడ్లను బాగుచేయించాలి

రాజేంద్రనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భవానీ కాలనీలోని రోడ్లను బాగుచేయించాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాశ్‌గౌడ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో కన్వెన్షన్ హాల్‌ను పూర్తి చేయాలన్నారు. తమ కాలనీలోని సమస్యలను పలుమార్లు సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. భావానీ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ అంశంపై త్వరలో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, కాలనీ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుపై దృష్టి సారిస్తానన్నారు. కార్యక్రమంలో భవానీ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవానీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయం


ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి క్రింద ఆగిన వరద నీరు


ఉప్పర్‌పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద మ్యాన్‌హోల్ ద్వారా వరద నీటిని పంపించడానికి ప్రయత్నిస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్, జూన్17 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలోకి వరద నీరు చేరింది. దాంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రోడ్లపై మోకాళ్ల లోతు నీరు నిలవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయినంది. రోడ్లపైన నిలిచిన వరద నీటిని తొలగించడానికి ట్రాఫిక్ సిబ్బంది కృషి చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పారిశుధ్య విభాగం అధికారులు వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలలో పనులు చేపట్టి రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు.

పత్రాల కోసం ప్రదక్షిణలు..!

తహసీల్దార్ ఆఫీసుల్లో అధికారుల ఇష్టారాజ్యం

కాలేజీల్లో అడ్మిషన్లకు, ఉద్యోగాలకు చేసుకునే దరఖాస్తులకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందకపోతుండడంతో విద్యార్థులు, నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న పత్రాలకు సంబంధించిన రశీదులను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. నిర్ణీత గడువులోగా పత్రాలు రాకపోవడంతో ఆయా నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది.

- ధ్రువీకరణ పత్రాల జారీని పట్టించుకోని పరిస్థితి
- దరఖాస్తు చేసుకున్న తర్వాత రోజుల తరబడి పడిగాపులు
- పైరవీకారులకు ప్రాధాన్యం.. సాధారణ పౌరులపై నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు



హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో రెవెన్యూ కార్యకలాపాలు అధ్వానంగా మారాయి. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కులం, ఆదాయం, నివాసం, నాన్ క్రీమీలేయర్, తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దరఖాస్తు చేసుకున్న తర్వాత రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతుండడంతో కార్యాలయాల చుట్టూ తిరగలేక చాలామంది అవస్థలు పడుతున్నారు.

అమలుకు నోచుకోని సిటిజన్ చార్టర్

మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా జారీ చేయాలని కొన్నేళ్ల క్రితం సిటిజన్ చార్టర్‌ను అమలులోకి తీసుకొచ్చారు. ఉదాహరణకు ఆదాయం సర్టిఫికెట్‌ను 7 రోజుల్లోగా ఇవ్వాలని, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను 15 రోజుల్లోగా, నాన్ క్రీమీలేయర్ (వెనకబడిన తరగతులకు (ఓబీసీ)కి ఇచ్చే సర్టిఫికెట్)ను 30 రోజుల్లోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అందజేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చారు. వీటితోపాటు మరికొన్నింటిని కూడా నిర్ణీత కాలవ్యవధిలో ఇవ్వాలనే నిబంధనలున్నాయి. అయితే, జిల్లాలోని పలు మండలాల్లో సిటిజన్ చార్టర్‌ను అమలు చేయడం లేదు. ఆదాయం సర్టిఫికెట్‌ను దరఖాస్తు చేసుకున్న మూడు, నాలుగు రోజుల వరకు ఇస్తుండగా.. కులం, నివాసం, నాన్ క్రీమీలేయర్ వంటి పత్రాలను కాలపరిమితి దాటిన తర్వాత అందజేస్తున్నట్లు తెలుస్తోంది. అంబర్‌పేట్ మండలానికి చెందిన ఓ వ్యక్తి నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ కోసం మే రెండో వారంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆయనకు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదు. కాగా, సర్టిఫికెట్ కోసం సదరు దరఖాస్తుదారుడు వారం రోజులుగా ఆఫీసుకు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నాడు. అలాగే గోల్కొండ మండలానికి చెందిన మరో వ్యక్తి కులం ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న రెండు వారాలకు అందజేసినట్లు తెలిసింది. సర్టిఫికెట్ల విషయంలో చాలా మండలాల్లో రోజుల తరబడి జాప్యం జరుగుతున్న పరిస్థితి కనిపిస్తుంది.

పైరవీకారులకు ప్రాధాన్యం

సాధారణ పౌరులను రోజుల తరబడి తిప్పించుకుంటున్న అధికారులు.. పైరవీకారులకు మాత్రం పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న తర్వాత రశీదును పట్టుకుని పైరవీకారుడి వద్దకు వెళ్లి ఎంతో కొంత డబ్బులు చెల్లిస్తే.. కేవలం రెండు, మూడు రోజుల్లోనే ఆయా సర్టిఫికెట్లు వస్తున్నట్లు తెలుస్తోంది. అదే డబ్బులు చెల్లించని సాధారణ ప్రజలకు మాత్రం రోజుల సమయం పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అయితే సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం ఎందుకని ఎవరైనా అడిగితే.. టైం పడుతోంది.. మాకు వేరే పని లేదా.. అంటూ కొందరు అధికారులు దబాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంబర్‌పేటలో ఓ అధికారి దరఖాస్తుదారులతో దురుసుగా వ్యవహరిస్తున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అయినా ఆయన తీరు మారకపోవడం గమనార్హం.

ఏళ్ల తరబడి మండలాల్లో

జిల్లాలోని పలు మండలాల్లో పనిచేస్తున్న కొంతమంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్‌ఐలు) ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తుండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కులం, నివాసం, నాన్ క్రిమిలేయర్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్ లాంటి దరఖాస్తులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందించిన తర్వాత తహసీల్దార్లు ఆమోదిస్తారు. అయితే కొన్ని మండలాల్లోని ఆర్‌ఐలకు కార్యాలయాల్లో బలం పెరగడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫీల్డ్ విజిట్ పేరుతో సర్టిఫికెట్ల పరిశీలనను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నెదర్లాండ్స్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ సదస్సు

- పాల్గొన్న జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల విభాగం ఈఈ శ్రీనివా‌స్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేస్ట్ సప్లయ్ చైన్ మెనేజ్‌మెంట్‌పై నెదర్లాండ్స్‌లో జరుగుతున్న కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు. బల్దియాలోని ఘన వ్యర్థాల విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివా‌స్‌రెడ్డి రణబోతు సోమవారం అక్కడ జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో వ్యర్థాల నిర్వహణకు చేపడుతున్న విధానాలను వివరించారు. ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ట్రాలీల ఏర్పాటు, సెకండరీ కలెక్షన్, ట్రాన్స్‌పోర్టేషన్ కేంద్రాలు, జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో తడి చెత్తతో సేంద్రీయ ఎరువుల తయారీ, పొడి చెత్తతో విద్యుదుత్పత్తి చేస్తున్న తీరును సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. రోడ్లపై చెత్త కుప్పలు లేకుండా, ఇంటింటి చెత్త సేకరణ 100 శాతం జరిగేలా త్వరలో కొత్త విధివిధానాలు ప్రకటించనున్నట్టు పేర్కొన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన లేకుండా చేపట్టిన చర్యలు వివరించినట్టు శ్రీనివా‌స్‌రెడ్డి తెలిపారు. 21వ తేదీ వరకు జరుగనున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశంలోని పలు నగరాల నుంచి ఘన వ్యర్థాల నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించే అధికారులు వెళ్లారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు తెలంగాణ తరఫున జీహెచ్ఎంసీ అధికారి శ్రీనివా‌స్‌రెడ్డి పాల్గొన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం, నెదర్లాండ్స్ సర్కారు గతేడాది ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా వ్యర్థాల నిర్వహణకు సంబంధించి అధునాతన సాంకేతిక విధానాలు, ఇప్పటికే అవలంబిస్తోన్న పద్ధతులను పరస్పరం పంచుకునేందుకు కార్యక్రమం నిర్వహించారు.


నెదర్లాండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివా‌స్‌రెడ్డి

వరద నీరు.. గుంతలతో బేజారు..!

(5వ పేజీ తరువాయి)

ఏర్పడిన గుంతల మరమ్మతు ఇప్పటికీ పూర్తవలేదు.

నీరు నిలిచి.. బీటీ పాడై..

నగరంలో వరద ప్రవాహ వ్యవస్థ నామమాత్రమే. వర్షం పడితే ఎక్కడికక్కడ నీళ్లు నిలుస్తాయి. ఇదే బీటీ రోడ్లు పాడవడానికి ప్రధాన కారణం. నీళ్లు నిలిచే చోట బీటీ ఉండడం లేదు. దీంతో నగరంలో వరద నీరు నిలిచే చోట రహదారులపై గుంతలు ఏర్పడుతున్నాయి. కంకర, ఇసుక తేలి ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. అధికారికంగా భారీగా వర్షపు నీరు నిలుస్తోన్న ప్రాంతాలు 125 కాగా.. అనధికారికంగా ఆ సంఖ్య రెండు, మూడింతలు ఎక్కువగా ఉంటుంది. వాక్యూమ్ డీ వాటర్డ్ సిమెంట్ కాంక్రీట్ (వీడీసీసీ) రోడ్లున్న చోట పరిస్థితి మెరుగ్గానే ఉన్నా.. బీటీ రోడ్లున్న చోట అధ్వానంగా మారుతోంది. పలు ప్రాంతాల్లో నాలుగు నుంచి ఎనిమిది అంగుళాల లోతు, రెండు, మూడు మీటర్ల వెడల్పుతో గుంతలున్నాయి. దీంతో వర్షం పడినప్పుడు రహదారులు కనిపించక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.


జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్‌లో..

ఐఆర్‌టీలు ఎక్కడ?

వర్షాకాలంలో వరద నీటి నిర్వహణతో పాటు.. రహదారుల మరమ్మతు కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తారు. తక్షణ మరమ్మతు బృందాలు (ఐఆర్‌టీ) పాడైన రహదారులను ఎప్పటికప్పుడు బాగు చేయాలి. వర్షం లేనప్పుడు మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీంలతోనూ రోడ్లపై గుంతల పూడ్చివేత పనులు చేయించవచ్చు. కానీ గ్రేటర్‌లో ఇప్పటికీ ఐఆర్‌టీలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిన దాఖలాలు లేవు. ప్రతి మాన్‌సూన్‌లో అత్యవసర, తక్షణ మరమ్మతు బృందాల కోసం రూ.30 కోట్ల నుంచి 40 కోట్లు ఖర్చు చేస్తున్నారు. కాగితాల్లో ఉన్నట్టుగా క్షేత్రస్థాయిలో టీంలు ఉంటాయా..? అంటే అధికారులూ సరైన సమాధానం చెప్పని పరిస్థితి. ప్రతి కార్మికుడి ఆధార్ వివరాలు తీసుకోవడంతోపాటు సాంకేతిక పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో బృందాల సంఖ్యపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ప్రాంతాల్లో..

- వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మన్సూరాబాద్, నాగోల్ డివిజన్‌లోని ప్రధాన రోడ్లపై గుంతలు పడడంతో వాహనాల రాకపోకలు నెమ్మదించి ట్రాఫిక్ జామ్ అవుతోంది.
- చంపాపేటలోని సాయిరాంనగర్‌కాలనీ నుంచి ఈస్ట్ మారుతీనగర్‌కాలనీకి వెళ్లే రహదారి, మారుతీనగర్‌కాలనీ, యాదగిరినగర్‌కాలనీ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది.
- కూకట్‌పల్లి, వివేకానందనగర్, మూసాపేట, బాలాజీనగర్, కేపీహెచ్‌బీకాలనీ ప్రాంతాల్లో కొన్ని నెలల క్రితం రోడ్లపై పడిన గుంతలను ఇప్పటికీ పూడ్చలేదు.
- నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి.
- వారాసిగూడ ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద ప్రధాన రోడ్డు కుంగిపోయింది. పెద్ద గుంత పడి ప్రమాదకరంగా మారింది. వారాసిగూడ పోచమ్మ దేవాలయం వీధిలో రోడ్డు మరింత దారుణంగా తయారైంది. ఎనిమిది నెలల క్రితం సివరేజీ పైపులైన్ పనుల నిమిత్తం తవ్వి వదిలి వేయటంతో గుంతలు పడి స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వారాసిగూడ అంబర్‌నగర్ మార్గంలో మార్కండేయ ఆలయానికి కూత వేటు దూరంలో రోడ్డు గుంతలు పడ్డాయి. సీతాఫల్‌మండి డివిజన్‌లోని మేడిబావి, బీదలబస్తీ, అన్నానగర్, భవానీనగర్, కిందిబస్తీ, శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రధానరోడ్లతో పాటు అంతర్గతరోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి.

కిలోమీటరు ఊడ్చితే రూ.3.21 లక్షలట!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలు అప్పగించారనే ఆరోపణలున్నాయి. గడువు ముగిసినా.. పలు ప్రాంతాల్లో ప్రస్తుతమూ అదే సంస్థల సేవలు పొడిగించినట్టు తెలిసింది. ఇంకొన్ని ప్రాంతాల్లో బాధ్యతలు కొనసాగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించినా.. పలు పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి.

పర్యాటక ప్రాంతాల్లో..

హైదరాబాద్‌లో ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతాలున్నాయి. చార్మినార్, పైగా టూంబ్స్, సాలార్‌జంగ్ మ్యూజియం, మక్కా మసీద్, కుతుబ్ షాహీ టూంబ్స్, గోల్కొండ కోట, బాపూఘాట్, నాంపల్లి పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ, బిర్లా టెంపుల్ తదితరాలను సందర్శించేందుకు దేశ, విదేశీ పర్యాటకులు వస్తుంటారు. నిత్యం వేల మంది వస్తుండడం.. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదన్న అభిప్రాయం నేపథ్యంలో నాలుగేళ్ల క్రితం జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. పర్యాటక ప్రాంతాల్లో చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించే బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించింది. 2019 డిసెంబర్‌లో స్టాండింగ్ కమిటీ రెండు నెలల పాటు పైలట్‌గా ప్రాజెక్టు అప్పగించేందుకు ఆమోదించింది. అనంతరం ఎంపిక చేసిన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు ఎక్సోరా కార్పొరేట్ సర్వీసెస్, లా మెకలీన్ సంస్థలను ఎంపిక చేశారు. తొమ్మిది ప్రాంతాల్లోని 73.75 కి.మీల కారిడార్లలో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను ఆ రెండు సంస్థలకు అప్పగిస్తూ 2020లో నిర్ణయం తీసుకున్నారు. పర్యాటక ప్రాంతాల సమీపంలోని రహదారులను స్ట్రెచ్‌లుగా విభజిస్తూ ఏజెన్సీలను ఎంపిక చేశారు. 73.5 కి.మీల రోడ్లకు నెలకు రూ.2.30 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన ఏటా పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు రూ.27.60 కోట్లు వెచ్చిస్తున్నారు. సాధారణ రహదారుల నిర్వహణతో పోలిస్తే ఇది ఎంతో ఎక్కువ.

పర్యాటక ప్రాంతం	కి.మీలు	నెలకు వ్యయం (రూ.లక్షల్లో)
పైగా టూంబ్స్	2.9	9.55
చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, మక్కా మసీద్, చౌమహల్లా ప్యాలెస్	13	41.23
గోల్కొండ కోట, బాపూఘాట్	13.05	41.23
పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ	4	12.67
ఎంజే మార్కెట్, సుల్తాన్‌బజార్ క్లాక్ టవర్, ఎల్‌బీ స్టేడియం	7	22.51
హుస్సేన్‌సాగర్/ట్యాంక్‌బండ్, బిర్లా టెంపుల్, బిర్లా ప్లానిటోరియం, ఎల్లమ్మ ఆలయం	10.20	34.50
కేబీఆర్ పార్క్, పెద్దమ్మ ఆలయం	16.3	51.81
దుర్గం చెరువు	5.8	41.47
సికింద్రాబాద్ రైల్వే స్టేషన్	1.5	5.49
మొత్తం	73.75	2.30

సగటున కిలోమీటర్ వ్యయం - 3.12 లక్షలు

కీలక మంత్రి పేషీ నుంచి..

గత ప్రభుత్వ హయాంలో ఓ కీలక మంత్రి పేషీ నుంచి వచ్చిన సూచనల మేరకు ఆ ఏజెన్సీలకు బాధ్యతలు దక్కాయనే ఆరోపణలున్నాయి. ఇప్పుడూ అదే సంస్థలను పొడిగిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు బల్దియాలోని కొందరు అధికారులు సహకరిస్తుండగా.. ఉన్నతస్థాయి నుంచి కూడా ఒత్తిళ్లు వస్తున్నట్టు సమాచారం. గతంలో కీలక మంత్రి పేషీలో పని చేసిన ఓ అధికారి సిఫారసు మేరకు పలు ప్రాంతాల్లో ఓ ఏజెన్సీని కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ప్రైవేట్ సంస్థలకు చెల్లిస్తోన్న దానికంటే తక్కువ వ్యయంతో అంతకన్నా మెరుగైన నిర్వహణ చేపట్టవచ్చని పలువురు అధికారులు సూచించినా ఖాతరు చేయకుండా ఏజెన్సీ గడువు పొడిగించారని సమాచారం. ప్రస్తుత ప్రభుత్వంలోని ఓ మంత్రి కూడా ఓ ఏజెన్సీ కోసం సిఫారసు చేశారని జీహెచ్ఎంసీలో ప్రచారం జరుగుతోంది.

ప్రమాదాలు జరగొద్దు..!

- అధికారులతో పొన్నం టెలికాన్ఫరెన్స్

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, పోలీస్, ఇతర శాఖలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం వర్షం కురుస్తోన్న సమయంలో ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశమున్న దృష్ట్యా.. అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. పౌరులు మ్యాన్‌హోల్ మూతలు తెరవకుండా జాగ్రత్త వహించాలని, ముంపు ప్రాంతాలకు డీఆర్ఎఫ్ బృందాలను పంపాలన్నారు. కూలిన చెట్లు, విరిగిన కొమ్మలను వెంటనే తొలగించాలన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు అప్రమత్తం కావాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని నగర పోలీస్ కమిషనర్ శ్రీనివా‌స్‌రెడ్డికి సూచించారు.

జీహెచ్ఎంసీ అప్రమత్తం...

కుండపోత వానతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. డీఆర్ఎఫ్, మాన్‌సూన్ అత్యవసర బృందాలను వెంటనే రంగంలోకి దించినట్టు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. వరద నీరు నిలిచిన, కూలిన/విరిగిన చెట్లకు సంబంధించిన ఫిర్యాదులను యుద్ధప్రతిపాదికన పరిష్కరించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. భారీ వర్షం పడుతుండడంతో అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని జీహెచ్ఎంసీ ప్రజలకు సూచించింది.

పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

- బీకేగూడ, మధురానగర్ ప్రాంతాల్లో ఐదు గంటల పాటు..

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులు, భారీ వర్షంతో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో గంట నుంచి రెండుగంటల వరకు అంతరాయాలు తలెత్తాయి. టోలిచౌకి, అమీర్‌పేట, బేగంపేట, కుందన్‌బాగ్, బంజారాహిల్స్, బల్కంపేట, రేతిభౌలి ఎక్స్‌రోడ్ ప్రాంతాల్లో చెట్లు, కొమ్మలు విద్యుత్‌తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలులకు ఏడు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడగా, 12 ప్రాంతాల్లో వరదనీరు రోడ్లపై నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సంజీవరెడ్డి నగర్ బీకేగూడ 60 ఫీట్ రోడ్, జయప్రకాష్‌నగర్, సాయిబాబా నగర్, బల్కంపేట ప్రాంతాల్లో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా లేదు. మధురానగర్ డీ బ్లాక్‌లో భారీ వృక్షం విద్యుత్‌తీగలపై పడటంతో సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరించేందుకు 4 నుంచి 5 గంటల సమయం పట్టిందని విద్యుత్ అధికారులు తెలిపారు. భారీవర్షంతో జీహెచ్ఎంసీ ఫిర్యాదుల విభాగానికి మొత్తం 70 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

రేపు నగరానికి కేంద్రమంత్రుల రాక

- బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి భారీ ర్యాలీ
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సన్మానం



బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా నగరానికి వస్తున్న జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తెలిపారు. సోమవారం బర్కత్‌పురాలోని నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిసి ఈనెల 19న సాయంత్రం 4 గంటలకు ఢిల్లీ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా ప్రారంభమై ప్యారడైజ్ చౌరస్తా, ఎంజీ రోడ్, మ్యారియెట్ హోటల్, కవాడిగూడ, ముషీరాబాద్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, నారాయణగూడ ఫ్లైఓవర్ కిందినుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, హైదర్‌గూడ, బషీర్‌బాగ్, నిజాంకళాశాల అబిడ్స్ మీదుగా నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుంటారని ఆయన తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఇద్దరు కేంద్ర మంత్రులను ఘనంగా సన్మానించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి 8.30 గంటల వరకు ఈ సన్మాన కార్యక్రమం పూర్తవుతుందని ఆయన తెలిపారు.

ఎల్అండ్‌టీకి గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఆర్-సర్టిఫికేషన్

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రో రైలు నిర్వహణను చేపడుతున్న ఎల్అండ్‌టీకి గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఆర్-సర్టిఫికేషన్ లభించింది. పనిచేసే చోట ఉద్యోగులకు సానుకూలమైన, సాధికారికమైన పరిస్థితులను కల్పించే విషయంలో ప్రాధాన్యం కల్పిస్తున్న సంస్థలకు అంతర్జాతీయ ప్రాధికార సంస్థ గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఆర్-ఇండియా ప్రతిష్ఠాత్మక అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎల్అండ్‌టీకి సదరు సంస్థ సర్టిఫికేషన్ వరించింది. ఈ ఏడాది పరిశ్రమల్లో ఎల్అండ్‌టీ ఒక్కటే ఈ సర్టిఫికేషన్ పొందినట్లు సంస్థ అధికారులు తెలిపారు. అలాగే తొలి ప్రయత్నంలోనే ట్రస్ట్ ఇండెక్స్‌కి సంబంధించి అత్యధికంగా 92 స్కోరు పొందిన అతికొద్ది సంస్థల్లో కూడా ఒకటిగా ఉందన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థకు గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఆర్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. తమ విజయాలకు చోదకశక్తిగా ఉంటున్న ఉద్యోగుల కఠోర శ్రమ, అంకితభావానికి సర్టిఫికేషన్ నిదర్శనమన్నారు. సర్టిఫికేషన్ రావడంపై ఎల్అండ్‌టీ సీహెచ్ఆర్ఓ బినోజోస్ మాథ్యూను ఎండీ కేవీబీ రెడ్డి అభినందించారు.


ఎల్అండ్‌టీ సీహెచ్ఆర్ఓ బినోజోస్ మాథ్యూను అభినందిస్తున్న ఎండీ కేవీబీ రెడ్డి

తెలుగు కవి సుధాకర్‌కు 'విమెన్ ఆఫ్ లవ్' అవార్డు



హైదరాబాద్ సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తెలుగు కవి తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ 'విమెన్ ఆఫ్ లవ్' అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును స్వీకరించవలసిందిగా నాశ్చిరా అసోసియేషన్, బార్డ్ ఇంటర్నేషనల్ గ్రూప్ నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. మహిళా ప్రపంచానికి ప్రేరణగా రాసే సాహిత్యాన్ని గౌరవిస్తూ ఈ అవార్డును నెలకొల్పారు. జూన్ 24న రోమ్‌లో జరిగే వేడుకలో ముఖ్యఅతిథుల చేతులమీదుగా ఈ అవార్డును విల్సన్ సుధాకర్ అందుకోనున్నారు. విల్సన్ సుధాకర్ మహిళల గురించి రాసిన పలు కవితలు, ఇంగ్లిష్, ఇటాలియన్ భాషలలో అనువాదం అయ్యాయి.

కంబర్‌ల్యాండ్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్‌లు

- నేడు హోటల్ ఆదిత్య పార్క్‌లో ఇంటర్వ్యూలు

అమీర్‌పేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన చరిత్రాత్మకమైన కంబర్‌ల్యాండ్ యూనివర్సిటీ మంగళవారం అమీర్‌పేటలోని హోటల్ ఆదిత్య పార్క్‌లో స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తుందని వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క్ హన్నా తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న స్పాట్ అడ్మిషన్లకు అవసరమైన పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. సోమవారం ఆదిత్య పార్క్‌లో ఏర్పాటు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విశ్వవిద్యాలయం అధునాతన డిగ్రీ కోర్సులతో పాటు మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ (ఎంఎస్ఈఎం) అలాగే మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఐటీ మేనేజ్‌మెంట్ (ఎంఎస్ఐటీఎం)లను ప్రవేశపెట్టామని తెలిపారు. మాస్టర్స్ ప్రోగ్రామ్ కేవలం 5 సెమిస్టర్‌లలో పూర్తయ్యేలా రూపొందించామని ఆయన తెలిపారు.



కంబర్‌ల్యాండ్ యూనివర్సిటీ లోగోను ప్రదర్శిస్తున్న డాక్టర్ మార్క్ హన్నా

నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


ఆరే మహేందర్

దుండిగల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నీట్ యూజీ ఎంట్రన్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై దేశ వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి, బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


మైత్రా స్టేడియం వద్ద 'డెల్టా 5 మోటార్ సైకిల్ ఎక్స్‌పెడిషన్' టీమ్‌కు స్వాగతం పలికిన మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్

డెల్టా-5 మోటార్ సైకిల్ యాత్రకు ఘన స్వాగతం

అల్వాల్/మచ్చబొల్లారం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డెల్టా-5 మోటార్ సైకిల్ ఎక్స్‌పెడిషన్ యాత్ర బృందానికి సోమవారం మైత్రా స్టేడియం వద్ద సైనికులు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ కేడెట్స్ స్థానికుల సమక్షంలో బైసన్ డివిజన్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్ ఘన స్వాగతం పలికారు. 1999 కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా భారత ఆర్మీకి చెందిన రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీ బృందం 'రజత్ జయంతి ఆఫ్ కార్గిల్ విజయ్‌దివాస్' జ్ఞాపకార్థం 'డెల్టా-5 మోటార్ సైకిల్ ఎక్స్‌పెడిషన్' పేరుతో మోటార్ సైకిల్ యాత్రను చేపట్టారు. ఈ మోటార్‌సైకిల్ యాత్ర తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీదుగా సికింద్రాబాద్, బొల్లారం మైత్రా స్టేడియానికి చేరుకుంది. జూన్ 12న ధనుష్కోడి వద్ద ప్రారంభమైన ఈ యాత్ర 8 మంది సభ్యుల బృందంతో దేశంలోని ప్రధాన ప్రాంతాల గుండా రోజుకు 300 నుంచి 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నది. ఒక బృందం సౌత్‌లోని ధనుష్కోడి నుంచి యాత్ర ప్రారంభించగా, మరో బృందం ఈస్ట్‌లోని దింజన్ నుంచి, వెస్ట్‌లోని ద్వారక నుంచి యాత్రను ప్రారంభించాయి. ఈ ర్యాలీ దాదాపు 28 రోజుల పాటు కొనసాగి 2024 జూలై 10న ద్రాస్‌కు చేరుకుంటుంది. దక్షిణాదికి చెందిన బృందం 4వేల కిలోమీటర్లు ప్రయాణించి మధురై, కోయంబత్తూరు, అనంతపురం, హైదరాబాద్, నాగపూర్, భోపాల్, గ్వాలియర్, అల్వార్‌లను కవర్ చేస్తూ కార్గిల్ యుద్ధ స్మారక స్థూపానికి చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నలుగురు వీరనారీలతో పాటు 9 మంది చక్ర అవార్డు గ్రహీతలను సత్కరించారు. ఈ బృందానికి అపోలో హాస్పిటల్స్ వైద్య సహాయాన్ని అందిస్తుండగా, హెచ్‌పీసీఎల్ ఇంధనాన్ని అందిస్తున్నది.

కేబుల్ బ్రిడ్జి వద్ద యువతి ఆత్మహత్యాయత్నం

కాపాడిన ట్రాఫిక్ పోలీసులు

మాదాపూర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ యువతిని ట్రాఫిక్ పోలీసులు రక్షించారు. వివరాలు అడుగగా తన పేరు సరళ అని నిద్ర మాత్రలు మింగానని చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు చికిత్స అనంతరం ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.


యువతిని కాపాడుతున్న పోలీసులు

ఆరో అంతస్తు పైనుంచి దూకి యువకుడి బలవన్మరణం

మాదాపూర్ చంద్రనాయక్ తండాలోని ఓయో లాడ్జి 6వ అంతస్తు పైనుంచి ఓ యువకుడు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు అనంతపూర్‌కు చెందిన సాయిబాబాగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కిడ్నీ కేర్

నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోతూ ఉండే కిడ్నీలు జబ్బు పడే ప్రక్రియ కూడా నిశ్శబ్దంగానే జరిగిపోతూ ఉంటుంది. కాబట్టి వాటి మీద ఓ కన్నేసి ఉంచి, ముందస్తు పరీక్షలతో అప్రమత్తంగా నడుచుకుంటూ ఉండాలంటున్నారు వైద్యులు.

కిడ్నీలు ఇలా క్షేమం

మూత్రపిండాలు రక్తాన్ని వడగట్టే సామర్థ్యాన్ని క్రమేపీ కోల్పోతూ ఉంటాయి. ఏడాదికి 5% చొప్పున సహజంగానే కిడ్నీల సామర్థ్యం తిరగిపోతూ ఉంటుంది. దీనికి తోడు అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు లాంటి రుగ్మతలు, ఊబకాయం, అస్తవ్యస్థ జీవనశైలి లాంటి సమస్యల వల్ల కిడ్నీలు మరింత వేగంగా దెబ్బతినడం మొదలుపెడతాయి. అయితే కిడ్నీ ఫెయిల్యూర్, అక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్, క్రానిక్ కిడ్నీ డిసీజ్, ర్యాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్ అనే మూడు దశల్లో సాగుతుంది.

- **అక్యూట్:** అకస్మాత్తుగా వాంతులు, విరోచనాలతో శరీరంలోని నీటి శాతం తగ్గిపోయినప్పుడు లేదా ఒంటికి సరిపడని మందులు తీసుకోవడం వల్ల, గుండెపోటుకు గురైన సందర్భాల్లో ఆ ప్రభావాలు కిడ్నీల మీద పడి, వాటి సామర్థ్యం కొంత మేరకు దెబ్బ తింటుంది. అలాగే మూత్రపిండాల్లో రాళ్ల వల్ల, తీవ్రమైన కొవిడ్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఇలా జరగవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కిడ్నీల పనితీరు దెబ్బతినడానికి కారణమైన ప్రధాన సమస్యను చికిత్సతో సరిదిద్దితే, కిడ్నీలు కూడా పూర్వపు స్థితికి చేరుకుంటాయి. అయితే మూత్రపిండాలు నిమిషానికి 70 నుంచి 100 మి.లీ రక్తాన్ని వడగట్టడానికి బదులుగా, 15 మి.లీ రక్తాన్ని మాత్రమే వడగట్టే స్థితికి చేరుకుంటే, అప్పుడు ఆ వ్యక్తులకు డయాలసిస్ అవసరమవుతుంది. కిడ్నీలు పూర్తి సామర్థ్యాన్ని పుంజుకునే వరకూ ఇలా డయాలసిస్ అందించవలసి ఉంటుంది. ఇలా కాకుండా కిడ్నీల వడపోత సామర్థ్యం 15, 70 మి.లీ మధ్య ఉంటే, మందులతోనే పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చు.
- **క్రానిక్ కిడ్నీ డిసీజ్:** ఇది నిశ్శబ్ద వ్యాధి. దీన్ని మొదట్లోనే కనిపెట్టగలిగితే, సమస్యను సరిదిద్దుకోగలిగే అవకాశం ఉంటుంది. కిడ్నీల సామర్థ్యం 60 మి.లీటర్లకు పడిపోయినప్పుడు కనిపెట్టినా, తిరిగి చికిత్సతో కిడ్నీలను కాపాడుకోవచ్చు. అలా కాకుండా వ్యాధిని కనిపెట్టకుండా కిడ్నీల సామర్థ్యం 10 మి.లీకు పడిపోతే, తిరిగి చికిత్సతో కిడ్నీలను మెరుగు చేసుకునే పరిస్థితి ఉండదు. క్రానిక్ కిడ్నీ డిసీజ్‌లో కిడ్నీల సామర్థ్యం 90%కి పడిపోయినా ఎటువంటి లక్షణాలు బయల్పడవు. వంద మంది కిడ్నీ ఫెయిల్యూర్ రోగుల్లో, దీర్ఘకాలిక మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో పెట్టుకోకపోవడం వల్ల కిడ్నీలు ఫెయిల్ అయిన వాళ్లు 70 నుంచి 80 మంది ఉంటారు. వంశపారంపర్య కిడ్నీ జబ్బులు సంక్రమించిన వాళ్లు, పదే పదే కిడ్నీ స్టోన్స్, కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే సమస్య బారిన పడేవాళ్లు, పుట్టుకతో సమస్యను వెంట తెచ్చుకున్నవాళ్లు, దీర్ఘకాలికంగా పెయిన్ కిల్లర్స్ తీసుకున్న వాళ్లు, అవసరం లేకపోయినా మూలికా మందులు వాడుకునేవాళ్లు, గుండెజబ్బులు ఉన్న మిగతా 20 నుంచి 30 మందిలో కిడ్నీలు ఫెయిల్ అవుతూ ఉంటాయి.
- **ర్యాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్:** అతి తక్కువ కాలంలో కొన్ని రోజుల వ్యవధిలో కిడ్నీలు ఫెయిల్ అయిపోయే పరిస్థితి ఇది. క్రానిక్ కిడ్నీ డిసీజ్‌కు దారి తీసే కారణాలే దీనికీ వర్తిస్తాయి. వీళ్లకు డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి ఒక్కటే పరిష్కారం.

కిడ్నీ ఫ్యాక్ట్స్!

- శరీరంలోని మొత్తం రక్తాన్ని కిడ్నీలు గంటకు 12 సార్లు వడపోస్తూ ఉంటాయి.
- రోజు మొత్తంలో మూత్రపిండాలు 180 లీటర్ల రక్తాన్ని వడపోస్తాయి.
- కాలేయానికి చోటివ్వడం కోసం కుడివైపు మూత్రపిండం ఎడమవైపు కిడ్నీ కంటే కొద్దిగా చిన్నదిగా, దిగువకు ఉంటుంది.
- విపరీతంగా నీళ్లు తాగడం కిడ్నీలకు ప్రమాదకరం. ఎక్కువ పరిమాణంలోని నీళ్లను తాగడం వల్ల కిడ్నీలు అన్ని నీళ్లను త్వరితంగా వడగట్టలేకపోవడం మూలంగా రక్తంలోని సోడియం పలుచనవుతుంది. హైపోనట్రీమియా అనే ఈ స్థితిలో శరీరంలోని కణాలు వాపుకు గురవుతాయి.
- నొప్పి నివారణ మందులైన ఐబ్యుప్రోఫెన్, యాస్పిరిన్‌లు కిడ్నీలను దెబ్బతీస్తాయి.

ఈ పరీక్షలు అత్యవసరం

మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవాళ్లు, కుటుంబ చరిత్రలో కిడ్నీ వ్యాధులు ఉన్నవాళ్లు, పదే పదే కిడ్నీ స్టోన్లు ఏర్పడుతున్న వాళ్లు, గుండె జబ్బులున్నవాళ్లు ఏడాదికోసారి 'ఎస్టిమేటెడ్ జీఎఫ్ఆర్ టెస్ట్' చేయించుకుంటూ ఉండాలి. అలాగే మూత్రపిండాల పనితీరు మెరుగ్గానే ఉన్నప్పటికీ, మూత్రంలో ప్రొటీన్ లేదా రక్తం పోతూ ఉంటే, భవిష్యత్తులో కిడ్నీల సామర్థ్యం తగ్గే అవకాశం ఉంటుంది. కాబట్టి కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ పరీక్ష కూడా చేయించుకోవాలి. ఈ పరీక్షల్లో కిడ్నీ సామర్థ్యం 80 శాతానికంటే తగ్గితే, కారణాలను గుర్తించి, తగిన చికిత్స తీసుకోవాలి.

మధుమేహులు ఇలా....

మధుమేహులు రక్తంలోని చక్కెరలతో పాటు, అధిక రక్తపోటును కూడా అదుపులో ఉంచుకోవాలి. ఒకసారి మధుమేహం వచ్చిన తర్వాత, రక్తపోటు 130/80 దగ్గర ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా బీపిని తేలికగా తీసుకుంటూ ఉంటారు. మందులు వేసుకున్నా, వేసుకోకపోయినా బీపిలో ఎలాంటి తేడా తెలియడం లేదు కదా అని మందులు మానేస్తూ ఉంటారు. కానీ రక్తపోటు నిర్ధారణ అయిన తర్వాత వైద్యుల సూచన మేరకు మందులు వాడుకుంటూనే ఉండాలి. అలాగే మధుమేహులు ప్రతి మూడు నెలలకోసారి గ్లోకోజినేటెడ్ హీమోగ్లోబిన్ 7% తక్కువ కంటే తక్కువగా ఉండేలా చూసుకుంటూ ఉండాలి. కిడ్నీ డిసీజ్‌లో రక్తంలో హీమోగ్లోబిన్ తగ్గడం, శరీరంలో యాసిడ్, పొటాషియం శాతం పెరగడం లాంటివి జరుగుతూ ఉంటాయి. కాబట్టి కిడ్నీ డిసీజ్ దశ ఆధారంగా సమస్యలను సరిదిద్దుకోగలిగితే వ్యాధి చివరి దశకు చేరుకోకుండా ఉంటుంది.

కిడ్నీ కాపాడుకోవాలంటే...

- స్మోకర్ల మూత్రపిండాల సామర్థ్యం వేగంగా తగ్గిపోతుంది. కాబట్టి నికోటిన్ కలిగి ఉండే ధూమపానం, గుట్కా, పాన్ మసాలాలను మానేయాలి.
- కిడ్నీ జబ్బులు ఉన్న వాళ్లు పెయిన్ కిల్లర్స్‌కు దూరంగా ఉండాలి.
- ఏ రుగ్మత కోసం వైద్యులను సంప్రతించినా, తమకున్న కిడ్నీ జబ్బు గురించి చెప్పాలి.
- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి మూత్రపిండాల పనితీరును పరీక్షించుకుంటూ ఉండాలి.
- కుటుంబ చరిత్రలో కిడ్నీ సమస్య ఉన్నవాళ్లు, హృద్రోగులు, మధుమేహులు, హై బీపీ ఉన్న వాళ్లు కూడా ఏడాదికోసారి కిడ్నీలను పరీక్షించుకుంటూ ఉండాలి.
- రోజు మొత్తంలో తీసుకునే ఉప్పును 3 నుంచి 4 గ్రాములకు తగ్గించాలి.
- వారంలో ఐదు రోజుల పాటు, రోజుకు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- బరువును అదుపులో ఉంచుకోవాలి.
- కొవిడ్‌తో కిడ్నీ జబ్బుకుకు గురైనవాళ్లు ప్రతి మూడు నెలలకోసారి మూత్రంలో ప్రొటీన్ నష్టాన్ని గమనించుకుంటూ ఉండాలి. కిడ్నీ పనితీరును పరీక్షించుకుంటూ, దాని సామర్థ్యాన్ని కాపాడుకునే జాగ్రత్తలు పాటించాలి.
- కిడ్నీ సమస్య తీవ్రంగా ఉన్న వాళ్లు ప్రొటీన్ పరిమితి పాటించాలి.
- రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగాలి.

ఈ లక్షణాల మీద ఓ కన్నేసి...

- తరచూ మూత్రం రావడం లేదా మూత్రం తగ్గిపోవడం
- కాళ్ల వాపు
- రక్తపోటు పెరగడం
- తొందరగా నీరసించిపోవడం
- ఆయాసం రావడం
- ఫిట్స్
- రక్తంలో హీమోగ్లోబిన్ తగ్గిపోవడం

ఒకే కిడ్నీ ఉంటే...

వీళ్లు రెండు కిడ్నీలు ఉన్న వాళ్లు పాటించే జాగ్రత్తలనే పాటించాలి. వీళ్లలో ఉన్న ఒక్క కిడ్నీ ఎక్కువగా పని చేయడం వల్ల మూత్రంలో ప్రొటీన్ నష్టం జరుగుతూ ఉంటుంది. ఈ పరిస్థితి అరుదుగా ఏర్పడుతుంది. కాబట్టి ఏడాదికోసారి కిడ్నీలను పరీక్షించుకుంటూ ఉండాలి. కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ చేయించుకుంటూ ఉండాలి.

డాక్టర్ రాజశేఖర చక్రవర్తి
సీనియర్ నెఫ్రాలజిస్ట్ అండ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



ఇది నిశ్శబ్ద వ్యాధి. దీన్ని మొదట్లోనే కనిపెట్టగలిగితే, సమస్యను సరిదిద్దుకోగలిగే అవకాశం ఉంటుంది. కిడ్నీల సామర్థ్యం 60 మి.లీటర్లకు పడిపోయినప్పుడు కనిపెట్టినా, తిరిగి చికిత్సతో కిడ్నీలను కాపాడుకోవచ్చు.



ఫిట్‌నెస్

వ్యాయామం ఎంత సేపు?



వ్యక్తిగత ప్రాథామ్యాలు, లక్ష్యాలు, ఫిట్‌నెస్ మోతాదుల మీదే వ్యాయామ సమయం ఆధారపడి ఉంటుంది. అయితే గాయాలకూ, ప్రమాదాలకూ తావు లేని వ్యాయామ నిడివిని ఏ అంశాల ఆధారంగా ఎంచుకోవాలో తెలుసుకుందాం!

- వ్యాయామం చేయడం వెనకున్న లక్ష్యాన్ని బట్టి ఎలాంటి వ్యాయామం ఎంత సమయం పాటు చేయాలనేది తెలుసుకోవాలి. బరువు తగ్గడం, కండరాలను పెంచడం, కార్డియోవ్యాస్క్యులర్ ఆరోగ్యాన్ని పెంచుకోవడం.. ఇలా వ్యాయామ లక్ష్యాల ఆధారంగా అందుకు తగిన వ్యాయామాలనూ, నిడివినీ కేటాయించుకోవాలి.
- తక్కువ సమయం పాటు ఎక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలు చేయడం లేదా ఎక్కువ సమయం పాటు తక్కువ తీవ్రతతో కూడిన వ్యాయామాలు చేయడం వ్యక్తుల శరీర దారుఢ్యం, వయసు, ఆరోగ్య పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి అందుకు తగిన వ్యాయామ ప్రక్రియను ఎంచుకోవాలి.
- కొత్తగా వ్యాయామం మొదలుపెట్టేవాళ్లు తక్కువ నిడివితో, తేలికపాటి వ్యాయామాలు చేయాలి. వ్యాయామం అనుభవం ఉన్న వాళ్లు క్రమేపీ తీవ్రతను, వ్యాయామ నిడివినీ పెంచుకుంటూ పోవచ్చు.
- కొందరికి వారంలో ఒకటి రెండు రోజుల పాటు సుదీర్ఘమైన వ్యాయామాలను ఎంచుకుంటారు. ఇంకొందరు వారంలో ఐదు రోజుల పాటు తక్కువ సమయాలను వ్యాయామాలకు కేటాయిస్తూ ఉంటారు. తీరిక దొరికే సమయాల ఆధారంగా, ఈ రెండింటిలో ఎవరికి ఏది సూటవుతుందో తెలుసుకోవాలి.

అవేర్‌నెస్

శరీరం షాక్‌కు గురైతే?

షాక్ అనేది ప్రాణాంతకమైన పరిస్థితి. సరిపడా రక్తప్రసరణ జరగనప్పుడు శరీరం షాక్‌కు గురవుతుంది. సాధారణంగా ఐదు ప్రధాన షాక్‌లకు శరీరం గురవుతూ ఉంటుంది. అవేంటంటే...



- **అనాఫిలాక్టిక్ షాక్:** అలర్జీ వల్ల శరీరం షాకు గురయ్యే పరిస్థితి ఇది. పెన్సిలిన్, లేటెక్స్, తేనెటీగలు, నట్స్, షెల్‌ఫిష్ లాంటి పదార్థాలతో తలెత్తే షాక్‌లు ఈ కోవలోకి వస్తాయి.
- **కార్డియోజెనిక్:** హార్ట్ అటాక్ సమయంలో శరీరం షాక్‌కు గురయ్యే పరిస్థితి ఇది. అకస్మాత్తుగా గుండె వేగం పెరిగిపోయి, శ్వాస హెచ్చుతగ్గులకు లోనవుతుంది. చర్మం పాలిపోతుంది. విపరీతమైన చమటలు ఉంటాయి. మూత్రవిసర్జన ఆగిపోతుంది.
- **హైపోవోలమిక్:** శరీరం 20% అంతకు మించి రక్తాన్ని కోల్పోయినప్పుడు, ఈ షాక్‌కు గురవుతుంది. విపరీతమైన రక్తస్రావం. చమట, తల తిరుగుడు, అయోమయం, శ్వాస నెమ్మదించడం లాంటి లక్షణాలు ఉంటాయి. ఒకవేళ అంతర్గత రక్తస్రావమైతే, నలుపు రంగులో రక్తంతో కూడుకున్న మలం, పొట్ట నొప్పి, రక్తపు వాంతులు లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.
- **న్యూరోజెనిక్:** కేంద్రనాడీ వ్యవస్థ పాత్‌వేస్, మరీముఖ్యంగా వెన్నెముకకు దెబ్బతిన్నప్పుడు తలెత్తే షాక్ ఇది. ఇలాంటప్పుడు రక్తపోటు పడిపోయి, చర్మం ఎరుపు రంగులోకి మారుతుంది. గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది.
- **సెప్టిక్:** బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగస్ వల్ల శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్‌కు గురైతే శరీరం సెప్టిక్ షాక్‌కు గురవుతుంది. ఈ పరిస్థితినే సెప్సిస్ అంటారు. మూత్రవిసర్జన తగ్గడం, అయోమయం, మత్తు, శ్వాసకోశ సమస్యలు, జ్వరం ఉంటాయి.

ఆయుర్వేదం

ఆయుర్వేద చికిత్సా విధానంలో రుతుచర్య, రుతు (కాలం), చర్య (క్రమశిక్షణ)ను అనుసరిస్తూ ఉంటారు. వర్షాకాలంలో రుతుపరమైన మార్పులకు గురయ్యే శరీరానికి సాంత్వన సమకూర్చడం కోసం ఆహారపుటలవాట్లలో మార్పులు చేసుకోవాలని ఆయుర్వేదం సూచిస్తోంది.

వానల్లో ఆహారం ఆచితూచి...

వర్షాకాలంలో శక్తి సన్నగిల్లుతుంది. కాబట్టి శక్తిని సమకూర్చి, వానాకాల వ్యాధులు దరి చేరకుండా ఉండేలా వ్యాధినిరోధకశక్తిని పెంచే పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలి. అవేంటంటే...

నెయ్యి

నెయ్యిలో ఫ్యాటీ యాసిడ్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని విషాలను హరించి, వ్యాధినిరోధకశక్తిని పెంచి శరీరాన్ని బలపరుస్తాయి. కాబట్టి వానాకాలం తీసుకునే ఆహారంలో తప్పక నేయిని చేర్చాలి. అయితే ఆవు నెయ్యిని ఎంచుకుంటే, జీర్ణశక్తి కూడా మెరుగై, అజీర్తి సమస్యలు తలెత్తకుండా ఉంటాయి.

అల్పాహారాలు

వానలు కురుస్తూ వాతావరణం చల్లగా మారిన సమయంలో వేడి వేడిగా పకోడీలు, బజ్జీలు తినాలనిపిస్తుంది. ఈ రుతువులో శరీరానికి కొవ్వు అవసరం ఎక్కువ కాబట్టి, మనసు అలాంటి అల్పాహారాల వైపు మళ్లడం సహజం. అయితే వీటిని పరిమితంగా తీసుకుంటూ డ్రైఫ్రూట్స్, నట్స్‌ను ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యకరం. వీటితో శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్లు సమకూరి, శరీరంలోని ఆమ్లం తగ్గి, క్షారం పెరుగుతుంది.

సుగంధ ద్రవ్యాలు

ఎండలతో వేడెక్కిన వాతావరణం వానలతో చల్లబడడంతో, వ్యాధికారక క్రిములు విజృంభించడం మొదలుపెడతాయి. వీటితో సంక్రమించే వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే ఆహారంలో సుగంధ ద్రవ్యాల వాడకాన్ని పెంచాలి. వీటితో శరీరంలో అగ్ని పెరిగి, వానాకాలంలో వేధించే జలుబు, దగ్గు, డయేరియా, ఫ్లూల నుంచి రక్షణ దక్కుతుంది.



తేనె

వానాకాలంలో తరచూ తీపి తినాలనిపిస్తుంది. ఈ వాంఛను తీర్చుకోవడం కోసం సహజసిద్ధమైన తేనెను ఎంచుకోవచ్చు. సాధారణంగా తేనె శరీరంలో పిత్తాన్ని పెంచుతుంది. కానీ వానాకాలంలో వాతం పెరుగుతుంది కాబట్టి తేనెను పరిమితంగా తీసుకోవచ్చు. తేనె శరీరంలోని బ్యాక్టీరియా, వైరస్‌లను హరిస్తుంది.

ఇవి పరిమితం

వానాకాలంలో కొన్ని పదార్థాలను పరిమితం చేసుకోవాలి. అవేంటంటే...

పెరుగు: శరీరాన్ని చల్లబరచడం పెరుగు స్వభావం. కాబట్టి పెరుగుతో శరీరంలో వాత దోషం పెరుగుతుంది. వానాకాలంలో స్వతహాగానే వాత దోషం పెరుగుతుంది. కాబట్టి అదనంగా పెరుగు తినడం వల్ల ఈ దోషం తీవ్రమయ్యే అవకాశాలుంటాయి. దీంతో పాటే పిత్త దోషం కూడా పెరిగి వానాకాల సమస్యలు మొదలవుతాయి. కాబట్టి ఈ కాలంలో పెరుగును పరిమితంగా తినాలి.

సలాడ్: బ్యాక్టీరియా, వైరస్‌లు పచ్చి కూరగాయల ద్వారా శరీరంలోకి చొరబడే అవకాశాలు ఈ కాలంలో ఎక్కువ. కలుషిత ఆహారం ద్వారా జీర్ణ సమస్యలు, విరోచనాలు, వాంతులు వేధించే అవకాశాలు కూడా ఈ కాలంలో ఎక్కువే! కాబట్టి వానాకాలంలో ముందుగానే తరిగి పెట్టుకునే కాయగూరలు, సలాడ్లకు దూరంగా ఉండాలి.

ఆకుకూరలు: ఈ కాలంలో వాతావరణంలో తేమ ఎక్కువ. వానలతో ఆకుకూరలు విపరీతంగా తడిచిపోయి, కుళ్లిపోయే అవకాశాలు కూడా ఎక్కువే! ఇలాంటి ఆకుకూరలతో ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. కాబట్టి ఇంట్లో పెంచిన తాజా ఆకుకూరలు మినహా, మార్కెట్లో దొరికే ఆకుకూరలు తినకపోవడమే మేలు.

మాంసాహాహారం: ఈ కాలంలో వాత దోషం పెరగడం వల్ల జీర్ణవ్యవస్థ ప్రక్రియ మందగించి ఉంటుంది. కాబట్టి మాంసాహారాన్ని వీలైనంత పరిమితం చేయాలి. జీర్ణం కావడానికి ఎక్కువ శక్తిని సంగ్రహించే మాంసాహారం వల్ల శరీరంలో ఆమం పెరిగే ప్రమాదం కూడా ఉంటుంది.

లైఫ్ స్టైల్

షిఫ్టుల్లో పర్‌ఫెక్ట్‌గా...

షిఫ్టుల్లో పని చేసేవాళ్ల ఆహారవేళలు అస్తవ్యస్థంగా ఉంటాయి. కాబట్టి ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలు వాళ్లకు ఎక్కువే! కాబట్టి షిఫ్టు సిస్టంకు తగ్గట్టు జీవనశైలిని ఆరోగ్యకరంగా ఎలా మలుచుకోవాలో తెలుసుకోవడం అవసరం.

సమతులాహారం: పిండిపదార్థాలు, ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగి ఉండే ఆహారం తీసుకుంటే, శక్తి మోతాదులు హెచ్చుతగ్గులకు లోనవకుండా ఉంటాయి.

హైడ్రేషన్: షిఫ్టులో డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండడం కోసం నీళ్లు తాగుతూనే ఉండాలి.



స్వల్ప భోజనం: నిస్సత్తువ ఆవరించకుండా ఉండడం కోసం తరచూ, స్వల్ప భోజనాలు చేయాలి.

పోషకాలు: పండ్లు, కూరగాయలు, పొట్టుతీయని ధాన్యాలు, చికెన్, గుడ్లు ఉండేలా చూసుకోవాలి.

కెఫీన్: తరచూ కూల్‌డ్రింక్స్, కాఫీల జోలికి వెళ్లకూడదు. షిఫ్ట్ ముగిసే సమయంలో వీటిని తీసుకోవడం వల్ల రాత్రి నిద్ర కరువవుతుంది.

చక్కెర: తీయగా ఉండే స్నాక్స్, కూల్‌డ్రింక్స్ తీసుకుంటే శక్తి హెచ్చుతగ్గులకు లోనవుతుంది. కాబట్టి క్యాంటీన్స్‌లో దొరికే కేక్స్, బిస్కెట్స్‌కు దూరంగా ఉండాలి.

ప్రాసెస్డ్ ఫుడ్స్: వీటితో మెటబాలిక్ ఆరోగ్యం దెబ్బతింటుంది. కాబట్టి మైదాతో తయారైన పదార్థాలను తగ్గించాలి.

అర్థ రాత్రి భోజనం: లేట్ నైట్ మీల్స్ మానేయాలి. వీటితో నిద్రాభంగం. కొవ్వు పెరుగుతుంది.

డయాబెటిక్ కేర్

ఆహారంతో చక్కెర అదుపు

ఆహార వర్గాల మధ్య తేడాలు, గ్లైసెమిక్ మోతాదుల మీద వాటి ప్రభావాలు, వాటిలోని పోషక విలువల మీద అవగాహన ఏర్పరుచుకుని అందుకు తగిన ఆహారాన్ని ఎంచుకోగలిగితే చక్కెర అదుపు తప్పకుండా ఉంటుంది.

కుటుంబ చరిత్ర: కుటుంబ చరిత్ర, జెనెటిక్ మేకప్‌లను అర్థం చేసుకోగలిగితే, మన శరీరం పనితీరు అవగతమవుతుంది. పరిసరాలు, జీవనశైలి, ఆహారపుటలవాట్ల ఆధారంగా మధుమేహం అదుపులో ఉండే ఆహారశైలీ, వ్యాయామాలను రూపొందించుకోవాలి.

కార్బొహైడ్రేట్ కౌంట్: తీసుకునే ఆహారం ద్వారా అందుతున్న పిండిపదార్థాలు, వాటితో పెరిగే చక్కెర మోతాదుల పట్ల కూడా అవగాహన ఏర్పరుచుకోవాలి. చక్కెరను క్రమం తప్పకుండా ఉంచగలిగే కార్బొహైడ్రేట్ల మోతాదును, అందుకోసం తీసుకోవలసిన ఆహార మోతాదును నిర్ణయించుకోవాలి.



గ్లైసెమిక్ ఛాయిస్: రక్తంలోకి చక్కెరను నెమ్మదిగా విడుదల చేసే పదార్థాలను ఎంచుకోవాలి. అందుకోసం వీలైనంత తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే చిక్కుళ్లు, నాన్ స్టార్చీ కూరగాయలు, పాలిష్ పట్టని ధాన్యాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

పోర్షన్ కంట్రోల్: చక్కెర అదుపులో ఉండడం కోసం తీసుకుంటున్న ఆహార పరిమితి మీద నియంత్రణ ఉండాలి. లీన్ ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే పదార్థాలను పరిమితిలో తీసుకుంటూ ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోవడం మానేయాలి.

యాక్షన్ షో రీల్

రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ బచ్చన్' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా షో రీల్‌ను సోమవారం విడుదల చేశారు. ఎలాంటి డైలాగులు లేకపోవడం ఈ రీల్ ప్రత్యేకత. పాత్రలను పరిచయం చేస్తూ ఆసక్తిక రంగా ఇది ఉంది. రవితేజ స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో కనిపించారు. ఆయన గెటప్ క్లాస్‌టచ్‌తో ఉంది. ఆయన పాల్గొన్న యాక్షన్ సీన్లు మాస్‌ని ఆకట్టు కునేలా ఉన్నాయి. జగపతిబాబు ఓల్డ్ ఫెరోషియస్ మ్యాన్‌గా కనిపించారు. రీల్ చివరిలో రవితేజ అమితాబ్ బచ్చన్‌ను ఇమిటేట్ చేసే సీన్ ఆసక్తిక రంగా ఉంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సచిన్ ఖేడ్కర్ కీలక పాత్రను పోషిస్తున్నారు. వీరిద్దరూ కూడా షో రీల్‌లో కనిపిం చారు. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తామని చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. 'నామ్‌తో సునా హో గా' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, ఫొటోగ్రఫీ: ఆయనంక బోస్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



'భైరవ యాంథమ్' వచ్చేసింది



ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' నుంచి మొదటి సింగిల్ 'భైరవ యాంథమ్' పూర్తి లిరిక్ వీడియో సోమవారం విడుదలైంది. సినిమా ప్రచారంలో భాగంగా ఈ పాటను విడుదల చేసిన మేకర్స్. ఈ సాంగ్‌ను భారతదేశపు అతిపెద్ద పాటగా పేర్కొన్నారు. ప్రభాస్, పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఈ పాటలో ఆకట్టుకునే వేషధారణతో తలపాగాలు ధరించి సందడి చేశారు. కథానాయకుడి పాత్ర తీరు తెన్నులను ప్రేక్షకులకు పరిచయం చేసేలా సాగే ఈ పాటను రామజోగయ్య శాస్త్రి, కుమార్ రాశారు. తెలుగుతో పాటు హిందీ లిరిక్స్ కలగలసిన ఈ సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే, విజయనారాయణ్ సంయుక్తంగా ఆలపించగా, సంతోశ్ నారాయణన్ సంగీతం అందించారు. కాగా, ఈ సినిమాకు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీదత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి భారీ తారాగణం నటించిన 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.



డేట్ మారింది!

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప 2' చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ వై ఇంతకుముందు ప్రకటించారు. అయితే షూటింగ్ పార్ట్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడం, క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, టెక్నికల్‌గా మరింత అత్యున్నత విలువలతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో విడుదల తేదీని మార్చామనీ, డిసెంబర్ 6న సినిమా రిలీజ్ అవుతుందని నిర్మాతలు తాజాగా వెల్లడించారు. రశ్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇంతవరకూ విడుదలైన 'పుష్పరాజ్' టైటిల్ సాంగ్, 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' అనే కపుల్ సాంగ్ సంచలనం సృష్టించాయి. ఈ రెండు పాటల తర్వాత సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. 'పుష్ప 2' కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అందుకే దర్శకుడు సుకుమార్ విడుదల విషయంలో తొందర పడకుండా మేకింగ్ విషయంలో మరింత శ్రద్ధ తీసుకుని చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.





వరుణ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది

వరుణ్ సందేశ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'నింద'. కాండ్రకోట మిస్టరీ ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నిఖిల్ మాట్లాడుతూ "ఈ సినిమా వరుణ్ సందేశ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది. అందరూ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి" అని కోరారు. "ఇన్నేళ్ల కెరీర్‌లో నా మనసుకు బాగా దగ్గరైన చిత్రం 'నింద'" అని వరుణ్ సందేశ్ చెప్పారు. "'నింద' మూవీ వరుణ్ కమ్‌బ్యాక్‌కు నాంది పలుకుతుంది" అని దర్శకనిర్మాత రాజేశ్ జగన్నాథం అన్నారు.

అమిష్టగా దర్శన రాజేందర్

'సినిమా బండి' చిత్రంతో సెన్సిబుల్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందిన ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కిస్తోన్న చిత్రం 'పరదా'. మహిళా ప్రాధాన్యమున్న కథతో రూపొందుతున్న ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, మలయాళ చిత్రం 'హృదయమ్' ఫేమ్ దర్శన రాజేంద్రన్, సంగీత నటిస్తున్నారు. శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మిస్తున్నారు. సోమవారం దర్శన రాజేంద్రన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌తో పాటు ఓ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. సినిమాలో దర్శన పోషిస్తున్న పాత్ర పేరు 'అమిష్ట'. ఈ చిత్రానికి ఎడిటర్: ధర్మేంద్ర కాకరాల, డీఓపీ: మృదుల్ సుజిత్‌సేన్, సంగీతం: గోపి సుందర్.



ఎర్ర గులాబీ

మలయాళ నటి హనీ రోజ్ లీడ్ రోల్ పోషిస్తున్న 'రేచల్' చిత్రం టీజర్ విడుదలైంది. వయలెన్స్, బ్లడ్ షెడ్ కలిగిన కథాంశమని ఈ టీజర్ చూడగానే అర్థమవుతుంది. నటిగా హనీ రోజ్‌కు ఉన్న అనుభవం, నైపుణ్యాన్ని ఈ సినిమా ఉపయోగించుకుంటోందనే విషయాన్ని ఈ టీజర్ వెల్లడించింది. నూతన దర్శకురాలు ఆనందిని బాలాను పరిచయం చేస్తూ బాదుషా ఎన్.ఎం, రాజన్ చిరాయిల్ నిర్మిస్తున్నారు. దర్శకుడు అబ్రిడ్ షైన్ ఈ సినిమాకు సహ నిర్మాత. మలయాళంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. రాహుల్ మణప్పట్టు కథ అందించిన ఈ చిత్రానికి ఆయనతో పాటు అబ్రిడ్ షైన్ కూడా స్క్రీన్‌ప్లే తయారు చేశారు.



కథ విన్నప్పుడే.. సక్సెస్‌ను ఊహించా



విజయ్ సేతుపతి

తెలుగులో మంచి ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న అతికొద్ది తమిళ నటుల్లో విజయ్ సేతుపతి ఒకరు. ఆయన నటించిన 50వ చిత్రం 'మహరాజా'. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, అభిరామి కీలక పాత్రలు పోషించారు. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుని.. హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా సోమవారం చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మూవీ డైరెక్టర్ నిథిలన్ స్వామినాథన్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని ఎమోషన్‌తో ప్రేక్షకులు చివరివరకూ ప్రయాణిస్తారు. ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషాన్నిస్తోంది. ఈ సినిమాని ఇంతలా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు" అని అన్నారు. "నన్ను సినిమా సినిమాకి మరింతగా ప్రేమిస్తున్న తెలుగు ప్రేక్షకులకి నా కృతజ్ఞతలు. ఈ సినిమా కథ విన్నప్పుడే ఇది అందరి మనసులని గెలిచే సినిమా అవుతుందని ఊహించా. ఈ సక్సెస్‌ని ప్రేక్షకులకి అంకితం చేస్తున్నాను" అని విజయ్ సేతుపతి చెప్పారు.

నాకంత సీన్ లేదు

కథానాయికగా, గాయనిగా, రచయిత్రిగా, డైరెక్టర్‌గా, నిర్మాతగా తండ్రికి తగ్గ కూతురు అనిపించుకుంటున్నారు శ్రుతి హాసన్. ఫాదర్స్ డే సందర్భంగా తన తండ్రి కమల్ హాసన్‌ను పొగడ్తలతో ముంచెత్తారు శ్రుతి. "నా జీవితంలో మొదటి గురువు.. ఆదర్శం మీరే నాన్నా. విభిన్న రంగాల్లో రాణించొచ్చనే స్ఫూర్తినిచ్చింది మీరే. నటిగా మీ అడుగుజాడలను ఎలా ఫాలో అయ్యానో.. ఓ దర్శకురాలిగానూ మిమ్మల్నే అనుసరిస్తా. నిజానికి నాకు దర్శకత్వం అంటే ఆసక్తి మిమ్మల్ని సెట్‌లో డైరెక్టర్‌గా చూసినప్పుడే ఏర్పడింది" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓ అభిమాని "మీ తండ్రి బయోపిక్ మీరు చేసే అవకాశం ఉందా" అని అడిగిన ప్రశ్నకు "కచ్చితంగా కాదు. నేను ఆ పనికి సరైన వ్యక్తిని అనుకోవడం లేదు. నిజం చెప్పాలంటే నాకంత సీన్ లేదు. ఎందుకంటే ఇండస్ట్రీలో నాకంటే అద్భుతమైన ప్రతిభ ఉన్నవారు.. అర్హత ఉన్నవారు చాలా మందే ఉన్నారు" అని శ్రుతి బదులిచ్చారు.



చిత్ర పరిశ్రమ నేపథ్యంలో సినిమా

అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఇట్లు.. మీ సినిమా' ఈ నెల 21న విడుదల కానుంది. నలుగురు యువకులు సినిమా మీదున్న ఫ్యాషన్‌తో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎటువంటి సవాళ్లు ఎదుర్కొన్నారు.. అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రమిది. లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి హరీశ్ చావా దర్శకుడు.



నోరి నాగప్రసాద్ నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్ చావా మాట్లాడుతూ 'సినిమా కథ కోసం అన్వేషిస్తున్నప్పుడు ఏ కథో ఎందుకు.. సినిమా ఇండస్ట్రీలో పడే ఇబ్బందుల గురించి సినిమా తీద్దాం. అన్నారు మా నిర్మాత. పరిశ్రమలోకి అడుగుపెట్టే వారికి అవగాహన కల్పించే విధంగా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు. 'పరిశ్రమలోకి వచ్చే కొత్త వాళ్లు పడే ఇబ్బందుల్ని ఆసక్తికరంగా, ప్రేక్షకులకు నచ్చే రీతిలో చూపించాం. ఈ నెల 21న విడుదల చేస్తున్నాం. చిన్న సినిమా కనుక దయచేసి అందరూ థియేటర్లకు వెళ్లి చూడండి' అని కోరారు నిర్మాత నాగప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరో అభిరామ్, హీరోయిన్ వెన్నెల, తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.



అది ఫేక్ అకౌంట్

'మిస్టర్ అండ్ మిస్సెస్ మహీ' చిత్రంతో సూపర్ హిట్ కొట్టిన ఆనందంలో ఉన్నారు బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్. తాజాగా ఆ సంతోషాన్ని ఆవిరి చేసేలా ఓ సంఘటన జరిగింది. అదేంటంటే ఆమె ఎక్స్ ఖాతా నుంచి అశ్లీల ఫొటోలు ప్రత్యక్షమవ్వడం. దీంతో ఒక్కసారిగా ఆమెతో పాటు జాన్వీ ఫ్యాన్స్ ఆందోళనకు గురయ్యారు. దీనిపై స్పందించిన జాన్వీ టీమ్.. ఆ ఫొటోలు పోస్ట్ చేసింది ఫేక్ అకౌంట్ నుంచి అని.. అసలు జాన్వీకి ఎక్స్ ఖాతానే లేదని స్పష్టతనిచ్చింది. సోషల్ మీడియాలో ఇలాంటి నకిలీ ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బిజినెస్

హైదరాబాద్ ● మంగళవారం 18 జూన్ 2024

వచ్చే మార్చి నాటికి

హ్యుండయ్ క్రెటా ఈవీ

భవిష్యత్‌లో మరో 3 ఈవీలు సైతం.. ఐపీఓ పత్రాల్లో వెల్లడించిన కంపెనీ



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో క్రెటా ఎలక్ట్రిక్ వెర్షన్ సహా భవిష్యత్‌లో నాలుగు ఈవీ మోడళ్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) తెలిపింది. మెగా పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ సెబీకి సమర్పించిన ప్రాథమిక ముసాయిదా పత్రాల్లో (డీఆర్‌హెచ్‌పీ) కంపెనీ ఈ విషయాన్ని వెల్లడించింది. హ్యుండయ్‌కి చెందిన మిడ్ సైజ్ ఎస్‌యూవీ క్రెటా.. అత్యధికంగా అమ్ముడవుతున్న కంపెనీ మోడళ్లలో ఒకటి. 1996లో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్ఎంఐఎల్.. అన్ని విభాగాల్లో కలిపి 13 మోడళ్లను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోంది. అందులో రెండు ఈవీలు కూడా ఉన్నాయి. ఐయోనిక్ క్యూ5 రేటు రూ.45 లక్షలు, కోనా ఎలక్ట్రిక్ ధర రూ.24 లక్షల స్థాయిలో ఉంది. ప్రస్తుతం ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లనే విక్రయిస్తోన్న ఈ కంపెనీ ఇక అందుబాటు ధరల్లో లభించే ఈవీలను మార్కెట్లోకి తేవాలని భావిస్తోంది. ధర విషయంలో ఈవీ మోడళ్ల పోటీ సామర్థ్యాన్ని మరింత పెంచాలని చూస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. ఇందులో భాగంగా సెల్స్, బ్యాటరీ ప్యాక్, పవర్ ఎలక్ట్రానిక్స్, డ్రైవ్‌ట్రైన్స్ వంటి కీలక విడిభాగాలను దేశీయంగా సేకరించడంతో పాటు స్థానిక ఈవీ సరఫరా వ్యవస్థను నిర్మించుకోవాలనుకుంటున్నట్లు తెలిపింది.

హెచ్ఎంఐఎల్ చెన్నైలోని తన ప్లాంట్‌లో కొంత భాగాన్ని ఈవీ బ్యాటరీల అసెంబ్లింగ్ కోసం మోబిస్‌కు లీజుకిచ్చింది. మోబిస్ కూడా హ్యుండయ్ గ్రూప్ కంపెనీయే. ఈ సంస్థ తయారు చేసే ఈవీ బ్యాటరీలను హెచ్ఎంఐఎల్‌కే సరఫరా చేస్తోంది. హ్యుండయ్ మోటార్‌కు బ్యాటరీ పాక్స్ సేకరణ వ్యయం గణనీయంగా తగ్గేందుకు ఇది దోహదపడనుంది. ఈవీ సరఫరా వ్యవస్థను స్థానికీకరించేందుకు మరిన్ని దేశీయ, అంతర్జాతీయ ఈవీ పవర్ ఎలక్ట్రానిక్ వెండార్లతో జతకట్టనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో హెచ్ఎంఐఎల్ పేర్కొంది. అంతేకాదు, ఈ మార్చి చివరినాటికి కంపెనీ దేశంలో 11 ఎలక్ట్రిక్ కార్ల చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. దేశంలో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని నగరాలతో పాటు రహదారుల ప్రక్కన చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు కంపెనీ తెలిపింది.

హెచ్ఎంఐఎల్ గత వారాంతంలో సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ 17.5 శాతం వాటాకు సమానమైన 14,21,94,700 ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. తద్వారా కనీసం రూ.25,000 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. అదే గనుక జరిగితే, దేశంలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్ కానుంది. గతంలో ఐపీఓ ద్వారా ఎల్ఐసీ సమీకరించిన రూ.21,000 కోట్ల మొత్తాన్ని మించిపోనుంది. అంతేకాదు, రెండు దశాబ్దాలకు పైగా కాలంలో ఐపీఓకు రాబోతున్న కార్ల కంపెనీ కూడా ఇదే. చివరగా, 2003లో మారుతి సుజుకీ ఇండియా పబ్లిక్ ఇష్యూకు వచ్చింది.

రూ.21 లక్షల కోట్లకు..

» ఐదేళ్లలో రెట్టింపు కానున్న ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ

న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ వచ్చే ఐదేళ్లలో రెట్టింపై 25,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.21 లక్షల కోట్లు) స్థాయికి చేరుకోవచ్చని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు అన్నారు. ప్రస్తుతం దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ 12,500-13,000 కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది. అంతేకాదు, నిరుద్యోగ సమస్య పరిష్కారాల్లో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారీగా ఉద్యోగాల కల్పన జరిగేందుకు దోహదపడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రిత్వ వర్గాలు తెలిపాయి. ఈ రంగంలో ప్రస్తుతం 25 లక్షల మంది పనిచేస్తుండగా.. వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్యను 50 లక్షలకు పెంచాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు పథకాల ద్వారా రూ.76,000 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను ప్రకటించింది.

◆ సాలిడ్ సర్ఫేస్ తయారీదారు డ్యూరాలక్స్ టాప్ సర్ఫేస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 19న ప్రారంభమై 21న ముగియనుంది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు ధరను రూ.65-68గా ఖరారు చేసింది. కొత్తగా 42 లక్షల షేర్లను జారీ చేయటం ద్వారా రూ.28.56 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.12.24 కోట్ల విలువైన 18 లక్షల షేర్లను కంపెనీ సమీకరించనుంది.

సబ్బులు, హెయిర్ ఆయిల్స్

ధరలు పైపైకి

» ఎఫ్ఎంసీజీ కంపెనీలపై ఖర్చుల భారం

» ఆ భారమంతా వినియోగదారులకు బదిలీ

» 2 నుంచి 17% వరకు వడ్డింపు



న్యూఢిల్లీ: నిత్య జీవితంలో విరివిగా ఉపయోగించే ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) ఉత్పత్తులు మరింత భారంగా మారాయి. వీటిని ఉత్పత్తి చేసే కంపెనీలు గత రెండు మూడు నెలల్లో వీటి ధరలను 2 నుంచి 17 శాతం వరకు పెంచేశాయి. ముడి పదార్థాల ధరలు పెరిగినందున, అందులో కొంతైనా వినియోగదారులకు బదిలీ చేయక తప్పలేదని కంపెనీలు చెబుతున్నాయి. దీంతో సబ్బులు, బాడీ వాష్‌లు, హెయిర్ ఆయిల్స్, ఎంపిక చేసిన కొన్ని ఆహార ఉత్పత్తుల ధరలు మరింత భారంగా మారాయి. తమ లాభాలను కాపాడుకునేందుకు ధరల పెంపు తప్పడం లేదని కంపెనీలు చెబుతున్నాయి.

ఎంత భారమంటే ?

గత రెండు నెలల్లో సబ్బులు, బాడీ వాష్‌ల ధర 2 నుంచి 9 శాతం పెరిగాయి. హెయిర్ ఆయిల్స్ ధర 8 నుంచి 11 శాతం పెరిగింది. కొన్ని ఆహార ఉత్పత్తుల ధరలను కంపెనీలు 3 నుంచి 17 శాతం పెంచేశాయి. కీలక ముడి పదార్థాల ధరలు తగ్గడంతో గత ఏడాది కాలంగా ఎఫ్ఎంసీజీ కంపెనీలు ధరల పెంపునకు విరామం ప్రకటించాయి. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం పామాయిల్ ధర తక్కువగానే ఉంది. అయితే పాలు, పంచదార, కాఫీ, కొబ్బరి, బార్లీ వంటి ప్రధాన ముడి పదార్థాల ధరలు మాత్రం పెరిగాయి. దీంతో తమ ఉత్పత్తుల ధర పెంచడం ద్వారా ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఆ ఒత్తిడి తట్టుకుంటున్నాయి.

రూ.89,000 కోట్లు..

» 2023-24లో యూఏఈ నుంచి దిగుమతైన బంగారం, వెండి మొత్తమిది

న్యూఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి భారత్‌కు పసిడి, వెండి దిగుమతులు భారీగా పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఈ దేశం నుంచి మన దేశానికి 1,070 కోట్ల డాలర్ల (సుమారు రూ.89,000 కోట్లు) విలువైన బంగారం, వెండి దిగుమతయ్యాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 210% ఎక్కువ. భారత-యూఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) ఇందుకు ప్రధాన కారణం. ఈ ఒప్పంద కింద మన దేశం.. యూఏఈ నుంచి దిగుమతయ్యే వెండి మీద 7%, బంగారంపై 1% దిగుమతి సుంకం రాయితీ కల్పిస్తోంది. ఈ ఒప్పందం కింద ఎంత వెండినైనా 7% సుంకం రాయితీతో దిగుమతి చేసుకోవచ్చు. బంగారం దిగుమతులను మాత్రం 160 టన్నులకు పరిమితం చేశారు. దీంతో యూఏఈ నుంచి పెద్ద ఎత్తున వెండి దిగుమతవుతోంది.

డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచం

» పరపతి వృద్ధికి ఢోకా లేదు

» ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా

న్యూఢిల్లీ: డిపాజిట్లపై ప్రస్తుతానికి వడ్డీ రేట్లు పెంచే యోచన లేదని దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రకటించింది. బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా ఈ విషయం స్పష్టం చేశారు. ప్రామాణిక నగదు నిల్వల నిష్పత్తి (ఎస్ఎల్ఆర్) ఉండాల్సిన దానికంటే రూ.3.5 లక్షల కోట్ల నుంచి 4 లక్షల కోట్లు అధికంగా ఉన్నందున, ప్రస్తుతం తమకు ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. ఈ కారణంగా వడ్డీ రేట్లు పెంచి, అదనంగా డిపాజిట్లు సేకరించాల్సిన అవసరం లేదన్నారు. అయినా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం డిపాజిట్లు 12-13% పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తమ రుణాల మంజూరు వృద్ధి రేటు 14 నుంచి 15% వరకు ఉంటుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం స్థూల, నికర మొండి బకాయిలు మరింత తగ్గే అవకాశం ఉందన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,330 ▼	66,300 ▼	95,700 ▲
ముంబై	71,866 ▲	65,829 ▲	87,833 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	480
వరంగల్	497	గోదావరి	475
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	139	విజయవాడ	145
వరంగల్	139	గుంటూరు	145
కరీంనగర్	139	ఒంగోలు	145
మహబూబ్‌నగర్	139	చిత్తూరు	140
కర్నూలు	139	నెల్లూరు	140
విశాఖపట్నం	136	అనంతపురం	145
గోదావరి	145		

హైదరాబాద్‌లో 1ఎం1బీ నైపుణ్య శిక్షణ కేంద్రం

» సేల్స్‌ఫోర్స్ భాగస్వామ్యంతో ఏర్పాటు

» 2030 నాటికి తెలంగాణలో లక్ష మందికి శిక్షణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం) సేవల అగ్రగామి సేల్స్‌ఫోర్స్‌తో వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ (1ఎం1బీ) ఫౌండేషన్ జతకట్టింది. సంయుక్త భాగస్వామ్యంలో, తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో 1ఎం1బీ గ్రీన్ స్కిల్స్ అకాడమీకి చెందిన తొలి భౌతిక కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతున్నాయి. ఈ కేంద్రం ద్వారా 2030 నాటికి తెలంగాణకు చెందిన లక్ష మంది యువతకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాల్లో శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యం. అంతేకాదు, వారికి ఉద్యోగాల కల్పనకు సైతం ఈ అకాడమీ సాయపడనుంది. ఈ ఏడాది తొలినాళ్లలో తెలంగాణ ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖతో 1ఎం1బీ ఫౌండేషన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా రాష్ట్రంలోని కాలేజీ విద్యార్థులకు ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలో శిక్షణ ఇచ్చేందుకు ఇప్పటికే 1ఎం1బీ గ్రీన్ స్కిల్స్ అకాడమీని వర్చువల్‌గా ఏర్పాటు చేసింది.

గరిష్ఠ స్థాయిల్లో నిరోధం!

ఈ వారం స్టాక్ మార్కెట్ సూచీలు మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరటంతో స్వల్ప పుల్‌బ్యాక్‌కు వీలుంది. ఒకవేళ అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే మరింత పెరుగుతాయి. ఈ వారం నిఫ్టీకి 23,250 వద్ద మద్దతు స్థాయి, 23,500 వద్ద నిరోధ స్థాయిలున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

ఐషర్ మోటార్స్: మూడు నెలల నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో ఈ మధ్యనే పుల్‌బ్యాక్ వచ్చింది. అయితే మళ్లీ జోరందుకుని సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని అధిగమించింది. నిఫ్టీతో పోల్చితే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. గత శుక్రవారం 2.78 శాతం లాభంతో రూ.4,935 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.4,900 స్థాయిల్లో ప్రవేశించి రూ.5,050/5,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,840 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

టైటాన్: ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు మళ్లీ పుంజుకుంటోంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. రూ.3,200 స్థాయిలో డబుల్ బాటమ్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 1.67 శాతం లాభంతో రూ.3,530 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,510/3,520 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.3,660/3,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సిప్లా: గడచిన ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ షేరు బలంగా పుంజుకుంది. రూ.1,330 స్థాయిలో డబుల్ బాటమ్ ఏర్పడిన తర్వాత డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరిగింది. గత శుక్రవారం రూ.1,564 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసి చివరకు 1.39 శాతం లాభంతో రూ.1,566 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,550/1,540 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.1,665/1,725 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,525 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 16 శాతం మేరకు కరెక్షన్ జరిగింది. ఈ నెల 5 నుంచి మెరుగైన ట్రేడింగ్ వాల్యూమ్‌తో షేర్లు పుంజుకుంటున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ కూడా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 1.38 శాతం లాభంతో రూ.1,469 వద్ద స్థిరపడింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,460 స్థాయిలో ఎంటరై రూ.1,550/1,670 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,430 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండియా హోటల్స్: ఈ షేరుకు చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. క్రితం వారం ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. భారీ వాల్యూమ్‌తో షేరు ధరల పెరుగుతోంది. మరోసారి జీవితకాల గరిష్ఠాన్ని అధిగమించే దిశగా సాగుతోంది. గత శుక్రవారం 4.17% లాభంతో రూ.613 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.600/575 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని 650/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ. 545 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి

స్పోర్ట్స్

టీ20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ × అఫ్ఘానిస్థాన్ (ఉ. 6. గం.)



ఫెర్గూసన్ (4-4-0-3)

ఫెర్గూసన్ రికార్డు

- 24 డాట్ బాల్స్‌తో 3 వికెట్లు
- పీఎన్‌జీపై న్యూజిలాండ్ విజయం

టరౌబా (ట్రినిడాడ్): న్యూజిలాండ్ పేసర్ లోకీ ఫెర్గూసన్ (4-4-0-3) చరిత్ర సృష్టించాడు. టీ20 వరల్డ్ కప్ టోర్నీలో నాలుగు ఓవర్ల కోటాలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండానే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు. అతడి అద్భుత ప్రదర్శనతో సోమవారం గ్రూప్ 'సి'లో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో కివీస్ 7 వికెట్ల తేడాతో పపువా న్యూగినీపై నెగ్గింది. ఓవరాల్‌గా అంతర్జాతీయ టీ20ల్లో కెనడా కెప్టెన్ సాద్ బిన్ జఫార్ పనామాపై 2021లోనే ఈ ఫీట్ సాధించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పీఎన్‌జీ 19.4 ఓవర్లలో 78 పరుగులకే కుప్పకూలింది. అమిని (17), వనువా (14) రాణించారు. సౌథీ, బౌల్ట్, సోధీలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 12.2 ఓవర్లలో 3 వికెట్లకు 79 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (35), మిచెల్ (19 నాటౌట్), విలియమ్సన్ (18 నాటౌట్) ఆకట్టుకున్నారు.

స్నేహిత్‌కు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బ్రిక్స్ క్రీడల్లో హైదరాబాద్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ స్నేహిత్ పతకం సాధించాడు. రష్యాలో జరిగిన ఈ పోటీల్లో స్నేహిత్ సింగిల్స్ సెమీస్‌లో 0-3తో కిరిల్ స్కాచ్కోవ్ (రష్యా) చేతిలో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు.

సుమిత్ @71

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ స్టార్ సుమిత్ నగల్ కెరీర్‌లో బెస్ట్ ర్యాంక్ సాధించాడు. గత వారం 77వ ర్యాంకులో నిలిచిన సుమిత్.. సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో 71వ స్థానానికి ఎగబాకాడు. గతవారం పెరూగియా టోర్నీలో రన్నరప్‌గా నిలవడంతో సుమిత్ ర్యాంక్ మెరుగైంది.



తన్‌జీమ్ (4-2-7-4)



ముస్తాఫిజుర్ (4-1-7-3)

సూపర్-8కు అర్హత

బంగ్లా.. ఘనంగా

చెలరేగిన తన్‌జీమ్, ముస్తాఫిజుర్ ● నేపాల్ చిత్తు

కింగ్స్‌టౌన్: బౌలర్ల అద్భుత రాణింపుతో బంగ్లాదేశ్ జట్టు టీ20 వరల్డ్‌కప్ సూపర్-8లో ప్రవేశించింది. తమ స్వల్ప స్కోరును కాపాడే క్రమంలో బంగ్లా పేసర్లు తన్‌జీమ్ హసన్ షకీబ్ (4-2-7-4), ముస్తాఫిజుర్ (4-1-7-3) కళ్లు చెదిరే గణాంకాలు నమోదు చేశారు. దీంతో సోమవారం గ్రూప్ 'డి'లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో 21 పరుగుల తేడాతో విజయాన్నందుకుంది. అలాగే ఈ మెగా టోర్నీ చరిత్రలో తక్కువ స్కోరును కాపాడుకున్న తొలి జట్టుగా బంగ్లా నిలవడం విశేషం. ఆరు పాయింట్లతో తమ గ్రూప్ నుంచి సౌతాఫ్రికా తర్వాత సూపర్-8లో ప్రవేశించిన రెండో జట్టుగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాను నేపాల్ బౌలర్లు వణికించడంతో 19.3 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌటైంది. వీరి ఇన్నింగ్స్‌లో షకీబ్ (17) టాప్ స్కోరర్ కావడం గమనార్హం. పవర్‌ప్లేలోనే ఈ జట్టు 30/4 స్కోరుతో కష్టాల్లో పడింది. ఆ తర్వాత కూడా బ్యాటర్లకు ఇబ్బంది తప్పలేదు. ఆఖరి వికెట్‌కు టస్కిన్ (12 నాటౌట్), ముస్తాఫిజుర్ (3) 18 పరుగులు జత చేయడంతో అతి కష్టమ్మీద స్కోరు వంద పరుగులు దాటగలిగింది. సోమ్‌పాల్ కమి, లామిచానె, రోహిత్, దీపేంద్రలకు రెండేసి వికెట్లు దక్కాయి.

పేసర్ల హవా: దక్షిణాఫ్రికాపై ఒక్క పరుగు తేడాతో ఓడిన నేపాల్.. ఈసారి స్వల్ప ఛేదనలో బంగ్లాకు షాక్ ఇవ్వగలదని అంచనా వేశారు. కానీ ప్రత్యర్థి పేసర్ల తడాఖాతో 19.2 ఓవర్లలో 85 పరుగులే చేసి ఓడింది. తన్‌జీమ్ అద్భుత బౌలింగ్‌తో టాపార్డర్ పనిబట్టడంతో పవర్‌ప్లేలో 24/4 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. అయితే మిడిలార్డర్‌లో కుశాల్ మల్ల (27), దీపేంద్ర సింగ్ (25) పోరాటంతో ఆశలు రేపారు. కానీ 24 బంతుల్లో 30 పరుగులు కావాల్సిన వేళ 17వ ఓవర్‌లో కుశాల్‌ను ముస్తాఫిజుర్ అవుట్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 52 పరుగుల కీలక భాగస్వామ్యం ముగియడంతో పాటు చివరి వికెట్లు టపటపా నేలకూలాయి. ఏకంగా ఎనిమిది మంది సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా.. చివరి నలుగురు డకౌట్లుగా వెనుదిరగడం గమనార్హం.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 19.3 ఓవర్లలో 106 ఆలౌట్ (షకీబ్ 17, రిషద్ 13, మహ్మదుల్లా 13; సోమ్‌పాల్ 2/10, లామిచానె 2/17, రోహిత్ 2/20, దీపేంద్ర 2/22).
నేపాల్: 19.2 ఓవర్లలో 85 ఆలౌట్ (కుశాల్ 27, దీపేంద్ర 25, ఆసిఫ్ 17;తన్‌జీమ్ 4/7, ముస్తాఫిజుర్ 3/7, షకీబ్ 2/9).



బార్బడోస్‌లోని బీచ్‌లో వాలీబాల్ ఆడుతున్న టీమిండియా క్రికెటర్లు విరాట్, రింకూ సింగ్

ఇక.. 'సూపర్' మజా

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టీ20 ప్రపంచకప్‌లో ఇక కీలక సమరానికి వేళైంది. మొత్తం 20 జట్లు పోటీపడ్డ ఈ మెగా టోర్నమెంట్‌లో పేలవ ప్రదర్శన చేసిన 12 జట్లు గ్రూప్ దశలోనే వెనుదిరిగాయి. అత్యుత్తమంగా రాణించిన జట్లు సూపర్-8 పోరుకు అర్హత సాధించాయి. బుధవారం నుంచి జరిగే ఈ సూపర్ ఫైట్‌లో పోటీపడే ఆ జట్లు ఏంటన్నది ఇప్పటికే ఖరారయ్యాయి. ఈ ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. ఇకపోతే..సూపర్-8 దశ గ్రూపులను ప్రిలిమినరీ పోటీల సందర్భంగా ఆయా జట్లకు కేటాయించిన సీడింగ్‌ల ఆధారంగా నిర్ణయించారు. దీని ప్రకారం ఎ1గా భారత్, ఎ2గా పాకిస్థాన్, ఇంగ్లండ్ బి1, ఆస్ట్రేలియా బి2, న్యూజిలాండ్ సి1, వెస్టిండీస్ సి2, దక్షిణాఫ్రికా డి1, శ్రీలంక డి2గా టోర్నీకి ముందు లీగ్ దశలో పోటీపడ్డాయి. లీగ్ దశలో గ్రూప్-ఎ నుంచి భారత్, అమెరికా.. గ్రూప్-బి నుంచి ఇంగ్లండ్, ఆస్ట్రేలియా.. గ్రూప్-సి నుంచి అఫ్ఘానిస్థాన్, వెస్టిండీస్.. గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ సూపర్-8లో ప్రవేశించాయి. భారత్, అఫ్ఘానిస్థాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ జట్లను గ్రూప్-1గా... అమెరికా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్ జట్లను గ్రూప్-2గా విభజించారు. ఇందులో ఒక్కో జట్టు ప్రత్యర్థితో ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. అంటే.. ప్రతి జట్టు మూడేసి మ్యాచ్‌లు ఆడతాయి. దీంతో ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ చేరతాయి. సూపర్-8లో భాగంగా టీమిండియా తన పోరును అఫ్ఘానిస్థాన్‌తో ఈనెల 20న ప్రారంభించనుంది. తర్వాతి మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో 22న, చివరి మ్యాచ్‌ను ఆస్ట్రేలియాతో 24న ఆడనుంది. కాగా, సూపర్-8 మ్యాచ్‌లన్నీ వెస్టిండీస్ వేదికగానే జరగనున్నాయి.

సూపర్-8 షెడ్యూల్

తేదీ	మ్యాచ్	సమయం
జూన్ 19	దక్షిణాఫ్రికా × అమెరికా	రా. 8 గం.
జూన్ 20	ఇంగ్లండ్ × వెస్టిండీస్	ఉ. 6 గం.
జూన్ 20	భారత్ × అఫ్ఘానిస్థాన్	రా. 8 గం.
జూన్ 21	ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్	ఉ. 6 గం.
జూన్ 21	ఇంగ్లండ్ × దక్షిణాఫ్రికా	రా. 8 గం.
జూన్ 22	వెస్టిండీస్ × అమెరికా	ఉ. 6 గం.
జూన్ 22	భారత్ × బంగ్లాదేశ్	రా. 8 గం.
జూన్ 23	అఫ్ఘానిస్థాన్ × ఆస్ట్రేలియా	ఉ. 6 గం.
జూన్ 23	ఇంగ్లండ్ × అమెరికా	రా. 8 గం.
జూన్ 24	వెస్టిండీస్ × దక్షిణాఫ్రికా	ఉ. 6 గం.
జూన్ 24	భారత్ × ఆస్ట్రేలియా	రా. 8 గం.
జూన్ 25	అఫ్ఘానిస్థాన్ × బంగ్లాదేశ్	ఉ. 6 గం.

గ్రూప్-1
భారత్, ఆస్ట్రేలియా, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్

గ్రూప్-2
అమెరికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా



జూడ్ బెలింగ్‌హామ్

ఇంగ్లండ్ బోణీ

యూరో చాంపియన్‌షిప్

జెల్సెన్‌కిర్చెన్ (జర్మనీ): స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెలింగ్‌హామ్ కొట్టిన ఏకైక గోల్‌తో యూరోపియన్ చాంపియన్‌షిప్‌ను ఇంగ్లండ్ విజయంతో ఆరంభించింది. గ్రూప్ 'సీ'లో ఆదివారం అర్ధ రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 1-0తో సెర్బియాపై విజయం సాధించింది. 13వ నిమిషంలో వింగర్ బుకాయో సాకా నుంచి అందుకున్న పాస్‌ను జూడ్..హెడర్‌తో గోల్‌పోస్టులోకి పంపాడు. ఈ మ్యాచ్‌తో బెలింగ్‌హామ్ రికార్డుపుటలకెక్కాడు. 21 ఏళ్ల లోపే (20 ఏళ్ల 353 రోజులు) మూడు పెద్ద అంతర్జాతీయ టోర్నమెంట్లు ఆడిన తొలి యూరప్ ఆటగాడిగా జూడ్ రికార్డు నెలకొల్పాడు. 2020 యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో ఆడిన అతడు 2022 ఫిఫా వరల్డ్ కప్‌లోనూ పాల్గొన్నాడు. ప్రస్తుతం మళ్లీ యూరో చాంపియన్‌షిప్ బరిలో దిగాడు. గ్రూప్ 'ఈ'లో రొమేనియా 3-0తో ఉక్రెయిన్‌ను చిత్తు చేసింది. కాగా, ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో స్లోవేకియా 1-0తో బెల్జియం జట్టుకు షాకిచ్చింది.



ఫుట్‌బాల్ కోచ్ స్టిమాక్‌పై వేటు

న్యూఢిల్లీ: ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలో చీఫ్ కోచ్ ఇగోర్ స్టిమాక్‌పై వేటుపడింది. అతడి కాంట్రాక్ట్ ఏడాది మిగిలుండగానే బాధ్యతల నుంచి తప్పించినట్టు భారత ఫుట్‌బాల్ సమాఖ్య సోమవారం ప్రకటించింది. 2019లో స్టిమాక్‌ను భారత కోచ్‌గా నియమించారు. గత అక్టోబరులో అతడి పదవీ కాలాన్ని 2026 వరకు పొడిగించారు.

జాతీయ బ్యాడ్మింటన్ విజేత శశాంక్




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ బాలుర అండర్-15 విభాగంలో శశాంక్ విజేతగా నిలిచాడు. సోమవారం చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన ఫైనల్లో శశాంక్ 21-11, 22-20తో గిరివాసన్‌పై గెలిచాడు. బాలికల అండర్-17 డబుల్స్‌లో దుర్గ-కీర్తి జోడీ, అండర్-15 డబుల్స్‌లో రాహుల్-వేదాంత్ జంట టైటిళ్లు సాధించారు. పుల్లెల గోపీచంద్, చేతన్ ఆనంద్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

లంకకు ఓదార్పు

గ్రోస్ ఐస్‌లెట్ (సెయింట్ లూసియా): ఎట్టకేలకు సత్తాచాటిన శ్రీలంక.. టీ20 వరల్డ్‌కప్‌ను విజయంతో ముగించింది. గ్రూప్-డిలో సోమవారం జరిగిన తమ ఆఖరి, నామమాత్రపు మ్యాచ్‌లో లంక 83 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను చిత్తు చేసింది. తొలుత లంక 20 ఓవర్లలో 201/6 స్కోరు చేసింది. కుశాల్ మెండిస్ (46), అసలంక (46), ధనంజయ డిసిల్వ (34), ఏంజెలో మాథ్యూస్ (30 నాటౌట్) ధాటిగా ఆడారు. వాన్ బీక్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో నెదర్లాండ్స్ 16.4 ఓవర్లలో 118 పరుగులకు కుప్పకూలింది. మైకేల్ లెవిట్ (31), స్కాట్ ఎడ్వర్డ్స్ (31) టాప్ స్కోరర్లు. తుషార 3 వికెట్లు పడగొట్టగా.. హసరంగ, పతిరన చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన లంక సూపర్-8 నుంచి అవుటైన సంగతి తెలిసిందే.

ఐకమత్యం లేదు..

అది జట్టా?



పాక్‌పై కోచ్ కిర్‌స్టెన్ విమర్శలు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టిన పాకిస్థాన్ జట్టుపై చీఫ్ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ తీవ్ర విమర్శలు చేశాడు. పాక్ టీమ్‌లో ఐకమత్యమే లేదన్నాడు. తన సుదీర్ఘ కోచింగ్ కెరీర్‌లో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ ఎదురుకాలేదని చెప్పాడు. 'పాక్ టీమ్‌లో ఒక్కొక్కరిది ఒకో దారి. వారిలో ఐకమత్యం లేదు.. కానీ జట్టు అని పిలుస్తుంటారు. ఎన్నో టీమ్‌లతో పని చేశా. ఎన్నడూ ఇలాంటి అనుభవం ఎదురుకాలేదని కిర్‌స్టెన్ అన్నాడు. మిగతా అగ్రశ్రేణి జట్లతో పోల్చితే నైపుణ్యాల పరంగా పాక్ ఎంతో వెనుకబడిందని చెప్పాడు.


సోనియా, రాహుల్, ప్రియాంకతో వైఎస్ షర్మిల

సోనియా, రాహుల్‌తో షర్మిల భేటీ

న్యూఢిల్లీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకతో ఏపీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, భవిష్యత్తు ప్రణాళికలు, కార్యాచరణపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. రానున్న రోజుల్లో ఏపీలో కాంగ్రెస్ పునర్వైభవం సాధించి, బలీయమైన శక్తిగా అవతరించే దిశగా మరిన్ని అడుగులు పడనున్నాయని 'ఎక్స్' వేదికగా షర్మిల వెల్లడించారు.


మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న టీజీటీఏ ప్రతినిధులు

భూ పరిపాలనలో సమగ్ర మార్పులు తేవాలి..

- టీజీటీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం
- సమస్యలపై మంత్రి పొంగులేటికి వినతిపత్రం

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు మరింత దగ్గరయ్యేలా భూ పరిపాలనలో సమగ్ర మార్పులు తేవాలని తెలంగాణ తహశీల్దార్ల సంఘం (టీజీటీఏ) ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలోని ఉద్యోగులను ఛిన్నాభిన్నం చేసిన జీవో నం.317 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. సోమవారం సీసీఎల్‌లోని టీజీటీఏ రాష్ట్ర కార్యాయలంలో తహశీల్దారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి పలు అంశాలపై తీర్మానం చేసింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. 'పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలి. పూర్వ వీఆర్ఏ, వీఆర్‌ఓల న్యాయబద్ధ డిమాండ్లను వెంటనే పరిష్కరించి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి.' అని డిమాండ్ చేశారు. అనంతరం ఈ అంశాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అధికారాలను ఎక్కువగా కలెక్టర్ల వద్ద కేంద్రీకృతం చేయడంతో భూసమస్యల పరిష్కారం జాప్యమవుతోందన్నారు. రెవెన్యూ శాఖలో అధికారాల వికేంద్రీకరణ జరిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మిగతా కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో రెగ్యులరైజ్ అవ్వని కాంట్రాక్ట్ లెక్చరర్లను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీజీడీసీఎల్ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. వారంతా 24 ఏళ్లుగా సేవలందిస్తూ బానిస బతుకులు అనుభవిస్తున్నారని, నాలుగు నెలలుగా కనీసం వేతనాలు, సెలవులు కూడా లేక మనోవేదనకు గురవుతున్నారని ఆయన తెలిపారు.

'నీట్' మళ్లీ నిర్వహించాలి..

- 'విద్యార్థి, యువజన సంఘాల కమిటీ' డిమాండ్

పంజాగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ప్రధాని మోదీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని కమిటీ నేతలు ఆరోపించారు. మోదీ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని.. ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న హిమాయత్‌నగర్ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు వేలాది మంది విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిస్తామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, వీజేఎస్, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, ఏఐఎస్ఎఫ్ సంఘాల ప్రతినిధులతో కలసి ఆయన మంగళవారం నిర్వహించే 'స్టూడెంట్స్ మార్చ్' పోస్టరును ఆవిష్కరించారు.

ఆకస్మిక ఆందోళనలను ఉపేక్షించం!

- విద్యార్థులకు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ హెచ్చరిక

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు ఆకస్మిక ఆందోళనలు, ర్యాలీలు చేపడితే ఉపేక్షించేది లేదని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. క్యాంపస్‌లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే విద్యార్థులపై క్రమశిక్షణా రాహిత్యం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. విద్యార్థులు అకడమిక్ సమస్యలపై ముందుగా విభాగాధిపతులను, హాస్టళ్లకు సంబంధించిన సమస్యలైతే వార్డెన్లను సంప్రదించాలన్నారు. వాటిని అధికారులు పరిష్కరించేందుకు నిర్ణీత సమయం ఇవ్వాలని, అప్పటికీ పరిష్కారం కాకుంటే తనను సంప్రదించాలని రిజిస్ట్రార్ సూచించారు. ఇదిలా ఉంటే.. యూనివర్సిటీలో కొందరు విద్యార్థులు ఇటీవల ఆకస్మికంగా ఆందోళన చేయడం పట్ల ఇన్‌చార్జ్ వీసీ బుర్రా వెంకటేశం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో సదరు విద్యార్థులకు మెమోలు జారీ చేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించినట్లు సమాచారం.

అరుంధతీ రాయ్‌పై ఉపా కేసు ఎత్తేయాలి: సీపీఐ(ఎంఎల్)

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రచయిత్రి అరుంధతీ రాయ్‌పై పెట్టిన ఉపా కేసును ఎత్తివేయాలని, విచారణ పేరుతో వేధింపులు ఆపాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 14 ఏళ్ల క్రితం కశ్మీర్ సమస్యపై అరుంధతీరాయ్ మాట్లాడిన అంశాన్ని తిరగదోడిన మోదీ ప్రభుత్వం ఉపా కేసు పెట్టి వేధించడం ఆపాలని కోరారు. సమస్యలపై మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు, పార్టీలు స్పందిస్తాయని.. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారందరినీ జైల్లో పెట్టాలనే ధోరణి సరికాదని పేర్కొన్నారు.

ఈ కోడి మహా 'కడక్'!


కోడితో యజమాని మల్లారెడ్డి

జగిత్యాల రూరల్, జూన్ 17: పోలీసు జాగిలాల్ని చూసే ఉంటాం.. ఏం చెప్పినా చేస్తూ.. అద్భుత విన్యాసాలతో ఆశ్చర్య పరుస్తుంటాయి. అయితే ఓ కోడి పుంజు కూడా ఆ జాగిలాలకు ఏ మాత్రం తీసిపోనంటోంది. యజమాని చెప్పింది చేస్తూ 'ఔరా..' అనిపించుకుంటోంది..! జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన ఎడ్మల మల్లారెడ్డి వృత్తి రీత్యా కోళ్ల ఫారం నిర్వహిస్తుంటాడు. అయితే 6 నెలల క్రితం మల్లారెడ్డి 2 నెలల వయసున్న ఓ కడక్‌నాథ్ కోడిపిల్లను తెచ్చుకున్నాడు. అది అతని ఫారానికి వచ్చింది మొదలు అతని చుట్టూ తిరుగుతుండటంతో మల్లారెడ్డి దానిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు. దీంతో అది అయన చుట్టే తిరుగుతూ.. చెప్పింది చేస్తూ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ముందుకు నడవమంటే ముందుకు, వెనక్కు నడవమంటే వెనక్కి.. కూర్చోమంటే కూర్చుంటోంది. ఇది చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

అప్పనంగా అప్పగించారు

450 కోట్ల రుషికొండ మహల్‌లో 120 కోట్లు సోకులకే.. సమీప బంధువు సుప్రియారెడ్డికే ఆ ఖరీదైన వర్క్స్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రిగా జగన్ విలువలు, విధానాలు మాత్రమే బోధించేవారు. వాటిని ఆచరించేవారు కాదు. చట్టాలు, నిబంధనల పేరిట ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికలను కూల్చడంలో ప్రావీణ్యం సంపాదించిన జగన్‌రెడ్డి...మరోచేత్తో తన అస్మదీయులు, దగ్గరి బంధువులను చేరదీసి పెంచిపోషించారు. పర్యావరణాన్ని పణంగాపెట్టి వందల కోట్ల ప్రజాధనం నీళ్లగా ఖర్చు చేసి వారితో రుషికొండ ప్యాలెస్ కట్టించుకున్నారు. చెవ్వా సుప్రియారెడ్డి అనే సమీప బంధువే జగన్ అభిరుచికి తగినట్లుగా, భారతిరెడ్డి ఇష్టాలను బట్టి అందమైన డిజైన్లు, ఇంటీరియర్‌ను రూపొందించారు. జగన్ వద్ద నాడు ఐటీ సలహాదారుగా పనిచేసిన దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి భార్య సుప్రియారెడ్డి. జగన్ తరపున ఇసుక వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపిన సోదరుడు అనిల్‌రెడ్డికి ఈమె సమీపబంధువు. ఆమెదీ, జగన్‌దీ ఒకే ఊరు. ఉమ్మడి కడప జిల్లా భక్రాపురంలో వారివి పక్కపక్క ఇళ్లే. సుప్రియారెడ్డికి చెందిన పాంథియన్ డిజైన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకే రుషికొండ టూరిజం ప్రాజెక్టు డిజైన్స్, ఆర్కిటెక్చువల్, ఇంటరీయర్ ప్రాజెక్టును ఇచ్చారు. ఒక్క రుషికొండనే కాదు, రాష్ట్రంలోని టూరిజం ప్రాజెక్టులన్నీ ఈ సంస్థకే అప్పగించినట్లుగా నాటి జగన్ ప్రభుత్వం ఓ నోట్‌ఫైల్‌లో పేర్కొంది. అయితే, ఆ కంపెనీకి ఏ ప్రాతిపదికన వర్క్ ఇచ్చారు...ఆ సంస్థకు ఉన్న అర్హతలు, అనుభవం ఏపాటివో ఎవ్వరికీ తెలియదు. అసలు ఆ సంస్థకు టెండర్ ఎలా ఇచ్చారనేదీ ఆ శాఖలో ఉన్నవారికి తెలియదు. కానీ ఆ సంస్థే రుషికొండ ప్రాజెక్టులో కర్త, కర్మ, క్రియగా నిలిచింది. ఆ సంస్థ పేరిట సుప్రియారెడ్డినే చక్రం తిప్పారు. ఫలితంగా ఆ ప్రాజెక్టు వ్యయం 500 కోట్లకు చేరుకుంది. ఇందులో సుప్రియారెడ్డికి చేరింది ఎంత? నికరంగా ప్రభుత్వం రుషికొండపై ఖర్చుపెట్టినదెంతో తేలాల్సి ఉంది. ఇది తేలాలంటే సర్కారు రుషికొండ ప్రాజెక్టు వర్క్‌లపై సిట్‌తో ప్రత్యేక దర్యాప్తు చేయించాలని పర్యావరణ, ఆర్థికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

> 'తిరుపతిలో కొండపై వేంకటేశ్వరస్వామి గుడి కట్టలేదా? సింహాచలంలో నృసింహస్వామి ఆలయం నిర్మించలేదా? శ్రీశైలంలో మల్లిఖార్జున స్వామి ఆలయం లేదా?... జగన్ కోసం రుషికొండపై భవనం కడితే తప్పేమిటి?'
> - నాటి పర్యాటక శాఖ మంత్రి రోజా ఉవాచ

జగన్ భవనాలకు అందాలు...

జగన్ 2019లో అధికారంలోకి వచ్చాక కడప జిల్లాకు చెందిన దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అనే వ్యక్తిని తన ఐటీ సలహాదారుగా నియమించుకున్నారు. అయితే, అప్పటికే ఆయన భార్య సుప్రియారెడ్డి.. జగన్ భవనాలను చక్కదిద్దుతున్నారు. జగన్‌కు చెందిన బెంగళూరు, హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ ప్యాలెస్‌లకు ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్లు, ఇంకా అదనపు హంగులు అద్దినది సుప్రియారెడ్డినే. అయితే, అప్పటికి ఆమెకు ప్రత్యేకంగా



కంపెనీలేదు. 2019లో మేలో జగన్ అధికారంలోకి వచ్చారు. తాడేపల్లిలోని తన ప్యాలెస్‌ను క్యాంపు ఆఫీసుగా చేసుకున్నారు. ఆ తర్వాత కొద్ది నెలలకే, ఆగస్టులో సుప్రియారెడ్డి డైరెక్టర్‌గా పాంథియన్ డిజైన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఇందులో ఆమె భర్త దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, మరో వ్యక్తి డైరెక్టర్లుగా ఉన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌ను పూర్తిస్థాయి క్యాంపు ఆఫీసుగా మార్చాక, అందులో ఆర్కిటెక్చువల్, ఇంటీరియర్ డిజైన్స్ సుప్రియారెడ్డియే చేశారని ఆర్‌అండ్‌బీ వర్గాలు చెబుతున్నాయి. సెక్యూరిటీ ఏర్పాట్ల పేరిట కేటాయించిన నిధులను ఇంటీరియర్ డిజైన్‌కోసం వినియోగించినట్లు తాజాగా అధికారులు చెబుతున్నారు. ఆర్ట్‌గ్యాలరీలు, పెయింటింగ్స్, సమావేశాలు జరిగే హాల్స్ డిజైన్స్ వంటివి ఆమె సూచనలతోనే రూపొందించినట్లు ఓ సీనియర్ అధికారి చెప్పారు. ఆమె డిజైన్స్ నచ్చిన తర్వాతే జగన్ కుటుంబం సుప్రియాకు రుషికొండ ప్రాజెక్టు బాధ్యతలను అప్పగించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఏ ప్రతిపాదికన ఇచ్చారు?

జగన్ వ్యక్తిగతంగా తన ఇంటి నిర్మాణం, డిజైన్ పనులను సుప్రీయారెడ్డికి ఇచ్చుకోవచ్చు. ఇందులో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదు. కానీ, రుషికొండ ప్రాజెక్టు ప్రభుత్వానిది. జగన్ సొంత ఆస్తికాదు. ప్రభుత్వ నిధులతో చేపట్టే ఏ ప్రాజెక్టు అయినా ఒకరికి అప్పగించాలంటే నిర్దిష్టమైన నియమనిబంధనలు, చట్టబద్ధమైన మార్గదర్శకాలు ఉంటాయి. టెండర్లు పిలవాలి. అర్హత ఉన్న కంపెనీలను ఎంపిక చేయాలి. ఆ తర్వాతే వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. మరి సుప్రియారెడ్డికి చెందిన పాంథియన్ డిజైన్స్‌కు ఏ ప్రాతిపదికన రుషికొండ ప్రాజెక్టు అప్పగించారు? ఇప్పుడు ఇదే పెద్ద ప్రశ్న. నిజానికి రుషికొండ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేసేందుకు టెండర్లు పిలవగా, ఆర్వీ అసోసియేట్స్, ఆర్కిటెక్ట్ ఇంజనీర్స్ కన్సల్టెంట్స్ ప్రైవేటు లిమిటెడ్ బిడ్ దక్కించుకుంది. ప్రాజెక్టు వ్యయంలో మూడు శాతం ఫీజుగా ఆ సంస్థకు ఇచ్చేలా ఒప్పందం ఉంది. మరి పాంథియన్ డిజైన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని ఎలా ఎంపిక చేశారు? ఆర్కిటెక్చువల్, ఇంటీరియర్ డిజైన్స్ కోసం టెండర్లు పిలిచారా? నామినేషన్ ప్రాతిపదికన ఇచ్చారా? వీటిల్లో ఏ ఒక్క ప్రశ్నకూ సమాధానం లేదు. జగన్, భారతీలకు సమీప బంధువు అన్న కారణం తప్ప మరేకోణం కనిపించడం లేదు. ఆ కంపెనీని ఎలా ఎంపిక చేశారో ప్రభుత్వం వద్ద ఏ రికార్డూ లేదు. అయితే, ప్రాథమిక ఆర్కిటెక్చువల్ ప్లాన్‌లకు ఆ సంస్థ డబ్బులు తీసుకోలేదని ప్రభుత్వం చెబుతోంది. ఓ ప్రైవేటు సంస్థ ప్రభుత్వానికి ఉచితంగా సేవలందించగలదా? అలా అని జగన్ చెబితే ప్రజలు నమ్మాలా? టూరిజం చెబుతోన్న వివరణలో మరో కోణం ఉంది. ప్రాథమిక డిజైన్లు ఉచితంగా ఇచ్చినా, అసలు సిసలైన డిజైన్లకు ఆ సంస్థ భారీగానే ఫీజులు తీసుకున్నట్టు చెప్పకనే చెప్పినట్టుగా ఉంది. రుషికొండ ప్యాలెస్‌లోని ఏర్పాట్లు అచ్చం బెంగళూరులోని జగన్ ప్యాలెస్‌తో పోలి ఉన్నాయి. ఖరీదైన బాత్‌రూమ్ ఇంటీరియర్స్, శాండ్లియర్స్, బాత్‌టబ్స్ పెయింటింగ్స్, వాల్ డిజైన్లు, బెడ్, సోఫా డిజైన్లు అచ్చం అలాగే ఉన్నాయి.

సుందరీకరణకు 120 కోట్లపైనే..

రుషికొండ ప్యాలెస్ బడ్జెట్ ఎంత? తొలుత ఎన్ని కోట్లతో నిర్మించాలనుకున్నారు? ఆ తర్వాత ఎన్ని కోట్లకు చేరిందో తెలిస్తే జగన్ అభిష్టాల విలువ ఎంత ఖరీదో తెలిసిపోతుంది. ఫేజ్1-, ఫేజ్2 భవనాల నిర్మాణంకోసం 120 కోట్లు వ్యయం కానుందని అంచనావేశారు. కానీ ఇప్పుడు మొత్తం వ్యయం 450 కోట్లపైమాటే. ఇందులో అందాల కోసమే 120 కోట్లపైనే ఖర్చుపెట్టినట్లు తెలిసింది. బహిరంగ మార్కెట్‌లో 100 రూపాయలకు దొరికే వస్తువును అంతర్జాతీయ ప్రమాణాలు పేరుచెప్పి వెయ్యిరూపాయలకుపైనే కొనుగోలు చేయించినట్లు చెబుతున్నారు. ఒక వెస్ట్రన్ టాయిలెట్ ఖరీదే 3.65 లక్షలు, బాత్‌టబ్ ఖర్చు 2.75 లక్షలపైనే ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ప్యాలెస్‌లో వాడిన కర్టెన్‌లు, వాటి పరికరాల ఖర్చు 10 కోట్లపైనే ఉంటుందని చెబుతున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారు, ఆయన, భారతీ కుటుంబం రుషికొండ ప్యాలెస్‌లో నివాసం ఉంటారు, క్యాంపు ఆఫీసు ఇక్కడే ఉంటుందన్న ధీమాతో ప్రభుత్వ సొమ్మును మంచినీళ్ల ప్రాయంలా ఖర్చుపెట్టించారు. ఇప్పటివరకు అక్కడ ఎంత ఖర్చుపెట్టారు...ఏ కేటగిరీలో ఎంత వ్యయం చేశారో ఆడిటింగ్ జరగ లేదు. ఏ పనికి ఎంత మేర నిధులు వాడాల్నో పరిమితి లేదు. దీంతో అడిగినంత ఇచ్చేశారు. నచ్చినట్టుగా పరికరాలు కొన్నారు. ప్రజాధనాన్ని, పర్యావరణాన్ని పణంగాపెట్టి రుషికొండ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టులో అధికార, నిధుల దుర్వినియోగం బయటకు రావాలంటే ప్రత్యేకంగా సిట్‌తో విచారణ చేయించాలని పర్యావరణ, ఆర్థికవేత్తలు కోరుతున్నారు. ఏమాత్రం అనుభవం లేని సుప్రియారెడ్డి కంపెనీకి కాంట్రాక్టు ఎలా ఇచ్చారో నిగ్గుతేల్చాలని, ఇందులో జగన్, ఇతరుల పాత్రపై విచారించాలని వారు కోరుతున్నారు.

'అమ్మగారు చెప్పినట్లే చేయండి'

సుప్రియారెడ్డి ఇచ్చిన సలహాలు, సూచనలు చాలా ఖరీదైనవని రుషికొండ ప్యాలెస్‌లోని ఏర్పాట్లు, వాటిపై చేసిన వ్యయాన్ని పరిశీలిస్తే అర్థమవుతోంది. ప్రభుత్వ సొమ్మేకదా అని డిజైన్‌లు, ఇంటరీయర్స్‌కు, ఇతర హంగులు, ఆర్భాటాలకు అడ్డగోలుగా ఖర్చుచేయించారని అధికారవర్గాలు చెబుతున్నాయి. యూరోపియన్, ఇటాలియన్, అమెరికన్ సంప్రదాయాలు కొట్టొచ్చినట్టు కనబడేలా ఖరీదైన డిజైన్లు చేయించారని, దానిపై పరిమితికి మించిన ఖర్చుచేయించారని పర్యాటక శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి చెబుతున్నారు. "అమ్మగారు చెప్పినట్లే చేయండి. అన్నీ ది బెస్ట్ ఉండాలి. ఎందులో రాజీపడినట్లుగా ఇంటీరియర్స్ ఉండకూడదు." అని పలు సందర్భాల్లో ప్యాలెస్‌నుంచి టూరిజంలోని ఓ ఉన్నతాధికారికి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

పూటకో పాట!

- పర్యాటక భవనమని నాడు రోజా వ్యాఖ్య
- ప్రారంభం తరువాత మాట మార్పు..
- సీఎంవోకు అడిగితే ఇచ్చేస్తామని ప్రకటన
- ఇప్పుడేమో ప్రధాని, రాష్ట్రపతి కోసమని బుకాయింపు

రుషికొండపై నిర్మించిన విలాసవంతమైన భవనాల గురించి వైసీపీ నేతలు రోజుకో మాట చెబుతున్నారు. ప్రజాసంఘాలు అక్రమ నిర్మాణమని న్యాయస్థానాల్లో కేసులు వేస్తే అక్కడ కూడా అబద్ధాలే చెప్పారు. వాటిని విశ్వసించని న్యాయమూర్తులు కమిటీని వేసి వాస్తవాలు తెలుసుకున్నారు. మూడు రాజధానుల పేరుతో విశాఖను పరిపాలనా కేంద్రం చేయాలని జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించుకున్న నాటినుంచే.. ఉల్లంఘనలు మొదలయ్యాయి. తన కార్యాలయం కోసం రుషికొండపై కన్నేసిన జగన్.. అక్కడ అప్పటికే 60 గదులతో నడుస్తున్న రిసార్ట్స్‌ను కూలగొట్టి రాజభవంతి నిర్మించేందుకు సుమారు 9.8 ఎకరాల విస్తీర్ణంలో.. 4.7 ఎకరాల్లో నిర్మాణాల కోసం 22 ఎకరాల కొండను తవ్వేశారు. కానీ, 70 ఎకరాల్లో నిర్మాణాలకు అనుమతి కావాలని మహా విశాఖ నగర పాలక సంస్థకు దరఖాస్తు చేశారు. అయితే అదంతా కోస్తా నియంత్రణ మండలి పరిధిలో ఉన్న ప్రాంతం కావడంతో కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖకు తప్పుడు సమాచారం ఇచ్చారు. భవనాలు కూలగొట్టిన 4.7 ఎకరాల్లోనే నిర్మాణాలు చేపడతామని చెప్పి.. కేంద్రం నుంచి షరతులతో కూడిన అనుమతి పొందారు.

రూపాయి కట్టకుండా రూ.500 కోట్ల భవనం

రుషికొండ మొత్తం రెవెన్యూకు చెందిన భూమి. అయినా ఏపీటీడీసీ అందులో భారీ నిర్మాణాలకు దరఖాస్తు చేస్తే జీవీఎంసీ అధికారులు అనుమతులు ఇచ్చేశారు. నిర్మాణ ఫీజులుగా రూ.19.05 కోట్లు కట్టాల్సి ఉండగా, వాటిని ఐదేళ్ల తరువాత వాయిదాల పద్ధతిలో చెల్లించడానికి అనుమతి ఇస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ప్రత్యేక జీవో ఇచ్చారు. రూపాయి ఫీజు కట్టకుండా రూ.500 కోట్ల భవనం నిర్మించారు. భవన నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘనపై పత్రికల్లో తరచూ వార్తలు రావడంతో నాటి పర్యాటక శాఖ మంత్రి రోజాతోపాటు మంత్రులు అమర్‌నాథ్, బొత్స సత్యనారాయణ.. అవన్నీ అబద్ధాలంటూ కొట్టిపడేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా .. తాము నిర్మించింది పర్యాటక శాఖ భవనమేనని రోజా పునరుద్ఘాటించారు. అయితే పరిపాలన రాజధాని విశాఖలో వస్తున్నందున, సీఎం కార్యాలయం కోసం త్రిసభ్య కమిటీ అనేక భవనాలు పరిశీలించి.. ఇదే అన్ని విధాలుగా బాగుందని, భద్రత ఉంటుందని చెప్పారని అన్నారు. సీఎం జగన్ నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే..ఇదే సీఎం కార్యాలయం అవుతుంది". అంటూ ప్రకటించారు. ఇదే మాటను బొత్స, గుడివాడ అమర్‌నాథ్ పునరావృతం చేశారు. తాజాగా ఈ భవంతి వివరాలు బయటకు వచ్చి సంచలనమవడంతో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడారు. విశాఖ పరిపాలన రాజధాని అవుతున్నందున ప్రధాని, రాష్ట్రపతి, గవర్నర్ వంటి వారు వస్తారని, వారు బస చేయడం కోసమే ఈ భవనం నిర్మించామని బుకాయించారు. అయితే ముందు నుంచీ పర్యాటక భవనం అని, ఏడు నక్షత్రాల హోటల్ అని, కన్వెన్షన్ సెంటర్ అని ప్రకటించిన వైసీపీ నేతలు...అవి ఎక్కడున్నాయని ప్రశ్నిస్తే నీళ్లు నములుతున్నారు.

వైసీపీకి మాజీ మంత్రి శిద్దా గుడ్‌బై



ఒంగోలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి సోమవారం తన రాజీనామా లేఖను పంపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి పట్టణానికి చెందిన శిద్దా రాఘవరావు గ్రానైట్ వ్యాపారి. 2014 ఎన్నికల్లో దర్శి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఐదేళ్లు చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా టీడీపీకి చెందిన వ్యాపారులను టార్గెట్ చేసింది. అందులో భాగంగా శిద్దా గ్రానైట్ క్వారీలపై దాడులు చేసి వందల కోట్ల రూపాయల జరిమానాలు విధించింది. దీంతో ఇష్టం లేకున్నా శిద్దా టీడీపీని వీడి వైసీపీలో చేరిపోయారు. తాజా ఎన్నికల్లో వైసీపీ ఓడి.. టీడీపీ గెలిచింది. ఈ నేపథ్యంలో ఆయన వైసీపీకి రాజీనామా చేశారు.

పోలవరం పూర్తికి మరో నాలుగేళ్లు!!

- డయాఫ్రం వాల్ కొత్తది కట్టాలి!
- రూ.990 కోట్లు ఖర్చవుతుంది
- సీఎంకు జల వనరుల శాఖ వివరణ

అమరావతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో నాలుగేళ్లు పడుతుందని జలవనరుల శాఖ స్పష్టం చేసింది. నిర్మాణం పనులు ముందుకు సాగాలంటే.. సాంకేతిక సమస్యలను అధిగమించాల్సి ఉందని తెలిపింది. సోమవారం ప్రాజెక్టు క్షేత్రంలో సమీక్ష సందర్భంగా ఆ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డయాఫ్రం వాల్ దెబ్బతిందని.. మరమ్మతు చేయాలంటే రూ.447 కోట్ల వ్యయం, 288 రోజుల సమయం పడుతుందని చెప్పారు. అదే సమాంతరంగా కొత్త వాల్ నిర్మించాలంటే రూ.990 కోట్లు ఖర్చవుతుందని.. 457 రోజులు సమయం తీసుకుంటుందని వివరించారు. అంటే డయాఫ్రం వాల్ నిర్మాణానికే ఏడాదిన్నర పడుతుందని చెప్పారు. ఎగువ కాఫర్ డ్యాంలో సీపేజీని నివారించాల్సి ఉందని.. కుంగిన గైడ్‌బండ్‌ను మరమ్మతు చేయాలని వెల్లడించారు. ప్రాజెక్టు 41.15 మీటర్ల కాంటూరులో 115 టీఎంసీల నీటి నిల్వకు రూ.7,792.83 కోట్లు కావాలని.. అదేవిధంగా 45.72 మీటర్ల కాంటూరులో 194.60 టీఎంసీల గరిష్ఠ నీటి నిల్వకు 29,949.42 కోట్లు అవసరమని వివరించారు. కాగా ఏపీ జల వనరుల శాఖ సలహాదారుగా రిటైర్డ్ ఈఎన్‌సీ ఎం. వెంకటేశ్వరరావు సేవలను వినియోగించుకోవాలని చంద్రబాబు నిర్ణయించారు. గతంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో వెంకటేశ్వరరావు కీలకంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను పక్కన పెట్టేశారు. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావడంతో.. వెంకటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించాలని నిశ్చయించారు.

పోలవరానికి జగనే శాపం

ఆయన మూర్ఖత్వంతో ప్రాజెక్టు సర్వనాశనం.. మేం చేసిన పనులన్నీ కొరగాకుండా పోయాయి

- సంక్లిష్టం చేశారు.. క్షమించరాని నేరం
- ఎలా మొదలు పెట్టాలో అర్థం కావట్లేదు
- కేంద్రంముందు తలొంచేలా చేశారు ఏపీ సీఎం చంద్రబాబు
- ప్రాజెక్టు పనుల పరిశీలన


కుంగిన గైడ్‌బండ్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి/ఏలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): "వైఎస్ జగన్ చేసిన అనేక తప్పిదాలు పోలవరం ప్రాజెక్టుకు శాపాలుగా మారాయి. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి పాలిస్తే.. రాష్ట్రానికి ఎలా శాపంగా మారతాడో చెప్పడానికి ఆయనే ఉదాహరణ. జగన్ నాయకుడు కాదు.. విధ్వంసకుడు. దురదృష్టం కొద్దీ రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్ర ప్రజల దురదృష్టం కొద్దీ ముఖ్యమంత్రి అయ్యారు" అని ఏపీ సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తూ వచ్చిందని.. కానీ జగన్మోహన్‌రెడ్డి, అధికారులు కూడబలుక్కుని ప్రాజెక్టులోని కీలక నిర్మాణాలను కూల్చేశారని మండిపడ్డారు. జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ప్రాజెక్టు విధ్వంసం ఏ స్థాయిలో ఉందో ప్రజల ముందుంచి వారి అభిప్రాయం ప్రకారం ఏం చేయాలో నిర్ణయిస్తామని స్పష్టంచేశారు. పోలవరం ప్రాజెక్టు వద్ద సోమవారం ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సుమారుగా గంటన్నరపాటు ఆయా నిర్మాణాలను పరిశీలించిన ఆయన.. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాను ఐదేళ్లు కష్టపడి ఒక దశకు తీసుకొచ్చిన పనులన్నింటినీ నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఈ ప్రాజెక్టుపై నిరంతరం సమీక్షిస్తూ.. ప్రాజెక్టును ఓ కొలిక్కి తీసుకొచ్చానని.. ఇప్పుడు ప్రాజెక్టును చూస్తుంటే ఎక్కడ నుంచి మొదలుపెట్టాలో కూడా అర్థం కావడం లేదని చెప్పారు. '2020 డిసెంబరు నాటికే ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉండగా.. జగన్ అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టు సంస్థను మార్చేశారు. కొత్త సంస్థకు పనులు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే పోలవరం ప్రాజెక్టు విధ్వంసానికి దిగారు. ఆయన, అధికారులందరూ కూడబలుక్కుని ప్రాజెక్టులోని కీలక నిర్మాణాలను కూల్చేశారు. కేంద్రం ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తే.. విధ్వంసం సృష్టించి కూల్చేశారు. కేంద్రం ముందు రాష్ట్రం తలదించుకునేలా చేశారు. దీనికి కారకులెవరు.. బాధ్యత ఎవరు వహిస్తారు' అని శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, సీఈ నరసింహమూర్తిని చంద్రబాబు ఆగ్రహంతో నిలదీశారు. దీనికి శశిభూషణ్ సమాధానం చెప్పలేదు. సీఈ మాత్రం తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు.

ఏం జరిగిందో ప్రజలకు స్పష్టత రావాలి

'ఒకపక్క బాధగా ఉంది. పోలవరంలో పనులు దారుణంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టును ఆంధ్ర జీవనాడిగా మార్చి ఆ మేరకు శ్రమించాం, కష్టపడ్డాం. ప్రాజెక్టును పూర్తి చేసి నదులను అనుసంధానం చేస్తే కరువే లేకుండా చేద్దామనుకున్నాం. కానీ, జగన్ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపివేసింది" అని చంద్రబాబు దుయ్యబట్టారు. కాంట్రాక్టర్‌ను మార్చవద్దని కేంద్ర జల సంఘం చెప్పినప్పటికీ వినలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల పరిశీలన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. 2019లో వచ్చిన అధిక వర్షాల కారణంగా డయాఫ్రం వాల్ నాలుగు చోట్ల దెబ్బతిందని, వీటి మరమ్మతులకు రూ.447 కోట్లు అవుతుందని తెలిపారు. ఇంత చేసినా పూర్తిగా మరమ్మతు అవుతుందనే నమ్మకం లేదని చెప్పారు. సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించేందుకు 996 కోట్లు ఖర్చు అవుతాయని తెలిపారు. కుంగిపోయిన గైడ్‌బండ్‌ను పునర్నిర్మించేందుకు ఎన్నాళ్లు పడుతుందో తెలియట్లేదన్నారు. అప్పటి మంత్రులు వెకిలి వ్యాఖ్యలు చేసిన విషయాన్ని విలేకరులు సీఎం దృష్టికి తీసుకురాగా.. రాష్ట్రానికి ఒక వ్యక్తి శాపంగా మారితే ఎలా ఉంటుందో పోలవరం ప్రాజెక్టును ఒక కేస్ స్టడీగా తీసుకోవాలని సూచించారు. ఏం జరిగిందో ప్రజలకు తెలియాలని, తామేం చేయాలన్నది వారే తెలియజెప్పేలా చర్చ సాగాలని అభిప్రాయపడ్డారు.

హత్యాచార నిందితులను విడిచిపెట్టం

» బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం: మంత్రి సీతక్క



మరిపెడ రూరల్, జూన్ 17: హైదరాబాద్ మియాపూర్‌లోని ఏటిగడ్డతండాలో ఇటీవల హత్యాచారానికి గురైన గిరిజన బాలిక (12) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హామీనిచ్చారు. నిందితులు ఎవ్వరినీ వదిలిపెట్టబోమని.. కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బాలిక సొంతూరు లక్ష్మాతండాకు వెళ్లిన సీతక్క.. బాలిక తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. వారికి నిత్యావసర సరుకులు, రూ.75 వేల నగదును సాయంగా అందించారు. హైదరాబాద్ కలెక్టర్‌కు ఫోన్ చేసి బాలిక మృతిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా ప్రాంతంలో గిరిజన బాలికలపై అత్యాచారాలు ఎక్కువ జరుగుతున్నాయని, పదేళ్లుగా హైదరాబాద్, ఇతర ముఖ్య పట్టణాలు, నగరాలు, జిల్లా కేంద్రాలతో పాటు, మండల కేంద్రాల్లో యువత గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషసంస్కృతిపై ఉక్కుపాదం మోపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారన్నారు. సీతక్క వెంట ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రు నాయక్ ఉన్నారు.

ఈసెట్ మొదటి దశలో 8,982 మందికి ఇంజనీరింగ్, ఫార్మసీ సీట్ల కేటాయింపు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈసెట్ కౌన్సెలింగ్ మొదటి దశలో భాగంగా సోమవారం 8,982 మంది అభ్యర్థులకు ఇంజనీరింగ్, ఫార్మసీ సీట్లను కేటాయించారు. ఇందులో 8,951 ఇంజనీరింగ్ సీట్లు (70శాతం), 31 ఫార్మసీ సీట్ల (2.6శాతం)ను కేటాయించారు. ప్రస్తుతం సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోపు ఫీజు చెల్లించి రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ గడువులోపు ఫీజు చెల్లించకుండా రిపోర్టింగ్ చేయకపోతే కేటాయించిన సీటు రద్దవుతుంది. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు తుది దశ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఈసెట్‌లో మొత్తం 22,365 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. కౌన్సెలింగ్‌లో భాగంగా వీరిలో 12,703 మంది వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకున్నారు. రాష్ట్రంలో 169 కాలేజీల్లో 12,785 ఇంజనీరింగ్ సీట్లు, 121 కాలేజీల్లో 1,180 ఫార్మసీ సీట్లున్నాయి.

నేడు టీజీపీజీఈసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పీజీఈసెట్ ఫలితాలను మంగళవారం సాయంత్రం 4 గంటలకు విడుదల చేయనున్నట్లు కన్వీనర్ డాక్టర్ ఎ.అరుణకుమారి తెలిపారు. జేఎన్‌టీయూలో జరగనున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వీసీ బుర్రా వెంకటేశం హాజరై ఫలితాలను ప్రకటిస్తారన్నారు. 4.15 గంటల నుంచి ఈ ఫలితాలను అభ్యర్థులు పీజీఈసెట్ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

రామయ్య గోత్రప్రవరల వివాదం.. నేడు భద్రాచలానికి విచారణ కమిటీ

» విశ్రాంత, ప్రస్తుత వైదిక సిబ్బంది అభిప్రాయ సేకరణ

భద్రాచలం, జూన్ 17: భద్రాద్రి రామయ్య గోత్ర ప్రవరల వివాదంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఏర్పాటైన ఐదుగురు సభ్యుల విచారణ కమిటీ మంగళవారం భద్రాచలానికి రానున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విశ్రాంత, ప్రస్తుతం పనిచేస్తున్న ఆలయ వైదిక సిబ్బంది నుంచి అభిప్రాయాలను సేకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. భద్రాచలంలోని వివిధ ఆధ్యాత్మిక సంస్థలు, సంఘాలు, ప్రముఖుల వివరణను కూడా కమిటీ నమోదు చేసుకోనున్నట్లు సమాచారం. ఈ విషయమై ఇప్పటికే దేవస్థానం అధికారులకు స్పష్టమైన సమాచారం అందినట్లు తెలిసింది. అయితే.. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున.. ఆయా వర్గాలు వ్యక్తం చేసే అభిప్రాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతోపాటు ఆలయంలో జరిగే వైదిక కార్యక్రమాలను కూడా కమిటీ పరిశీలిస్తుందని.. దేవాదాయ కమిషనర్ హనుమంతరావు కూడా ఈ పర్యటనలో పాల్గొంటారని తెలుస్తోంది.

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

» ద ఫ్యాక్టరీ-వై, ఐఈఎస్ సంస్థల మధ్య ఒప్పందం

హైదరాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తమ సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం ఎంతో ఉపయోగపడుతుందని ద ఫ్యాక్టరీ-వై, ఇండో యూరో సింక్రొనైజేషన్(ఐఈఎస్) సంస్థల ప్రతినిధులు అన్నారు. టీహబ్-2లో దఫ్యాక్టరీ-వై వ్యవస్థాపకులు ఫిలిస్ అస్మస్, ఇండో యూరో సింక్రొనైజేషన్ ప్రెసిడెంట్, ఎండీ రాజ్ వంగపాడు సోమవారం ఒప్పందంపై సంతకాలు చేశారు.ఇది కొత్త ఆలోచనలను ప్రోత్సహించి, వాటిని వ్యాపారస్థాయికి తీసుకెళ్లేలా ఉపకరిస్తుందని చెప్పారు.



సాగర్‌క్రస్ట్ గేట్లను పరిశీలిస్తున్న కేఆర్‌ఎంబీ చైర్మన్ అశోక్ గోయల్

'సాగర్' నిర్వహణ పనులు వేగంగా పూర్తిచేయాలి

» కేఆర్‌ఎంబీ చైర్మన్ అశోక్ గోయల్

నాగార్జునసాగర్, జూన్ 17 : వానాకాలం వరద సీజన్‌కు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉన్నందున నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కేఆర్‌ఎంబీ(కృష్ణానది యాజమాన్య బోర్డు) చైర్మన్ అశోక్ గోయల్ అధికారులకు సూచించారు. ఆయన నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సాగర్ ప్రధాన డ్యాం క్రస్ట్ గేట్ల పైకి ఎక్కి వాటి పని తీరు ఎలా ఉందని ప్రాజెక్టు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన డ్యాంపై సూట్ గేట్లు, క్రేన్ ట్రాక్, క్రస్ట్ గేట్లకు గ్రీజు, రబ్బర్ సీళ్ల చెకింగ్ వంటి పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. స్పిల్‌వే మరమ్మతు పనులను పరిశీలించి అక్కడక్కడ ఉన్న చిన్న చిన్న గుంతలను పూడ్చే పనులను వరదలు వచ్చే నాటికి పూర్తిచేయాలన్నారు. అనంతరం ప్రధాన జల విద్యుత్ కేంద్రంలోకి వెళ్లి అక్కడ ఈ ఏడాది చేసిన విద్యుదుత్పత్తి వివరాలను జెన్‌కో అధికారులను అడిగి తెలుసుకున్నారు.

హైదరాబాద్‌లో అల్లర్లకు బీజేపీ కుట్ర: పుష్పలీల

» బీఆర్ఎస్ పాలనలో ప్రశ్నిస్తే కేసులు: బల్మూరి

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని బీజేపీ అల్లర్లు సృష్టించడానికి కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి పుష్పలీల ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆమె మాట్లాడారు. బీజేపీ కుట్రల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్ ట్యాపింగ్, విద్యుత్తు అక్రమాలు చేసిన నాయకులను కేసీఆర్ విదేశాల్లో పెట్టి ఇక్కడికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేసి జైల్లో పెట్టారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం సృష్టించిన సమస్యలు పరిష్కరిస్తూ విద్యార్థులకు న్యాయం చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జీవో 55 రద్దు చేశామని, వివిధ శాఖల్లో ఖాళీ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. ఆరు నెలల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా.. అని కారు పార్టీ నేతలకు సవాల్ విసిరారు.

తొలి ఏకాదశి నుంచి రుణమాఫీ!

జూలై 17న మొదలు పెట్టి ఆగస్టు దాకా 3 విడతల్లో ప్రక్రియ పూర్తి



హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీని తొలి ఏకాదశి, అంటే జూలై 17న మొదలుపెట్టనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రుణమాఫీ ప్రక్రియను జూలైలోనే ప్రారంభిస్తే అప్పటికే వ్యవసాయ పనులు ముమ్మరమై పెట్టుబడి అవసరమైన రైతులకు మళ్లీ రుణం తీసుకునేందుకు అవకాశం కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జూలైలో ప్రారంభించి ఆగస్టు వరకు మొత్తం 3 విడతల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధుల సమీకరణ కొలిక్కివస్తుండటంతో.. అన్నదాతలకు హామీనిచ్చిన ఆగస్టు 15 వరకు కాకుండా.. ఒక నెల ముందుగానే ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. 'పీఎం కిసాన్' పథకంలో ఉన్న నిబంధనలనూ రుణమాఫీలో అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై దాదాపు తుది నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. దీని ప్రకారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆదాయ పన్ను కడుతున్న వారికి రుణమాఫీ అందేందుకు అవకాశం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, మిగతా చిన్న ఉద్యోగస్తులు కూడా వివిధ అవసరాల నిమిత్తం ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నారన్న అంశం తెరమీదకు వచ్చింది. రిటర్నులు దాఖలు చేశారన్న కారణంతో ఆ రైతులను మాఫీ నుంచి మినహాయించే అవకాశాలు లేవని, ఆదాయ పన్ను కడుతున్న వారినే మినహాయించే ఆలోచన ఉందని తెలుస్తోంది. ఆ మేరకు ఐటీ రిటర్నులు దాఖలుచేస్తున్న చిన్న రైతులకు, చిన్న ఉద్యోగస్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. వీటన్నింటిపై ఏంచేయాలనేదానిపై 4రోజుల్లో మంత్రివర్గ సమావేశం నిర్వహించి రుణమాఫీ అమలుకు తీసుకోవాల్సిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయనుంది. మరోవైపు పీఎం కిసాన్‌లో అమలుచేస్తున్న నిబంధనలను రుణమాఫీకి కూడా వర్తింపజేసినా ఈ పథకం కోసం రూ.25వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. రుణమాఫీకి అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు భూమి పాస్‌బుక్, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో పాటు బ్యాంకుల ఖాతాలను ప్రామాణికంగా తీసుకుంటారు. అదే విధంగా ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేవరకు రైతులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించేందుకు వీలుగా ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను కూడా ఏర్పాటుచేయనున్నారు.

దేవాదుల.. నత్తనడక!

20 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్న పనులు.. రూ.4,400కోట్లతో 2004లో ప్రాజెక్టుకు శ్రీకారం

- 6.21లక్షల ఎకరాలకు ఆయకట్టు పెంపు
- కొత్త రిజర్వాయర్లతో పెరిగిన అంచనాలు
- 2023లో రూ.17వేల కోట్లకు చేరిక
- ఇప్పటిదాకా ఖర్చైంది 13,911 కోట్లు
- ఇంకా రూ.3,588 కోట్లు అవసరం
- నిధులివ్వాలని ప్రజాప్రతినిధుల ఒత్తిడి

వరంగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం 2004లో దేవాదుల ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభం కాగా.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా మూడు దశల్లో 6.21లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యానికి నిధుల కొరత అడ్డంకిగా మారుతోంది. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు చూపిన తాత్సారం ఈ పథకానికి శాపంగా మారింది. రూ.4,400కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టును ప్రారంభించగా.. గత ఏడాది అది రూ.17వేల కోట్లకు పెరిగింది. ఇప్పటికే రూ.13,911.88కోట్లు ఖర్చు చేయగా.. మరో రూ.3,588కోట్లు విడుదల చేస్తేనే ప్రాజెక్టు పూర్తి అయ్యే అవకాశం ఉంది.

రీడిజైన్‌తో 6.21లక్షల ఎకరాలకు సామర్థ్యం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001 జూన్ 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దేవాదుల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాన చేశారు. రూ.4,400కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయితే, ఈపీసీ పద్ధతిలో టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రాజెక్టును రీడిజైన్ చేసింది. ప్రాజెక్టును మూడు దశలుగా విభజించి, అంచనా వ్యయాన్ని రూ.6,016కోట్లకు పెంచింది. ఏటా 38.182టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళిక రూపొందించింది. అయితే, పనుల్లో జాప్యం జరగడం, నిర్మాణ సామాగ్రి ధరలు భారీగా పెరగడంతో



దేవాదుల వద్ద గోదావరిపై ఇన్‌టేక్‌వెల్

2007లో మరోసారి ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.9వేల కోట్లకు పెంచింది. ఆ తర్వాత ముచ్చటగా మూడోసారి 2013లో రూ.13,900 కోట్లకు ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగింది. అయితే, దేవాదుల వద్ద గోదావరిలో 71 మీటర్ల నీటి మట్టంతో ప్రవాహం ఉన్నప్పుడే జలాలను ఎత్తిపోసేందుకు అవకాశం ఉండేది. తెలంగాణ ఏర్పడిన తరువాత దేవాదుల ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం పునఃసమీక్షించింది. దేవాదుల వద్ద నీటి లభ్యత 110 రోజులు మాత్రమే ఉంటుందని అంచనా వేసింది. ఈ సమస్యను అధిగమించేందుకు తుపాకులగూడెం వద్ద బ్యారేజీ నిర్మించింది. దీంతో ఎత్తిపోతల సామర్థ్యం 38.128టీఎంసీల నుంచి 60టీఎంసీలకు పెరిగింది. తద్వారా 6.21లక్షల ఎకరాలకు సాగునీరు, ఎస్సారెస్పీ పరిధిలోని మరో 7.50లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రామప్ప-పాకాల, రామప్ప-లక్నవరం లిఫ్టులు, కొత్తగా నష్కల్, నవాబుపేట, చీటకోడూరు, బొమ్మకూరు, లద్నూరు, తపాస్‌పల్లి, కన్నబోయినగూడెంలో రిజర్వాయర్లను ఏర్పాటు చేసింది. ఇందుకోసం మొత్తం 32,997 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా.. ఇప్పటిదాకా 29,650 ఎకరాలే సేకరించారు. 3వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించాల్సి ఉండగా.. 952 ఎకరాలు అర్బన్ ప్రాంతం పరిధిలో ఉండడంతో సేకరణ సాధ్యం కాలేదు. ఈ మేరకు 2023లో మరోసారి అధికారులు అంచనా వ్యయాన్ని పెంచగా.. రూ.17వేల కోట్లకు చేరింది.

భూగర్భ సొరంగం పూర్తి..

మొదటి దశలో దేవాదుల ఎత్తిపోతల పనులు 2009లోనే పూర్తి చేశారు. ఇందులో 45, 46 ప్యాకేజీలో కొన్ని పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రెండో దశ పనులు 2010లో పూర్తి చేయాల్సి ఉండగా, ఇంకా చాల ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూటరీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పథకంలో కీలకమైన మూడో దశ పనుల్లోనూ జాప్యం జరిగింది. ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలో మీటర్ల మేర సొరంగ నిర్మాణం గత ఏప్రిల్‌లోనే పూర్తయింది. దేవన్నపేట వద్ద అతిపెద్ద సర్జ్‌పూల్ నిర్మాణం సైతం పూర్తి కాగా.. వెట్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఇప్పటి దాకా విడతలవారీగా ప్రాజెక్టు కోసం రూ.13,911.88కోట్లను ఖర్చు చేయగా.. మరో రూ.3,588కోట్లు అవసరమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నిధులు విడుదల చేసి దేవాదుల పనులు పూర్తి చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితరులు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధులు విడుదల చేయాలని కోరారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి సైతం మంత్రి ఉత్తమ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.


కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి?

» నిర్ణయం తీసుకోలేదంటున్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. మంత్రి జూపల్లి కృష్ణారావుకు సన్నిహితుడిగా పేరుండడం, ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి ఆయన నుంచి ఒత్తిడి వస్తుండటం, కింది స్థాయి కార్యకర్తలు కూడా కాంగ్రెస్‌లోకి వెళ్దామని చెబుతుండడంతో ఆయన కూడా దాదాపుగా ఓకే అన్నట్లు తెలుస్తోంది. అయితే, కొన్ని షరతులు విధించడంతో.. ఆ విషయమై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. చర్చలు సఫలమైతే వెంటనే ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు గాను 12 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, గద్వాల జిల్లాలోని రెండు అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. అయితే, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి చెందడం, పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ గెలవడంతో సీఎం రేవంత్‌ను విమర్శించేందుకు ప్రతిపక్షాలకు ఓ అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలో సీఎం సొంత జిల్లాలో అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండాలన్న సంకల్పంతో పార్టీ ముఖ్య నేతలు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడితోపాటు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని సంప్రదించినట్లు తెలిసింది. ప్రస్తుతం గద్వాల విషయంలో చర్చలు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఆ స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత, కృష్ణమోహన్‌రెడ్డి మధ్య విభేదాలున్నాయి. ఆమె అదే పదవిలో ఉంటే తాను రాబోనని కృష్ణమోహన్‌రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు.. కృష్ణమోహన్‌రెడ్డి చేరితే తన భవిష్యత్‌కు గ్యారంటీ ఇవ్వాలంటూ వేం నరేందర్ రెడ్డి ద్వారా సీఎంను కలిసేందుకు సరిత ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో క్లారిటీ రాకపోతే చేరికలు నిలిచిపోయే అవకాశమూ ఉంది. అయితే, పార్టీ మారే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, కాంగ్రెస్ పెద్దలు ఒత్తిడి తీసుకువస్తున్నారని కృష్ణమోహన్‌రెడ్డి చెప్పారు.

28 మంది ఐపీఎస్‌ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)



ఉన్న అశోక్ కుమార్‌ను జగిత్యాల ఎస్పీగా.. అక్కడున్న సన్‌ప్రీత్ సింగ్‌ను ప్రభుత్వం సూర్యాపేట ఎస్పీగా నియమించారు. హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా ఉన్న సుబ్బారాయుడితోపాటు మరో నలుగురికి ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న పాటిల్ సంగ్రామ్‌సింగ్ గణపాత్రో, పి.సాయిచైతన్యకు తాజా బదిలీల్లో పోస్టింగ్‌లు లభించాయి. కొంత మంది ఎస్పీలు, డీసీపీల పనితీరు, వారిపై వచ్చిన ఆరోపణలను తాజా బదిలీల్లో పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎస్పీ ర్యాంక్ అధికారుల్ని బదిలీ చేసిన ప్రభుత్వం రెండో దశలో డీఐజీ.. ఆపై స్థాయి అధికారులను బదిలీ చేయనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడనున్నాయి. రెండో దశ బదిలీల్లో కీలక అధికారుల మార్పు ఉండే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

అధికారి పేరు	పోస్టింగ్
అశోక్ కుమార్	జగిత్యాల ఎస్పీ
సన్‌ప్రీత్ సింగ్	సూర్యాపేట ఎస్పీ
రాహుల్ హెగ్డే	హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ
ఎల్.సుబ్బారాయుడు	డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలి
టి.శ్రీనివాస రావు	జోగులాంబ గద్వాల ఎస్పీ
రితిరాజ్	ఏసీబీ జాయింట్ డైరెక్టర్
డీవీ శ్రీనివాసరావు	కొమురంభీం ఆసిఫాబాద్ ఎస్పీ
కె.సురేశ్‌కుమార్	బాలానగర్ డీసీపీ
జానకీ.డి	మహబూబ్‌నగర్ ఎస్పీ
హర్షవర్ధన్	సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ
విశ్వజిత్ కంపాటి	సీఐడీ ఎస్పీ
బి.రాజేశ్	శంషాబాద్ డీసీపీ
కె.నారాయణ రెడ్డి	వికారాబాద్ ఎస్పీ
ఎన్.కోటిరెడ్డి	మేడ్చల్ డీసీపీ
నితికపంత్	2వ బెటాలియన్ కమాండెంట్
పీజేపీసీ ఛటర్జీ	డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలి
శరత్‌చంద్ర పవార్	నల్లగొండ ఎస్పీ
జి.చందన దీప్తి	సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ
షేక్ సలీమా	వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ
ఎంఏ బారీ	డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలి
పాటిల్ సంగ్రామ్‌సింగ్	సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్
పి.సాయిచైతన్య	యాంటీ నార్కొటిక్ బ్యూరో ఎస్పీ
సాధన రష్మీ పెరుమాల్	నార్త్‌జోన్ డీసీపీ
రోహిణి ప్రియదర్శిని	7వ బెటాలియన్ కమాండెంట్
బి.రాంప్రకాశ్	డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలి
రాజమహేంద్ర నాయక్	వరంగల్ వెస్ట్‌జోన్ డీసీపీ
పి.సీతారాం	డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలి
ఎ.భాస్కర్	మంచిర్యాల డీసీపీ

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ బాధ్యతలు ఎవరికో?

- సునీల్ శర్మ పదవీ విరమణతో ఖాళీగా ముఖ్య కార్యదర్శి పోస్టు
- సమర్థుడైన అధికారిని నియమించే ఆలోచనలో సర్కారు
- రాష్ట్రంలో మరికొందరు ఐఏఎస్‌ల బదిలీలపైనా కసరత్తు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరికొందరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసే అంశంపై సర్కారు కసరత్తు చేస్తోంది. ఈసారి కొంత మంది సీనియర్ ఐఏఎస్‌లకు కూడా స్థానచలనం ఉండొచ్చని తెలుస్తోంది. శనివారం 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం.. కలెక్టర్లుగా ఉండి, బదిలీ అయిన 10 మంది ఐఏఎస్ అధికారులకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రస్తుతం వీరంతా వెయిటింగ్‌లో ఉన్నారు. వీపీ గౌతమ్, పి.ఉదయ్‌కుమార్, పమేలా సత్పతి, భవేశ్ మిశ్రా, యాస్మిన్ బాషా, జి.రవి, హరిచందన దాసరి, ఎస్.వెంకటరావు, ఇలా త్రిపాఠి, ఆల ప్రియాంకలకు పోస్టింగులు ఇవ్వాల్సి ఉంది. వీరితో పాటు కొంత మంది సీనియర్ అధికారులను కూడా బదిలీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో నియమితులై, ఇప్పటికీ కొనసాగుతున్నవారు, ఒకే పోస్టులో దీర్ఘకాలికంగా ఉన్నవారిని బదిలీ చేసే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో అత్యంత కీలకమైన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలకు ముఖ్య కార్యదర్శి లేరు. ఇప్పటి వరకు ఈ రెండు శాఖలకు కలిపి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సునీల్ శర్మ మే 31న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఈ పోస్టులో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు. కనీసం అదనపు బాధ్యతలను కూడా ఎవరికీ అప్పగించలేదు. ఈ బాధ్యతల కోసం రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సోమేశ్‌కుమార్ రెవెన్యూ శాఖతో పాటు వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల అదనపు బాధ్యతలను కూడా చూశారు. అదే మాదిరిగా తనకూ అవకాశం కల్పించాలంటూ ప్రభుత్వ పెద్దలతో నవీన్ మాట్లాడుతున్నారని తెలిసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కూడా ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో రాబడి ఎక్కువగా ఉండే ఈ రెండు శాఖలకు సమర్థుడైన అధికారిని నియమించాల్సిన అవసరం ఉంది. దీంతో ప్రభుత్వం తీవ్రంగానే కసరత్తు చేస్తోంది. సమర్థుడైన సీనియర్ అధికారిని నియమించడంపై దృష్టి పెట్టింది. ఇక రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, అదనపు సీఈవో లోకేశ్‌కుమార్, సంయుక్త సీఈవో సర్ఫ్‌రాజ్ అహ్మద్‌లను కూడా ప్రభుత్వంలోకి తీసుకోవాలని యోచిస్తోంది. వీరికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా ఎవరిని ప్రతిపాదించాలన్న అంశంపైనా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అధికారులకు సంబంధించిన రహస్య నివేదికలు, ఇంటెలిజెన్స్ రిపోర్టులను తెప్పించుకుని పరిశీలిస్తోంది. త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటోంది.

ఛత్తీస్‌గఢ్ కరెంటుతో.. 6 వేల కోట్ల భారం!

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాల మధ్య వివాదం ఇంకా తేలలేదు. రూ.1081 కోట్ల బకాయిలున్నట్లు తెలంగాణ చెబుతుండగా.. ఛత్తీస్‌గడ్ విద్యుత్తు సంస్థలు మాత్రం రూ.1715 కోట్ల బకాయిలున్నట్లు లెక్క చూపుతున్నాయి. ఈ బకాయిల వివాదంపై ఛత్తీస్‌గడ్ ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు కూడా చేసింది. వాస్తవానికి ఛత్తీస్‌గడ్ విద్యుత్తు ఏనాడూ సక్రమంగా సరఫరా కాలేదు. 2017 సంవత్సరం చివర్లో అందుబాటులోకి వచ్చిన ఈ విద్యుత్తు సరఫరా.. మొదలైనప్పటి నుంచీ అరకొరగానే జరిగింది. ఎన్నడూ వెయ్యి మెగావాట్లు సాఫీగా రాలేదు. ఇలా ఆశించిన సరఫరా లేకపోవడంతో తెలంగాణ డిస్కమ్‌లు తిరిగి బహిరంగ మార్కెట్లో విద్యుత్తు కొనుగోలు చేయాల్సివచ్చింది. దాంతో 2017 నుంచి 2022 వరకు విద్యుత్తు సంస్థలపై అదనంగా రూ.2083 కోట్ల భారం పడింది. 2022 ఏప్రిల్ నుంచి ఈ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

కారిడార్ బుకింగ్‌తో అదనపు నష్టం..

ఛత్తీస్‌గడ్ నుంచి విద్యుత్తును తెచ్చుకునేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)తో వెయ్యి మెగావాట్ల విద్యుత్తు సరఫరాకు కారిడార్‌ను తెలంగాణ బుక్ చేసుకోవాల్సి వచ్చింది. ఈ కారిడార్ కూడా విద్యుత్తు సంస్థలను మరింత రుణభారంలోకి నెట్టిందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. బుకింగ్ ఒప్పందం ప్రకారం.. విద్యుత్తు తెచ్చుకున్నా, తెచ్చుకోకపోయినా పీజీసీఐఎల్‌కు సరఫరా చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన విద్యుత్తు సరఫరా నిలిచిపోయాక కూడా రూ.638 కోట్లను అదనపు చార్జీల రూపంలో చెల్లించాల్సి వచ్చింది. వీటికితోడు గత ప్రభుత్వం కారిడార్ల బుకింగ్ విషయంలో చేసిన తప్పిదంతో మరింత నష్టం వాటిల్లిందని పేర్కొంటున్నాయి. ఛత్తీస్‌గడ్ నుంచి విద్యుత్తు సరఫరాకు కేవలం వెయ్యి మెగావాట్ల కారిడార్ సరిపోతుండగా.. నాటి ప్రభుత్వం మరో వెయ్యి మెగావాట్ల విద్యుత్తు సరఫరాకు కూడా అడ్వాన్సుగా కారిడార్ బుక్ చేసింది. అయితే.. ఛత్తీస్‌గడ్ విద్యుత్తు లభించే అవకాశం లేదని ఈ కారిడార్‌ను అర్ధాంతరంగా రద్దు చేసుకుంది. కానీ, ఈలోగానే జరగాల్సిన నష్టం జరిగింది. బుక్ చేసుకున్నందుకుగాను పరిహారం కింద రూ.261 కోట్లు చెల్లించాలని పీజీసీఐఎల్.. తెలంగాణ డిస్కమ్‌లకు నోటీసులు జారీ చేసింది. అవగాహన లేకుండా చేసుకున్న కారిడార్ ఒప్పందంతోనే ఈ సమస్య తలెత్తిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఛత్తీస్‌గడ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందానికి తెలంగాణ ఈఆర్సీ ఇప్పటివరకు ఆమోదముద్ర వేయలేదు. దీంతో.. ఈఆర్సీ ఆమోదం లేకుండా ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించిన వేల కోట్ల రూపాయలను అడ్డదారి చెల్లింపులుగానే పరిగణించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బడ్జెటేతర అప్పుల్లో తెలంగాణదే అగ్రస్థానం!

- ఇలాంటి రుణాలకు ప్రభుత్వాలు గ్యారెంటీ ఇస్తున్నాయ్
- దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలు అప్పులమయం
- అప్పుల కుప్పగా ఆంధ్రప్రదేశ్
- ఏపీ, పంజాబ్‌లలో ఆదాయాన్ని మించి వ్యయం
- ఎన్ఐపీఎఫ్‌పీ పత్రంలో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో కొన్ని రాష్ట్రాలు బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా అప్పులు చేస్తున్నాయని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ (ఎన్ఐపీఎఫ్‌పీ)' తెలిపింది. ఇలాంటి అప్పులకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు గ్యారెంటీ కూడా ఇస్తున్నాయని వెల్లడించింది. 'ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం)'కు అవసరమైన ప్రభుత్వ పత్రాల్లో ఈ అప్పుల ప్రస్తావన ఎక్కడా ఉండదని ఎన్ఐపీఎఫ్‌పీ విడుదల చేసిన పత్రంలో వివరించింది. 2021 మార్చి 31 నాటికి అన్ని రాష్ట్రాల బడ్జెటేతర అప్పులు కలిపి రూ.2,52,308 కోట్లు ఉన్నట్లు తెలిపింది. ఇలాంటి అప్పులున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలోను, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు ఉన్నాయని వెల్లడించింది. ప్రభుత్వ లెక్కల్లో ప్రస్తావన లేకుండా అదనంగా అప్పులు చేయడం వల్ల ఆర్థిక పరిస్థితులు ప్రమాదకరంగా మారతాయని ఎన్ఐపీఎఫ్‌పీ హెచ్చరించింది. ఇక ఈ లోపాయికారీ అప్పుల గురించి ప్రజలకు చెప్పకుండా తమకే వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరిందని, ఇది ఆర్థిక జవాబుదారీ విధానానికి, పారదర్శకతకు విరుద్ధమని పేర్కొంది. దేశంలో అప్పుల కుప్పగా మారిన 13 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉందని, ఆ రాష్ట్ర మొత్తం అప్పులు 2021లో జీఎస్‌డీపీలో 36.9 శాతం, 2024 నాటికి 33.5 శాతంగా ఉన్నట్లు వివరించింది. ఏపీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆదాయం కంటే వ్యయం భారీగా పెరిగిపోవడంతో నగదు అందుబాటులో లేక, సమస్యలు ఎదుర్కొంటున్నాయని తెలిపింది. నగదు అందుబాటులో లేకపోవడం వల్ల ఓవర్ డ్రాఫ్ట్, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొంది. మార్కెట్ రుణాలపై ఏపీ ఎక్కువగా ఆధారపడుతోందని తెలిపింది. తెలంగాణ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, మహారాష్ట్ర కూడా ఈ సమస్య ఎదుర్కొంటున్నాయని వెల్లడించింది.


పెద్దపులి దాడిలో దెబ్బతిన్న కారు

కారుపై పెద్దపులి దాడి.. ప్రయాణికులు క్షేమం

మర్రిపాడు, జూన్ 17: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఓ పెద్దపులి కారుపై దాడి చేసింది. దీంతో ఆ కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు. కడప జిల్లా గోపవరం మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి నెల్లూరులోని కళాశాలలో చేరేందుకు కారులో బయలు దేరారు. కారు కదిరినాయుడుపల్లి సమీపంలోకి వచ్చేసరికి పెద్దపులి ఒక్కసారిగా దాడి చేసింది. కారు వేగంగా వెళ్తుండటంతో కారు ముందుభాగంలో పెద్దపులి చిక్కుకుంది. దీంతో రోడ్డుపై కొంత దూరం పెద్దపులిని కారు ఈడ్చుకుపోయింది. అనంతరం కారు బ్రేక్ వేసి అదుపు చేసిన వెంటనే తీవ్రగాయాలతో పెద్దపులి కుంటు కుంటూ అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న అయిదుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న జిల్లా అటవీశాఖాధికారి(డీఆర్వో) రవీంద్రవర్మ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలు సేకరిస్తున్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో హైదరాబాద్ డ్యూటీ ఫ్రీ షాపింగ్ స్టోర్

శంషాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలోని డిపార్చర్ గేట్ 30 సమీపంలో హైదరాబాద్ డ్యూటీ ఫ్రీ షాపింగ్ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్టు సోమవారం ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. ప్రధాన డ్యూటీ ఫ్రీ స్టోర్‌లో షాపింగ్ చేయలేకపోయిన ప్రయాణికుల కోసం దీనిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ స్టోర్‌లో అంతర్జాతీయ ప్రయాణికుల అభిరుచులకు అనుగుణంగా లగ్జరీ ఉత్పత్తులు, సావనీర్స్‌తోపాటు ప్రత్యేక ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రయాణికులు తమ నిష్క్రమణ షెడ్యూల్ చివరి నిమిషంలో డ్యూటీ ఫ్రీ ఉత్పత్తుల షాపింగ్‌కు వీలు కలిగేలా హైదరాబాద్ డ్యూటీ ఫ్రీ షాపింగ్ స్టోర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

ఖైరతాబాద్ గణపతి పనులకు అంకురార్పణం

ఖైరతాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా వినాయక నవరాత్రుల సందర్భంగా హైదరాబాదులోని ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే మహా గణపతి పనులకు ఆదివారం అంకురార్పణ జరిగింది. ఈసారి ప్రతిష్ఠించబోయే విగ్రహానికి ఘనంగా కర్రపూజ నిర్వహించారు. నిర్జల ఏకాదశి సందర్భంగా ప్రారంభమైన ఈ పూజ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ... ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఏర్పాటై ఈ సంవత్సరానికి 70 సంవత్సరాలు పూర్తవుతున్నందున 70 అడుగుల విగ్రహాన్ని రూపొందించబోతున్నట్లు తెలిపారు.

మెదక్‌లో ప్రశాంత వాతావరణం

మెదక్ అర్బన్, జూన్ 17: మెదక్ జిల్లా కేంద్రంలో సోమవారం ప్రశాంత వాతావరణం నెలకొంది. శనివారం ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసిన నేపథ్యంలో ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో పట్టణంలో భారీగా పోలీసులు మోహరించారు. జిల్లా కేంద్రంలో 144 సెక్షన్‌ను కొనసాగిస్తున్నారు. మెదక్‌లో పరిస్థితి అదుపులో ఉందని.. అల్లర్లతో సంబంధం ఉన్న ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. అల్లర్ల ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 27 మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మెదక్‌లో జరిగిన దాడుల ఘటనకు కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, హిందూ వాహిని, బీజేపీ, బీజేవైఎంల ఆధ్వర్యంలో ఇచ్చిన జిల్లా బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఇక, పట్టణంలో సోమవారం ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

బక్రీద్ శుభాకాంక్షల పోస్టర్‌లో ఆవు బొమ్మ

- క్షమాపణ చెప్పిన భువనగిరి ఎమ్మెల్యే అనిల్

భువనగిరి టౌన్, జూన్ 17: బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్టు వివాదాస్పదమైంది. హ్యాపీ బక్రీద్ అంటూ ఎమ్మెల్యే పోస్టు చేసిన చిత్రంలో ఆవు బొమ్మ ఉండటం వివాదం రేపింది. దీంతో గోవధను ప్రోత్సహించేలా ఎమ్మెల్యే పోస్టు ఉందని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రత్నపురం బలరాం ఆధ్వర్యంలో భువనగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఓ వీడియోను విడుదల చేశారు. తన సోషల్ మీడియా టీం అవగాహన రాహిత్యంతో పొరపాటు జరిగిందని తెలిపారు. అందుకు తాను క్షమాపణలు చెబుతున్నానని అన్నారు.

గోరక్షకులకు బ్లాక్ డే బక్రీద్: రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 17: గోరక్షకులకు బక్రీద్ బ్లాక్ డే లాంటిదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్, ఉత్తమ్ పద్మావతి ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పిన విధానాన్ని తప్పుపట్టారు. గోవు షాడో వచ్చే విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్, ఉత్తమ్ పద్మావతి ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ టెంప్లేట్స్ తయారు చేసి పెట్టారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పెట్టిన పోస్టులు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు.

అల్లుడి మరణాన్ని తట్టుకోలేక అత్త మృతి

చేగుంట, జూన్ 17: అనారోగ్యంతో చనిపోయిన అల్లుడ్ని చివరి చూపు చూసేందుకు వచ్చి అత్త మృతిచెందిన విషాదకర సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం మక్కరాజ్‌పేట్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన మంగలి నర్సింహులు(52) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. అల్లుడు చనిపోయిన విషయం తెలిసి... సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం శ్రీగిరిపల్లికి చెందిన న్యాలపోగుల నర్సమ్మ(65) ఆదివారం సాయంత్రం మక్కరాజ్‌పేట్‌కు వచ్చింది. రాత్రి చాలాసేపటి వరకు అల్లుడు నర్సింహులు మృతదేహాన్ని వద్ద రోదిస్తూ మనోవేదనకు గురైంది. అక్కడే కొయ్యబారిపోయినట్లుగా ఉన్న నర్సమ్మను... అర్ధరాత్రి సమయంలో బంధువులు లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిసింది. అల్లుడ్ని కడసారి చూసుకునేందుకు వచ్చిన అత్త మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అటు భర్త, ఇటు తల్లి ఒకే రోజు మరణించడంతో నర్సింహులు భార్య లక్ష్మి గుండెలవిసేలా రోదించింది.

బక్రీద్ వేడుకల్లో సీఎం

- నవాబ్ మహబూబ్ ఆలం ఖాన్ నివాసానికి రేవంత్..
- హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రులు జానా, షబ్బీర్


సీఎం రేవంత్‌రెడ్డితో నవాబ్ మహబూబ్ ఆలం ఖాన్ కుటుంబసభ్యులు

బర్కత్‌పుర/హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినం సందర్భంగా హైదరాబాద్ బర్కత్‌పురలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం రాత్రి గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ ఎండీ నవాబ్ మహబూబ్ ఆలం ఖాన్ నివాసంలో బక్రీద్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలంఖాన్ కుటుంబ సభ్యులకు సీఎం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అన్వర్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ నవాబ్ ముజాహిద్ ఆలం ఖాన్ తదితర కుటుంబ సభ్యులతో కలిసి ఆయన భోజనం చేశారు. అనంతరం వారితో ఫొటోలు దిగారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రులు జానారెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లోనే కనిపిస్తున్నారు

- శాంతి భద్రతలను సమీక్షించరా?: పాల్వాయి

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో మెసేజ్‌లు పెడుతూ కనిపిస్తున్నారు తప్ప.. బాధితులను పరామర్శించడం లేదని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పెద్దపల్లి జిల్లాలో హత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి న్యాయం చేస్తామని సీఎం ప్రకటన చేసినా.. ఇంత వరకు న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రంలో రోజూ ఏదో ఒక చోట హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని.. వాటిపై కనీసం సమీక్ష చేసే సమయం రేవంత్‌కు లేదా..? అని ప్రశ్నించారు. కాగా, కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్న బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి.. హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. సెల్యూట్ తెలంగాణ పేరుతో బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు.

డీజే.. డ్రగ్స్ జాకీ

(మొదటి పేజీ తరువాయి)


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని శాండిల్య తెలిపారు. డీజేతో సంబంధాలు ఉన్నవారందరిపై నిఘా పెట్టామని చెప్పారు. డీజే కొంతకాలంగా పెద్దఎత్తున ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకుంటున్నట్లు నార్కొటిక్స్ బ్యూరో గుర్తించింది. గతంలో డ్రగ్స్ తీసుకున్నవారి జాబితాలో దొరికిన పేర్ల ఆధారంగా విచారణ నిర్వహించింది. కాగా, మత్తు పదార్థాల కట్టడి చర్యల్లో భాగంగా విద్యార్థుల బ్యాగులను వంద శాతం తనిఖీ చేయాలని విద్యాసంస్థలకు సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. లాకర్లనూ పరిశీలించాలని సూచించారు. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పలు కీలక సూచనలు చేశారు. డ్రగ్స్ నిరోధానికి సంబంధించి తనిఖీలపరంగా విద్యాసంస్థల సిబ్బందికి ఏవైనా ఇబ్బందులుంటే, విశ్రాంత పోలీసులను నియమించుకోవాలని పేర్కొన్నారు. యాంటీ డ్రగ్ కమిటీ (ఏడీసీ)లు మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థి మత్తు మందుతో దొరికితే.. వారి భవిష్యత్తు దృష్ట్యా వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జూనియర్లను బెదిరించి సీనియర్లు మత్తు పదార్థాలు సరఫరా చేయించే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలోనూ నిఘా ఉంచాలని నిర్దేశించారు. విద్యాసంస్థలతో పాటు బయట మరెక్కడైనా మత్తు పదార్థాల వాడకం, విక్రయాలపై సమాచారం ఉంటే టీజీ న్యాబ్ కంట్రోల్ రూమ్ నెంబరు 8712671111కు సమాచారం ఇవ్వాలని సందీప్ శాండిల్య కోరారు. కాగా, తనిఖీలు పెరగడం, కౌన్సెలింగ్ ఇస్తుండడంతో డ్రగ్స్ వాడకందారుల్లో మార్పు వస్తోందని తెలిపారు. కొద్ది నెలల క్రితం పట్టుబడ్డ యువతి పరివర్తన చెందిందని చెప్పారు.

తప్పతాగి వాహనాలు నడుపుతూ..

మద్యం మత్తులో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నిరోధించడానికి, తాగి వాహనాలు నడుపుతున్నవారిని అడ్డుకునేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో పెద్దఎత్తున యువత పట్టుబడ్డారు. కమిషనరేట్ పరిధిలో గత శనివారం శనివారం సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 2 వరకు 349 కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అత్యధికంగా మాదాపూర్ స్టేషన్ పరిధిలో 74 మంది పట్టుబడినట్లు వెల్లడించారు. వీరిలో 21-30 ఏళ్లలోపు వారు 172 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తర్వాత 31-40 ఏళ్లలోపు వారు 104 మంది, 41-50 ఏళ్లలోపు వారు 44 మంది ఉన్నారు. 11 మంది కనీసం స్టీరింగ్ పట్టుకునే స్థితిలో లేరు. 301 నుంచి 500 పాయింట్లు వచ్చిన మందుబాబులు 11 మంది ఉండడం గమనార్హం. 18-20 ఏళ్లలోపు వారు ఐదుగురు, 51-60 ఏళ్లలోపు వారు 18మంది, 60 ఏళ్లు దాటినవారు ఐదుగురు చిక్కారు. మత్తులో రోడ్డు ప్రమాదాలు చేస్తే.. ఎవరైనా మరణిస్తే.. ఐపీసీ సెక్షన్ 304 పార్టు-2 కింద కేసులు నమోదు చేస్తున్నామని, నిందితులకు పదేళ్ల జైలు శిక్ష పడుతుందని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ హెచ్చరించారు.

గంజాయి అలవాటు చేసి.. విక్రేతలుగా మార్చి

యువతకు గంజాయి అలవాటు చేసి.. వారినే ఏజెంట్లుగా మార్చుకుని విక్రయిస్తున్న ఏపీకి చెందిన తండ్రీ కుమారులతో పాటు మరో పదిమందిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజశేఖర రాజు వివరాల మేరకు.. ఏపీలోని గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన సాకేటి పోలినాయుడు(46) వ్యవసాయ కూలీ. అతడి కుమారుడు తిరుపతి నారంనాయుడు అలియాస్ దాదు (28) డ్రైవర్. వారికున్న పరిచయాలతో విశాఖ జిల్లా పాడేరుకు చెందిన బాబీ వద్ద 10 కిలోల గంజాయిని కొని రైలు, బస్సుల్లో పల్నాడు జిల్లా దాచేపల్లికి తరలిస్తారు. చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి తెలంగాణ సరిహద్దు మండలాల యువతకు విక్రయిస్తున్నారు. తర్వాత వారికే విక్రయం బాధ్యత అప్పగిస్తున్నారు. గంజాయి అమ్మేందుకు పోలినాయుడు, తిరుపతి సోమవారం దామరచర్ల మండలానికి వచ్చారు. బొత్తలపాలెం శివారులోని రైల్వే అండర్‌పాస్ వద్ద వీరిద్దరితో పాటు 10 మందిని వాడపల్లి ఎస్‌ఐ రవికుమార్ అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు కొంగ ప్రకాష్ (19-అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం), నందిపాటి నవీన్ (23-పాలకవీడు మండలం శూన్యపహాడ్), సిగపట్ల మహేష్ (22-దామరచర్ల), కలిమెల కిశోర్ (23-దామరచర్ల మండలం వాడపల్లి), వీరభద్రాపురం తురక రమేష్ (27), మిర్యాలగూడ షాబునగర్ సంగోజు కార్తీక్ (19), రెడ్డికాలనీ జగతికుమార్ (25), ఈదులగూడెం జగతి కోటేష్ (24), షాబునగర్ షేక్‌ఖాజా (24), శాంతినగర్ ముడావత్ రమేష్ (24)ను అదుపులోకి తీసుకుని, రూ.90వేల విలువైన 6 కిలోల గంజాయి, రూ.46 వేల నగదు, 3 బైక్‌లు, 12 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.


అంబులెన్స్‌లోనే ప్రసవం చేసిన 108 సిబ్బంది

కాన్పుకు సమయముంది ఇంటికెళ్లు

- గర్భిణిని పంపేసిన మాతాశిశు సంరక్షణ కేంద్రం వైద్యులు
- నొప్పులు తీవ్రమై 108లో ప్రసవం

గుండాల, జూన్ 17: ప్రసవానికి ఇంకా సమయం ఉందంటూ పురిటి నొప్పులతో వచ్చిన గర్భిణిని 100 కి.మీల దూరంలో ఉన్న ఇంటికి తిప్పి పంపేశారు ఓ మాతాశిశు సంరక్షణ కేంద్రం అధికారులు. ఆ తర్వాత కొన్ని గంటలకే నొప్పులు ఎక్కువవడంతో ఆస్పత్రికి వెళ్తున్న క్రమంలో 108 వాహనంలోనే ఆ గర్భిణికి ప్రసవమైంది. భద్రాద్రి జిల్లా గుండాల మండల కేంద్రానికి 15 కి.మీల దూరంలోని నాగారం గ్రామానికి చెందిన కల్తి నవ్యకు శనివారం రాత్రి పురుటి నొప్పులు మొదలయ్యాయి. ఉదయం వరకు వేచి ఉండి ఆదివారం ఉదయాన్నే గుండాలలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి నెలలు నిండకపోవడంతో కొత్తగూడెంలోని మాతాశిశు కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. వారి సూచన మేరకు గర్భిణిని అక్కడికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు ఒక ఇంజక్షన్ చేసి కాన్పుకు ఇంకా సమయం పడుతుందని చెప్పి ఇంటికి వెళ్లమన్నారు. దాంతో నవ్య నొప్పులతోనే ఆర్టీసీ బస్సులో 100 కి.మీలు ప్రయాణించి ఇంటికి చేరుకుంది. ఆదివారం రాత్రి మళ్లీ నొప్పులు ఎక్కువ అవ్వడంతో నాగారం నుంచి 108లో తీసుకెళుతుండగా వాహనంలోనే సుఖప్రసవం జరిగింది. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని నవ్య భర్త సురేష్, కుటుంబసభ్యులు ఆరోపించారు.

సురేశ్.. భేష్!

- కానిస్టేబుల్‌కు సీఎం అభినందనలు



రాజేంద్రనగర్, జూన్17 (ఆంధ్రజ్యోతి): వాహనాల నియంత్రణ మాత్రమే తన డ్యూటీ అనుకోకుండా సాటి మనిషికి సాయం చేయడం తన బాధ్యత అని భావించిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేశ్‌కు సీఎం ఎ.రేవంత్ రెడ్డి ట్విటర్ ద్వారా అభినందనలు తెలిపారు. సురేశ్ సాయంతో సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకున్న యువతి యూపీఎస్సీ ప్రిలిమ్స్‌లో విజయం సాధించాలని ఆమెకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు బస్‌స్టాప్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సురేశ్‌కు పల్లెచెరువు సమీపంలోని మహవీర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్ష రాయడానికి వచ్చిన ఓ యువతి అప్పటికే ఆలస్యమై కంగారు పడుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న సురేశ్ వెంటనే ఆమెను తన బైకుపై పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయానికి తీసుకెళ్లాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన సీఎం.. సురేశ్‌ను అభినందించారు. కాగా, కానిస్టేబుల్ సురేశ్‌కు మంచి పేరుంది. అంకితభావంతో విధి నిర్వహణ చేస్తూ గతంలో హోంమంత్రి, పోలీసు కమిషనర్ల నుంచి మొమెంటో, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

24న శ్రీవారి దర్శన టికెట్ల విడుదల

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలకు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను టీటీడీ ఈనెల 24వ తేదీన ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ఎటీటీదేవస్థానమ్స్‌ఏపీ.జీవోవీ.ఇన్‌లో విడుదల చేయనున్నారు. అలాగే శ్రీవారి ఆర్జితసేవా టికెట్లను 18వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన భక్తులు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.

హైదరాబాద్‌లో భారీ వర్షం!

- రహదారులను ముంచేసిన వరద
- రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో 7.3 సెం.మీ.. లంగర్‌హౌస్‌లో 5.8 సెం.మీ వర్షపాతం నమోదు
- అప్రమత్తంగా అధికారులు: పొన్నం


టోలిచౌకి వద్ద కూలిన 200 ఏళ్ల నాటి వృక్షం

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో సోమవారం మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగళ్లు పడ్డాయి. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఈదురుగాలులకు పలుచోట్ల కూకటివేళ్లతో చెట్లు కూలిపోయాయి. టోలిచౌకి-గోల్కొండ ఎండీ లైన్స్‌లో 200 ఏళ్లనాటి భారీ వృక్షం కూలిపోయింది. ఈ ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. నాలుగు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. ఈదురుగాలులకు మధురానగర్ డీ-70 బ్లాక్‌లో భారీవృక్షం నేలకూలింది. ఈ ఘటనలో ఓ కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతింది. ఎర్రగడ్డ ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తాయి. ముషీరాబాద్, యూసుఫ్‌గూడ శ్రీ కృష్ణానగర్, బాలానగర్, సనత్‌నగర్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, లంగర్‌హౌస్, అసిఫ్‌నగర్, మెహిదీపట్నం, షేక్‌పేట, మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఫిల్మ్‌నగర్, అసిఫ్‌నగర్, పటాన్‌చెరువు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో రోడ్లపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద నీరు తొలగించేందుకు డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులో 7.3 సెం.మీ., లంగర్‌హౌస్‌లో 5.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో మరో రెండురోజుల పాటు ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం, రాత్రి సమయంలో ఈదురుగాలులు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశాలుంటాయని చెప్పారు. కాగా హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మ్యాన్‌హోల్ వద్ద ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని, విద్యుత్తు స్తంభాలు, చెట్లవద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు.


లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద వరద

నేడు, రేపు వర్షాలే

రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసినట్లు తెలిపింది. కరీంనగర్ జిల్లాల్లో 19.1 మిల్లీమీటర్లు, నిర్మల్‌లో 18, జయశంకర్ జిల్లాల్లో 17, ఆసిఫాబాద్ జిల్లాల్లో 14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. ఈ ఏడాది జూన్ 1 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదైందని, నిరుడు ఇదే సమయంలో కేవలం 13.5 మిలీమీటర్ల వర్షపాతం రికార్డవ్వగా, ఈ ఏడాది ఇప్పటివరకు 50.4 మిల్లీమీటర్లు నమోదైనట్లు వెల్లడించింది.

ఎక్కడా లేని నిబంధన ఇక్కడా?

- యూజీసీ నియమావళికి భిన్నంగా కాళోజీ వర్సిటీ వీసీ భర్తీకి నోటిఫికేషన్
- డీన్‌గా, ప్రిన్సిపల్‌గా అనుభవం తప్పనిసరి
- ప్రభుత్వ కళాశాలలో డీన్ ఎలా ఉంటారు?
- ప్రైవేటు వారికే అవకాశమివ్వాలనే ఉద్దేశంతోనే నిబంధన పెట్టారా?
- పెద్దగా రాని దరఖాస్తులు.. 4 రోజుల్లో ముగియనున్న గడువు

హైదరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉప కులపతి (వీసీ) ఖాళీ భర్తీ కోసం వైద్యశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలను ఏ మాత్రం పాటించలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి ఖాళీ భర్తీ కోసం ఈనెల 5న వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు పేరిట ఆ శాఖ ఓ ప్రకటన జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని అందులో కోరారు. అభ్యర్థుల దరఖాస్తులను రిజిస్టర్ పోస్టు ద్వారా ఆరోగ్యశాఖ కార్యదర్శికి పంపాలని ఆ ప్రకటనలో సూచించారు. ఉపకులపతి ఖాళీ భర్తీ కోసం కొన్ని అర్హతలను పేర్కొన్నారు. అందులో ప్రధానమైనది వైద్య రంగంలో కనీసం రెండేళ్లపాటు డీన్‌గా పనిచేసి ఉండాలి. లేదా వైద్య కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేసి ఉండాలి. ఇక పదేళ్ల విద్యాసంవత్సర అనుభవమూ ఉండాలి అని అందులో పేర్కొన్నారు. నిజానికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డీన్ అంటూ ఉండరు. కేవలం ప్రైవేటు వైద్య కళాశాలల్లోనే డీన్ పోస్టులుంటాయి. ఈ డీన్ పదం చేర్చడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటు వైద్య కళాశాలల్లో పనిజేసిన వారికే ఉపకులపతి పదవి కట్టబెట్టాలనే ఆలోచనతోనే ఈ డీన్ పదం చేర్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదేళ్ల విద్యాసంవత్సర అనుభవం అన్నది కూడా యూజీసీ నిబంధనలు విరుద్ధంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం పదేళ్లపాటు అధ్యాపకుడిగా పనిచేసి ఉండాలి. అయితే ఉపకులపతి ఖాళీ భర్తీకి సంబంధించి అర్హతల కోసం పదేళ్ల విద్యాసంవత్సర అనుభవం అన్నారు. అంటే అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేసిన వాళ్లకు కూడా ఈ పదవి కోసం అర్హత లభిస్తుంది. ఇటీవల రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు సంబంధించి ఉపకులపతుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లన్నీ యూజీసీ నిబంధనల మేరకే ఉన్నాయి. వాటిల్లో పదేళ్ల పాటు అధ్యాపకుడిగా పనిచేసి ఉండాలన్న నియమాన్నే పాటించారు తప్ప పదేళ్ల విద్యాసంవత్సర అనుభవం అని ఎక్కడా చెప్పలేదు. అలాగే వైద్యశాఖ పేర్కొన్న అర్హతలన్నీ కూడా అనుమానాలకు తావిచ్చే విధంగానే ఉన్నాయని అనుభవజ్ఞులైన అధ్యాపకులు అంటున్నారు. పాలనపరమైన అనుభవం విభాగంలో డీఎంఈ, అదనపు డీఎంఈ, డీన్, ప్రిన్సిపల్, వైద్య సంస్థ సంచాలకులుగా పనిచేసి ఉండాలన్న నిబంధన పెట్టారు. ఇది కూడా యూజీసీ నిబంధనలకు విరుద్ధమేనని అంటున్నారు. ఇలా ఎక్కడా లేని రూల్స్‌ను ఇక్కడే ఎందుకు పెడుతున్నారని సీనియర్ అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి గతంలో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం, కేఎన్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాల ఉపకులపతుల ఖాళీల భర్తీకి సంబంధించి ఇచ్చిన నోటిఫికేషన్లలో ఇటువంటి విచిత్రమైన నిబంధనలేవీ పెట్టలేదని వారు గుర్తు చేస్తున్నారు. కాగా వైద్య శాఖ ఉన్నతాధికారులు తమకు నచ్చిన వారికే కాళోజీ విశ్వవిద్యాలయ ఉపకులపతి పదవి కట్టబెట్టేందుకే ఇటువంటి నోటిఫికేషన్ ఇచ్చారని అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. అందుకే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై 13 రోజుల అవుతున్నప్పటికీ చెప్పుకోదగ్గ స్థాయిలో దరఖాస్తులు రాలేందని, ఐదారు దరఖాస్తులే వచ్చాయంటున్నారు. వాస్తవానికి ఇటువంటి నిబంధనలు లేకపోతే కనీసం 25-30 దరఖాస్తులు వచ్చేవని చెబుతున్నారు. డీన్‌గా రెండేళ్లపాటు పనిజేయాలన్న నిబంధనతో సర్కారులో పనిజేస్తున్న వారికి అర్హత లేకుండా పోయింది. అలాగే ప్రిన్సిపల్ అనే పదం చేర్చడంతో మనదగ్గర కొద్దిమందికే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. మరో నాలుగు రోజుల్లో దరఖాస్తుల ప్రక్రియ ముగియనుందని, ఇప్పటికైనా అర్హతలను మారిస్తే మరిన్న దరఖాస్తులొస్తాయని సూచిస్తున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 18 జూన్ 2024

కంటికి కనిపించదు, ప్రభావం మాత్రమే అనుభవంలోకి వస్తుంది. అదే విద్యుత్తు. ఇంట్లో బల్బు వెలగడం నుంచి నీళ్ళు పైకి ఎక్కించేందుకు ఉపయోగించే మోటారు పనిచేయడం వరకు దీనికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఆ వ్యవహారాన్నంతటినీ ఒక గొడుగు కిందకు తీసుకువస్తే అదే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్. దీనికి సంబంధించిన కెరీర్ వివరాలను చూద్దాం.

ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్



కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్ళలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్ళలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ వేలం వెర్రిగా కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్‌ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్‌ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్‌ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడెక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, టీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్‌ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా రిఫ్రాక్టరీస్ లిమిటెడ్, హెచ్‌బిఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, డిఫెన్స్ సర్వీసెస్, రిలయన్స్ పవర్, ట్రాకో కేబుల్ కంపెనీ లిమిటెడ్, నాల్కో, మైక్రాన్ ఎలక్ట్రికల్స్, బీడీఎల్, హాలోనిక్స్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, విప్రో లైటింగ్, ఎన్‌ఎండీసీలో అవకాశాలు ఉంటాయి. కోర్ ఎలక్ట్రికల్ కంపెనీలకు తోడు యాపిల్, ఐబీఎం, గూగుల్, శాంసంగ్, మైక్రోసాఫ్ట్, సోనీ కార్పొరేషన్, తోషిబా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, సీటీఎస్, ఒరాకిల్, ఇంటెల్, బోష్, ఎరిక్‌సన్, హెచ్‌పీ తదితరాల్లోనూ వీరికి అవకాశాలు ఉంటాయి. టెక్నో పార్క్‌లోని వివిధ ఐటీ సంస్థలు, స్మార్ట్ సిటీ, టెక్నో సిటీ, సైబర్ పార్క్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బెల్, సీడాక్, సీఎస్ఐఆర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కూడా ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు అవకాశాలు కల్పిస్తాయి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అవసరమైన నైపుణ్యాలు ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు విశ్వవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీ నేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొన్ని కంపెనీలు వీరిని తీసుకుని స్కిల్ పెంచే కార్యక్రమాలను చేపడుతున్నాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.

- అలాగే ఈ కెరీర్‌లో ఇన్నోవేషన్‌కు అవకాశం ఉంటుంది. ఇది డెస్క్ జాబ్ కాదు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకుంటే నైపుణ్యాల పెంపు, అనుభవం, క్రియేటివిటీతో ఎంత ఎత్తుకు ఎదగవచ్చో అర్థమవుతుంది. కొవిడ్ కాలంలో అందరూ ఇళ్ళకు పరిమితమైనప్పటికీ వీరికి తీరికలేదంటే అతిశయోక్తి కాదు. అంతరాయం లేకుండా విద్యుత్తు, వైఫై వంటి సదుపాయాలను కలిగించడంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు ఎంతో కృషి చేశారన్నది వాస్తవం. ఆరోగ్య పరిరక్షణలో అంటే అప్పట్లో ఆసుపత్రులకు అవసరమైన విద్యుత్తు సరఫరా, ఎలక్ట్రిసిటీతో పనిచేసే పరికరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడంలో వీరి పాత్ర అమోఘం. ఆర్థికమాంద్యానికి సైతం తలొగ్గని కెరీర్. మల్టీ డైమన్షనల్ కెరీర్ ఆప్షన్స్ ఉన్నాయి. ఇందుకోసం పోర్ట్‌ఫోలియోను పెంచుకోవాలి. పవర్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, రేడియో ఫ్రీక్వెన్సీ ఇంజనీరింగ్ ఈ ఆప్షన్స్‌లో కొన్ని. మల్టిపుల్ స్పెషలైజేషన్స్‌తో భిన్న కెరీర్లకు తద్వారా ఎదిగే అవకాశం ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు ఉంటుంది.
- ఏతావతా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఏమంత గొప్ప కెరీర్ కాదన్న అపోహ ఉంది. అది తప్పు అనడానికి పై ఉదాహరణలే చాలు.

ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

ఆర్‌జీఐపీటీలో బీటెక్, ఐడీడీ



అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ)- బీటెక్, ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ(ఐడీడీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024/జేఈఈ (మెయిన్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. బీటెక్ వ్యవధి నాలుగేళ్లు. ఐడీడీ వ్యవధి అయిదేళ్లు. ఇందులో బీటెక్, ఎంటెక్/ఎంఎస్ డిగ్రీలు పొందవచ్చు. మొత్తం 600 సీట్లు ఉన్నాయి. అదనంగా 106 సూపర్‌న్యూమరరీ సీట్లను మహిళలకు ప్రత్యేకించారు.

బీటెక్ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ 60, కెమికల్ ఇంజనీరింగ్(పెట్రో కెమికల్స్ అండ్ పాలిమర్స్ ఇంజనీరింగ్ 30, రెన్యూవబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ 30), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 60, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 50, మెకానికల్ 30, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 50, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్(అప్లయిడ్ పెట్రోలియం జియోసైన్స్) 20.

ఐడీడీ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ 40, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ పెట్రోలియం & నేచురల్ గ్యాస్ ఇంజనీరింగ్ 10.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు, కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(మెయిన్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే జేఈఈ మెయిన్ 2024 అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు సడలింపులు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1416; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రూ.708
- **మొదటి రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 7
- **మొదటి రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 9
- **మొదటి రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 15
- **సెకండ్ రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 18
- **సెకండ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 27
- **క్యాంపస్ రిపోర్టింగ్:** ఆగస్టు 9
- **రిజిస్ట్రేషన్:** ఆగస్టు 10
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** ఆగస్టు 10, 11
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ శిక్షణ

హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్(టీజీఎస్సీఎస్సీ)- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ప్రిలిమ్స్, మెయిన్స్) 2025నకు ఉచిత శిక్షణ అందిస్తోంది. ఇది ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. 2024 ఆగస్టు నుంచి పది నెలలు/ఎగ్జామ్స్ పూర్తయ్యేవరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. రాష్ట్రానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ-ఇ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 100 సీట్లు ఉన్నాయి. ఎస్సీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్టీ అభ్యర్థులకు 10 శాతం, బీసీ అభ్యర్థులకు 15 శాతం సీట్లు నిర్దేశించారు. మొత్తమ్మీద 33.33 శాతం సీట్లను మహిళలకు, 5 శాతం సీట్లను దివ్యాంగులకు ప్రత్యేకించారు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని గ్రాడ్యుయేషన్/ప్రొఫెషనల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలు మించకూడదు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ 2025 ఎగ్జామ్‌నకు నిర్దేశించిన అర్హతలన్నీ ఉండాలి. అభ్యర్థులు నిరుద్యోగులై ఉండాలి. ఇతర కోర్సులు చేస్తున్నవారు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తత్సమాన ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లో చేరినవారు, సివిల్ సర్వీసెస్‌కు సంబంధించి తెలంగాణ ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ స్టడీ సర్కిళ్లలో ఇప్పటికే శిక్షణ పొందినవారు దరఖాస్తుకు అనర్హులు. రాష్ట్రంలోని 12 టీజీఎస్సీ డిస్ట్రిక్ట్ స్టడీ సర్కిళ్లలో అయిదు నెలల ఫౌండేషన్ కోర్సు పూర్తిచేసినవారు; ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించిన షార్ట్ టర్మ్ కోర్సుల్లో కోచింగ్ తీసుకొన్నవారు; గ్రూప్స్-2, 3, 4 సర్వీస్‌లకు సంబంధించిన స్పెషల్ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్ ఎగ్జామ్‌లో మాదిరిగానే మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ స్టడీస్(పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ, హిస్టరీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కల్చర్ అండ్ సోషల్ ఇష్యూస్, కరెంట్ అఫైర్స్) అంశాల నుంచి 100 ప్రశ్నలు; రెండో పార్ట్‌లో సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సీశాట్) పేపర్ 2 అంశాలైన టెస్ట్ ఆఫ్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్‌ల నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. జనరల్ స్టడీస్ ప్రశ్నలకు ఒక్కోదానికి రెండు మార్కులు; సీశాట్ పేపర్ 2 ప్రశ్నలకు ఒక్కోదానికి రెండున్నర మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 300. తప్పుగా గుర్తించిన సమాధానానికి మూడోవంతు మార్కు కోత విధిస్తారు.

- జనరల్ స్టడీస్ ప్రశ్నలన్నీ ఆరోతరగతి నుంచి పన్నెండోతరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ఉంటాయి. ఈ పార్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగానే అభ్యర్థుల మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. రెండో పార్ట్‌లో నిర్దేశించిన ప్రకారం అర్హత మార్కులు వస్తే చాలు. ఇందులో కనీసం 33 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూలై 17 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్ కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 21
- **వెబ్‌సైట్:** http://tsstudycircle.co.in

ఐఐఐటీఎంలో ఎంబీఏ



కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఏబీవీ-ఐఐఐటీఎం), గ్వాలియర్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ అండ్ సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అంశాలతో పాటు రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, రైటింగ్ కాంప్రహెన్షన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** జూలై 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 4
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 11
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం గ్వాలియర్ - 474015
- **వెబ్‌సైట్:** www.iiitm.ac.in


లిటిల్స్



నక్క ఉపాయం

వీరభద్ర పురం పక్కనున్న అడవిలో ఉన్న చిన్న చెరువులో ఒక మొసలి ఉండేది. ఆ చెరువులో ఉండే చేపలన్నిటినీ అది తింటూ ఉండేది. అదే చెరువులో నివసించే పీతకు ఈ మొసలికి మంచి స్నేహం. కొంత కాలానికి ఆ మొసలికి అక్కడి చేపలు తినీతినీ విసుగు పుట్టింది. అది తన నేస్తమైన పీతను పిలిచి నాకు రోజూ ఈ చేపలే తినాలంటే విసుగ్గా ఉంటోంది. వేరే ఏదైనా జంతువు ఆహారంగా దొరికితే బాగుంటుంది. 'నువ్వు అడవిలోకి వెళ్లి అక్కడి జంతువులకు మొసలి చనిపోయిందని చెప్పు, ఆ మాటనమ్మిన జంతువులన్నీ ఇక్కడికి నీళ్లు తాగడానికి వస్తాయి. అపుడు నేను ఏదో ఒక జంతువును పట్టి తింటాను' అని చెప్పింది. దాని మాటలకు సరే అన్న పీత అలాగే అడవిలోకి వెళ్లి 'మిత్రులారా చెరువులోని మొసలి చచ్చిపోయింది, ఇక మనకేం భయం లేదు అందరూ అక్కడికి వచ్చినీళ్లు తాగండి' అని చెప్పింది. పీత మాటలు అన్ని జంతువులు నమ్మాయి కానీ ఒక నక్క మాత్రం నమ్మలేదు. అందులో ఏదో మోసం ఉంది అనుకున్నది. ఐనా ఆ నక్క మిగతా జంతువులతో పాటు చెరువు దగ్గరకు వెళ్లి, అందరికీ వినిపించేటట్లు ఇలా అన్నది. 'మిత్రులారా నా మిత్రురాలైన ఒక గుడ్లగూబ చెప్పిన దాని ప్రకారం మొసలి చనిపోయినా దాని తోక మాత్రం కదులుతూనే ఉంటుంది. ఈ మొసలి తోక కదిలితే ఇది చనిపోయిందని మనం నమ్మవచ్చు అన్నది. ఆ మాటలు విన్న మొసలి తాను చనిపోయానని నమ్మించడం కోసం తన తోకను వెంటనే మెల్లగా కదిలించడం మొదలు పెట్టింది. అది చూసిన నక్క' నేను అనుమానించినట్టే ఈ మొసలి చనిపోలేదు, బ్రతికే ఉంది. ఏదో ఒక జంతువును పట్టుకుని తినడానికి అది పీతతో కలిసి ఇంత నాటకం ఆడింది' అనుకుని, మిగతా జంతువుల దగ్గరకు వెళ్లి వాటి చెవిలో రహస్యంగా మొసలి ఆడిన నాటకం గురించి చెప్పింది. అసలు విషయం తెలుసుకున్న జంతువులు 'హమ్మయ్య గండం గడిచింది' అనుకుని, ఉపాయంతో అందరినీ కాపాడిన నక్కకు కృతజ్ఞతలు చెప్పాయి.


ఎన్ని ఏనుగులు? ఎన్ని రైనోలు?



7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 335

1	4		2		8			
		5	6					
				5	4			7
	6		4				5	3
	1	8				6	9	
3	5				9		8	
4			3	1				
					6	3		
			8		5		6	1

సుడోకు - 334 సమాధానం

2	8	5	6	7	4	9	1	3
1	4	3	8	5	9	7	2	6
9	7	6	1	2	3	4	8	5
8	3	9	5	6	7	1	4	2
7	6	4	3	1	2	5	9	8
5	1	2	4	9	8	3	6	7
3	5	8	9	4	6	2	7	1
4	2	1	7	8	5	6	3	9
6	9	7	2	3	1	8	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.